సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక

విరసం

మహాసభలకు

విప్లవాభినందనలు

195

జనవరి 1992

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

సృజన

ఆధునిక సాహిత్యవేదిక

195 మాసపత్రిక జనవరి 1992

ఈ సంచికలో ....

నిర్వహణ

'సాహితీమిత్రులు'

ఈ సంచిక రు. 5 సంవత్సర చందా రు. 50

Edited, Printed and Published by P. Hemalatha, Flat 3, Floor 2, Laxmi Apartments, Nalgonda Chourastha Malakpet, Hyderabad-500 036 and Printed at Nagendra Press, Vijayawada-520 002

Working Editor : Vara Vara Rao

మళ్ళీ అదే ప్రశ్న

ఇరవయ్యేళ్ళ తర్వాత విరసం గుంటూరులో మహాసభలు జరుపుకుంటున్నది. 1972లో మూడవ మహాసభలు జరిగాయి. ఈ నెలలో 14వ మహాసభలు జరుగుతున్నాయి. 22 ఏళ్ళ సభలు, మార్క్సియన్ సోషలిజం ధ్యేయంగా, మార్క్సిజాన్ని శాస్త్రంగానే కాక శస్త్రంగా స్వీకరించి ఖమ్మంలో కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి నగర్‌లో ప్రణాళికను ఆమోదించిన విరసం ముందుకు తొలిసారిగా ప్రణాళిక చర్చ ఇక్కడే వచ్చింది. విరసం సభ్యత్వానికి మార్క్సిజాన్ని ఆమోదించాలనే నిబంధన సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక రచయితల విశాల సంఘటనకు ప్రతిబంధకంగా వుంటున్నదని ఆనాడు ఆరంభమైన చర్చ ఇంకా కొనసాగుతునే వున్నది. సంస్థలో, 84 తర్వాత కొనసాగనప్పటికీ విప్లవ సాంస్కృతిక రంగంలో ఈ చర్చ ముగియలేదు. ఒక వైపు విరసం 74లో ఒకసారి, 84లో మరోసారి చర్చించి మార్క్సిజం అంటే ఈనాటి మార్క్సిజం–లెనినిజం మావో ఆలోచనా విధానం అని పునర్ నిర్వచించుకొని ఆ ప్రాపంచిక దృక్పథం వెలుగులో నడవాలని తీర్మానించుకుంది. మరొకవైపు 75లో ఒకసారి, 85లో ఒకసారి ఈ సైద్ధాంతిక విభేదం వల్ల కొందరు సభ్యులు విరసం నుంచి వెళ్ళిపోయి వారు వారు ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ ప్రణాళికలకు అనుగుణంగా సమాఖ్యలు ఏర్పరచుకున్నారు.

ఎవరి అనుభవాలు వారివి, ఎవరి గుణపాఠాలు వారివి. అందరూ ప్రజల ముందు తెరచిన పుస్తకాలే.

కాని విరసం ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత 79 వరంగల్ సాహిత్య పాఠశాలలో 'ఆత్మవిమర్శ' చేసుకొని తన ప్రణాళికకు కట్టుబడి వుంటూనే చైనా కమ్యూనిస్టు పార్టీ పదవ కాంగ్రెసు ప్రతిపాదించిన "ఐక్యంగా వుండండి, చీలిపోవద్దు, కుట్రలు కుహకాలు పన్నవద్దు, హృదయాలు తెరిచి వుండండి. (Be open), రివిజనిజాన్నికాదు మార్క్సిజాన్ని ఆచరించండి"–అనే ఆ సూత్రాల వెలుగులో ప్రజాస్వామ్య వాదులైన రచయితలలో ఐక్య కార్యాచరణకు చొరవ తీసుకోవాలని నిర్ణయించుకున్నది. నిజానికి చైనా శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం ప్రేరణతో వచ్చిన నక్సల్బరీ శ్రీకాకుళాలు విప్లవాచరణ ఎజెండాలోకి ఈ మూడు అంశాలను తెచ్చాయి. వర్గపోరాటం, ఉత్పత్తి, ప్రయోగం అని మావో ప్రతిపాదించిన మూడింటి

సమ్మేళనంలో ఏది ఉపేక్షించినా 'ఒక ధోరణిని సవరించే ప్రయత్నంలో ఏమరుపాటు మరొక ధోరణికి దారితీస్తుంది'. అందుకే విరసం రాశి కోసం వర్గపోరాటాన్ని, ప్రయోగాన్ని వదులుకోలేకపోయింది.

సాంస్కృతిక విప్లవం ఆత్మ విధ్వంసకం అని డెంగ్ ముఠా తీర్మానించి అప్పుడే దశాబ్దం గడిచింది. విలువల కోసం పోరాడుతూ 'విగ్రహ' విధ్వంసన చేసిన తరం పోరాటాలు విస్మరించి చైనా యువతరంలో కొందరయినా అమెరికాలో విగ్రహ ప్రాయమైన స్వేచ్ఛ వైపు ఆకర్షితులైన వాళ్ళు వుండొచ్చు. 1960 లలో ఎస్టాబ్లిష్‌మెంట్‌లో ఏ రంగంలోనయినా సరే రాజీలేని పోరాటం చేసిన నవయువకులు ఇప్పుడు ఎన్నింటితోనో సహజీవనం చేయడం అలవరచుకున్నారంటే అది పరిణతి అనుకోనక్కర్లేదు.

మన తెలుగు సాహిత్య సాంస్కృతిక రంగాలనే చూస్తే అకాడమీలను జీర్ణించుకున్న తెలుగు విశ్వవిద్యాలయం జ్యోతిష్యాన్ని శాస్త్రంగా నెత్తికెత్తికుంటూనే జానపద సాహిత్యానికి ఆచార్య పీఠం వేసింది. దిక్కులే నా అంబరాలని పాతికేళ్ళ కింద గర్జించిన నగ్నమునికి ఒంటి నిండా శాలువ కప్పింది. 'ఇవ్వాళ పాతికేళ్ళ 'భారతి'కి నేను కావలసి వచ్చానా' అని చలం అడిగినట్లు, అడగగలిగే నాన్ కన్ఫర్మిస్టులు కాదుకదా ఫ్రీలాన్స్ విప్లవ కవులూ లేరు. ఒక్కోసారి దారితప్పి విప్లవ రచయితలూ కనిపించడంలేదు. ('ప్రజను సాయుధం చేస్తున్న రెవల్యూషనరే నేడు కవి' అని, 70లో 'విప్లవ రయిచతలు'గా సమష్టిగా ఎలుగెత్తిన అజ్ఞాత కవుల స్పిరిట్ నొకసారి ఆవాహన చేసుకుందాం.)

'85 నుంచి విప్లవ కవిత్వం, విమర్శ స్పర్శ ఒక ప్రతిష్టగా అంతర్భాగం చేసుకున్న వ్యాపార పత్రికలు చాపకింది నీటివలె నిర్మాణ వ్యతిరేకతను వ్యాపింపచేస్తున్నాయి. కారణం ఒక వైపు 80ల నుంచి విప్లవం మన కళ్ళముందరి కఠోర నిజంగా ఆవిష్కరింపబడుతున్నది. దానిని అణచేయడానికి రాజ్యం టెర్రరిస్టుగా మారింది. మనకిప్పుడు విప్లవం ఫ్యాషన్ కాదుగదా ఆవేశంగా కూడా గ్రహించలేనంత వేడెక్కింది. వర్గాల మధ్యన సరిహద్దులు గీస్తూ సరిహద్దు భద్రతా దళాలను మనమధ్యకు పరుగెత్తించిన ఈ విప్లవ భూమధ్య రేఖ వేడికి తట్టుకొని నిలిచి పోరాడుతూ జీవించడమో, మరణించడమో తప్ప తాటస్థ్యానికి చోటులేదు. ప్రపంచమంతా సామ్యవాదం విఫలమయినా ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారన్నది ఇవ్వాళ

సూర్యోదయ మంతటి సత్యం. కనుక మాటల్లో విప్లవాన్ని ఆమోదిస్తునే, అది ఒక సంఘటిత శక్తిగా రూపొందకుండా జాగ్రత్తపడడం స్వార్థపరశక్తుల ప్రయోజనం, చాల అనిర్దిష్టంగా విప్లవాన్ని ఆమోదిస్తారు. కాని విప్లవ శాస్త్రమయిన మార్క్సిజం-లెనినిజాన్ని ఆమోదించరు. మార్క్సిజాన్ని మన్నిక చేస్తారు. కాని అది ప్రపంచాన్ని మార్చే తత్వశాస్త్రం కనుక దానినొక ఆచరణ సాధనగా చేపట్టాలంటే నిరాకరిస్తారు. ఆచరణ శాస్త్రంగా అంగీకరించిన చోటకూడ అది ఒక 'ఉక్కు క్రమశిక్షణ గల నిర్మాణం' ద్వారా మాత్రమే సాధ్యం అంటే అందులో ఒదగడానికి ఊపిరాడదు.

సారాంశంలో ఇది ఉదార భావవాదం తప్ప మరేమీకాదు. ముఖ్యంగా యుద్ధ సమయంలో ప్రజలకీ ప్రేక్షకుల గేయాలు గాయాలను కడుగలేవు.

విప్లవోద్యమాన్ని బలపరచడం ఒక ఎత్తయితే అది సాకుగా (పోనీ నక్సలైటు/ తీవ్రవాద కార్యకలాపాలు ఒక సాకుగా) ప్రజల మీద అప్రకటిత యుద్ధం చేస్తూ విధ్వంసానికి పూనుకున్న రాజ్యహింసను ఖండించడం మరొక ఎత్తు.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ప్రపంచ బుద్ధిజీవులను ముఖ్యంగా పాశ్చాత్య దేశాల రచయితలను మాగ్జిం గోర్కీ అడిగిన ప్రశ్న, '68లో ఫ్రెంచి విద్యార్థి విప్లవంలో మేధావులను సార్త్ర్ వేసిన ప్రశ్న', 70లో తెలుగు రచయితలను విశాఖ విద్యార్థులు వేసిన ప్రశ్న అదే.

నువ్వు ఊహించుకుంటున్న స్వేచ్ఛా ప్రజాస్వామ్యాలకు సామ్యవాద వ్యవస్థలో స్థానం లేదు. రష్యా, చైనా తూర్పు యూరపు పరిణామాలు ఆ చేదు నిజాన్ని బయటపెట్టాయి-అనే అనుకుందాం. వీటికి ప్రత్యామ్నాయం గల్ఫ్ యుద్ధంలో వుందా? పెరిస్ట్రోయికా, గ్లాస్‌నాస్త్‌లతో ప్రారంభించి ఎల్త్సిన్‌కు తద్వారా బుష్‌కు దాసోహమన్న గోర్బచోవిజంలో వుందా? దేశాన్ని ఐ ఎం ఎఫ్‌కు తాకట్టు పెట్టి కాశ్మీర్, పంజాబు, అస్సామ్, ఈశాన్య రాష్ట్రాలు, ఆంధ్ర, తమిళనాడులలో అమలు చేస్తున్న రాజ్యహింసలో వుందా?

ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామిక శక్తులన్నీ సోషలిస్టు రష్యాపై పెట్టుకున్న ఆశలు, ఆకాంక్షల సంగతి అలావుంచి, ఫాసిజం, నాజీయిజంల నుంచి పార్లమెంటరీ ప్రజాస్వామ్యాలను కాపాడుకోవడానికి యూరప్ దేశాలు సోవియట్ యూనియన్‌ను ఆశ్రయించిన రెండో ప్రపంచయుద్ధం రోజులను గుర్తు చేసుకుందాం.

డీగాల్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న ఫ్రెంచి విద్యార్థుల్లో మావో ఇస్టులతో తనకు సంపూర్ణ ఏకీభావం లేకున్నా వాళ్ళ పోరాడే హక్కును బలపరిచే నైతిక బాధ్యతను చేపడుతున్నానన్నాడు సార్త్. (ఫ్రెంచి వలస విధానానికి వ్యతిరేకంగా అల్జీరియా ప్రజల పోరాటాన్ని బలపరిచిన తన కలం నోబెల్ శాంతి బహుమానాన్ని తిరస్కరిస్తోందని ప్రకటించాడు.)

నక్సల్బరీ శ్రీకాకుళ పోరాటాలతో ఏకీభావం కాకున్నా ఇందిరా వెంగళరావు హింసా రాజ్యాలను ఖండించిన కవులు, కళాకారులు ఎందరో వున్నారు. ప్రహ్లాదుడు విఫలమైన చోట రాక్షససంహారానికి నృసింహావతారం ఎత్తాల్సిందేనని ప్రజాకవి కాళోజీ రాజ్యహింస మీద ధ్వజమెత్తుతునేవున్నాడు.

ఇంక మన మౌనానికి, అలీనతకు కూడ తావులేదు సమయం లేదు. బరిమీద వచ్చి బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ నిలిచింది. ఇవ్వాళ ప్రశ్న మనం నక్సలైట్ల పక్షమా కాదా అన్నది కాదు, ప్రజల పక్షమా కాదా అన్నది. ప్రజల పక్షం నక్సలైట్లు వున్నారు గనుక మనకు అభ్యంతరం, ఇబ్బంది, భయం అనుకుంటే మనం టెర్రరిస్టు రాజ్యం నీడలో అసంకల్పితంగా నైనా చేరుతున్నామనే అర్థం. అపుడయినా మన జీవితాలకు గ్యారంటీ ఏమీ లేదు. గులాం రసూల్ పత్రికా రచయిత అయినందుకు 'ఎన్‌కౌంటర్' అయ్యాడు. సత్యంను ఇంటర్వ్యూ చేసినందుకో, ఎన్టీఆర్ నగర్ భూకుంభకోణంలో డిఎస్పీ పాత్రను బట్టబయలు చేసినందుకో, ఆలేరు వాడయి నందుకో, ఎందుకో ఒకందుకు ఏదో ఒక సాకుతో 'ఎన్‌కౌంటర్' అయ్యాడు. మరి విజయప్రసాదు ఎందుకయ్యాడు? హింసకు సాక్ష్యం మిగలకూడదు గనుక. అసమ సమాజంలో అన్నెం పున్నెం ఎరుగనివానికి అమ్మఒడి అందలం అవుతుందన్న ఆశ లేదు.

రాజ్యంహింస మౌన, అలీన సాక్షులను కూడా సహించదు. అయితే బహిరం గంగా నిర్ద్వంద్వంగా రాజ్యంహింసను సమర్థించు. లేదా అంతే బహిరంగంగా, నిర్ద్వం ద్వంగా రాజ్యహింసను ప్రతిఘటించు. మొదటి పని నీవే ఎంచుకొని, నువ్వు ఒక్క నివే రాజ్యానికి బానిసవై ఆ పని చేయవచ్చు. నీకా స్వేచ్ఛ వుంది. రెండోపని మాత్రం నువ్వు ఒంటరిగా చేస్తే దుస్సాహసమవుతుంది. ఎంత మంది కలిసివస్తే అందరిని కలుపుకొని, ఎంత బలహీనమైన నిరసన అయినా మొదలుకొని అంత బలవంతమైన ప్రతిఘటన దాకా కూడగట్టి విప్లవ రచయితలు సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక ప్రజాస్వామిక శక్తులను ఐక్యంగా కదిలించాల్సిన చొరవకు ఇది అదను. ఈ సవాల్‌ను విరసం స్వీకరిస్తుందనడానికి ఈ ఇరవై రెండేళ్ళ చరిత్రయే భరోసా.

3-1-92

—సంపాదకుడు

'సముద్రుడు' కవితలు రెండు

ఊరు

తూకం వేసింది పశువుల కాళ్ళకింద
నలిగిపోవడానికా ?
పొట్టకొచ్చిన పంట వుంది వూరు మీదొదిలిన
అంబోతులు పడడానికా !
చేతికెదిగిన కొడుకులుంది పోలీసులు
కుళ్ళబొడవడానికా ?
చిన్న చిన్న కూనలుంది అనాథల్ని
చేయడానికా ?
ఏందిది ?
పోలీసులా ?
పంట పొలాలమీద దొంగగొడ్లు
పడ్డట్టు లాగుంది
ఇదేం ఘోరం ?
ప్రాణమా ? పాదాలకింద తృణమా ?
ఎవరు తల నిలబెట్టినా
మడుసు లిరగ్గొట్టుడేంది ?
వూరి మీదొక్కడు ఓటెయ్యకపోయినా
అందరికి మూడినట్లె గదా !
ఇదేంది ?
హక్కా ? ఆరాటమా ?
జీవితమా ? పోరాటమా ?
వూరు వూరంతా నలిగిపోయిందేంది
పురుగు రెమ్మ మీదికి సవాలిసిరినట్లు
ప్రజలమీద పీడి యుద్ధమేంది ?

తన నోట్లో మన వేలు పెట్టమంటాడు

మన వేలును మన కంట్లోనే
పొడుసుకోమంటాడు

ఊరా ? వల్లకాడా ?
ఊరంత పశువులు పడ్డ
పొలం లాగుంది
మనసా ? బంజరు దొడ్డా ?
మనసు మనసంతా
రావిచెట్టు కింద కొంగరెట్ట వేసి
తెల్లగ జేసిన బండలాగైంది
ఇల్లా ? అంగడా ?
ఇల్లు ఇల్లంతా పశుల కొట్టంలా
రొచ్చు రొచ్చు చిందరవందరైందేంది ?
పోలీసులొచ్చిన ఊరు
దొంగలుపడ్డట్లు బీరి పోయింది
ఇంకేం చెప్పగలం
ఏ ఇత్తు మొలకెత్తినా బూట్లకింద నలిగిపోతుందే
ఏ పూవు పూసినా రెమ్మల్ని ఊడబెరికి
బోడిగా మిగులుతుంది
ఏ ఆలోచనా పక్షి ఎగిరినా రెక్కలు
తెగి అలా కూలబడి పోతుంది
ఏ మాట నిలబడి జూసినా కటకటాల్లో
నిరీక్షించాల్సిందే !
మా ఊరు ఆకాశంలో ఇంద్ర ధనస్సు
ఆలోచనలు రెక్కలు తొడిగి
గుండెల్లో ధైర్యం మొలిచి
జమ్మి చెట్టుమీది ఆయుధాలు
దించగల్గితే
ఎంత బాగుండును
జీవితాన్ని పరాధీనం చెయ్యం
భూస్వామి చేతుల్లోంచి విడివడిన జీవితం

స్వేచ్ఛగా ఊపిరి పీలుస్తున్న తరుణంలో –
మళ్ళీ వాడు 'సెల్'లో బంధించేస్తాడు
జీవితం తిరిగి పరాధీనం అవుతుంది
తరమబడినపుడు పంక్తి భోజనాలు
ఒకే ఆకులో కలగాపులగంగా
ఆత్రంగా తింటూనే వుంటాం !
జీవితం మాదన్నందుకు
ఉత్తపుణ్యానికే ఊర్లన్నీ ఖాళీ చేయిస్తున్నాడు
నిన్న జీవితం జరుగుబాటుకు
పట్టణాలకు వలస పోలేదు
ఈనాడు బూట్ల శబ్దాలకు
దూరంగా పలాయనం అవుతుంది
వాడి వేట నుండి తప్పించుకోవడానికి
అడవిని అవయవంగా అమర్చుకోక తప్పలేదు
వాడు జీవితాన్ని పరాధీనం చెయ్యదల్చాడు
మనం దాన్ని అంగీకరించం
పలాయనం మన జీవన విధానం కాదు
చిగుర్చే జీవితాన్ని వాడి చేతిలో
బందీగా వుంచలేం !
కళ్ళు మూస్తే భయం
తలుపు తెరిస్తే భయం
భయంలో వాడు మన జీవితాల్ని
ముంచెత్తాలని చూస్తున్నాడు
కుక్క అరిచినా భయం,
మోటారు చప్పుడయినా భయం
ఏ తల్లి ఏడ్చినా భయం,
ఏ ఒక్కడు 'లగాంచి' పరుగెత్తినా భయం
భయం ఊళ్ళోకి నిశ్శబ్దాన్ని తెస్తుంది
భయం నిరాశని నెత్తికెత్తుతుంది

భయం.... నీరుగారడం నేర్పిస్తుంది !
నిరాశ, నిస్పృహల్లో వాడు మన జీవితాన్ని
పరాధీనం చేయాలని జూస్తాడు
రాత్రి 'భాగోతులాడు కొమ్మన్న' వాడు
తెల్లవారి ముఖాలకు రంగులేందని
తంతూనే వుంటాడు !
భయం గుప్పిట్లో జీవితం బందీ అయితే
బ్రతుకు పరాధీనం అవుతుంది
క్షణ క్షణం భయం
క్షణ క్షణం చచ్చి బ్రతుకుతాం మనం
జీవితం పరాధీనమైతే, ప్రతిక్షణం
ఒక చావును జయించాలంటే
పరాధీనాన్ని పగులగొట్టాలి !
భయాన్ని మనసు నుంచి పారదోలాలంటే
జీవితం పోరాటం కావాలి !
వాడు తెగ్గొట్టిన తలలు తలెత్తి నిలుచుంటాయి
తలవంచడం అంటే మరణించడమని మనకు
తెల్సిందె గదా !
తెగిన తలలు తలెత్తి
వాడి పరాధీన పథకాన్ని చూసి
ఫక్కున నవ్వుతాయి
మనం చేరిపోవడం స్రవంతిలో మాత్రమే !
పోరాటానికి మాత్రమే విస్రములం కావడం తెలుసు మనకు
సమర్పిస్తే జీవితం ప్రజలకు మాత్రమే !
ఆశయానికి మాత్రమే జీవితాన్ని ఆధీనం చెయ్యడం
తెలుసు మనకు

(చెన్నారెడ్డి 'రిలాక్సేషన్ పీరియడ్' తర్వాత నిర్బంధం, జనార్ధన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి తెచ్చిన నిర్బంధాన్ని చూసి).

(2)

మంజీర రెండు మూడ్స్

ఎర్ర సైన్యమై తిరిగి వద్దాం

రండి ! బాధల్ని నెమరేసుకుందాం
కష్టాల్ని కలబోసుకుందాం
రండి ! రారండి ! పోరాటాన్ని పెనవేసుకుందాం
రండి ! ఓదార్చుదాం ! బాధాతప్త నగరాన్ని
'ఏకశిల'గా మిగిలిన శోక నగరాన్ని
రండి ! అక్కున చేర్చుకుందాం ! బిడ్డల్ని కోల్పోయిన తల్లిని
రండి ! పొగడుదాం ! పోరాటాల పురిటి గడ్డని
రండి ! ఇన్నాళ్ళూ శత్రువు చొరనివ్వని
విచ్చు కత్తుల నగరాన్ని వెల్లువలా ముంచెత్తుదాం
విజయ పతాక నెగరేద్దాం
ఉరుకుదాం, ఊరేగుదాం
ఆడుదాం, పాడుదాం, ఎరుపుమయం చేద్దాం
సభలు జరుపుకుందాం, సంబరాలు జరుపుకుందాం
బిడ్డల పండగ జేసుకుందాం, వీరుల పాట పాడుకుందాం

* * *

లక్షలుగా కదలి వచ్చాం, ఓరుగల్లును ఆక్రమించాం
శత్రు శక్తి ఏమీకాదని ఎలుగెత్తి చాటాం
అయినా ! కామ్రేడ్స్, ప్రజలారా !
మనమింకా గెలువలేదు
మనమింకా గెలువలేదు
ఎందుకంటే మనం నిరాయుధులం
వాడింకా సాయుధుడే
అందుకే ప్రజలారా ! అందుకోండి ఆయుధాలు
ఈసారి ఆయుధాలతో తిరిగివద్దాం

ఎర్ర సైన్యమై వద్దాం
ఓరుగల్లును ఆక్రమిద్దాం

[ప్రభాకర్ రెడ్డి నెత్తురొలికిన నేపథ్యంలో, వరంగల్ సభల నాటి అనుభవాలను గుర్తు చేసుకుంటూ]

సరిహద్దును రక్షించండి

రక్షించండి రక్షించండి
సరిహద్దును రక్షించండి
మార్కెట్ కై నిర్మించిన హద్దు
దోపిడికి ఎంచుకున్న సరిహద్దు
మనదేశ సరిహద్దుకు
ప్రమాదం ముంచుకొచ్చింది
రక్షించండి రక్షించండి
ఐ ఎం ఎఫ్ అప్పుకోసం
ఆంక్షలకు తలొగ్గి
'బహుళజాతి' దోపిడికి
బంగారు తివాచీ పరిచాం
సరిహద్దు దాటివచ్చే స్వేచ్ఛ
సగౌరవంగా ఇచ్చేశాం
పశ్చిమాన, ఈశాన్యాన
భద్రతకు భయంలేదు
సరిహద్దు భద్రతా దళాన్ని
ఇక్కడికే పంపండి
సియాచిన్ సరిహద్దు కావల
ఎరిగిన నేస్తం చేతిలోకే
ఎర్రజెండా వచ్చింది
ఇండో - టిబెటన్ ఫోర్సుకు
ఇంకెంతమాత్రం పనిలేదు

పంపించండి, వెంటనే
ఇక్కడికే పంపండి
మార్చమనే వాళ్ళకంటే
సరిహద్దులు మొత్తంగా
చెరిపేసే వాళ్ళే ప్రమాదం
సైన్యాన్నంతటినీ ఇక్కడికే పంపండి
దేశం నట్ట నడి బొడ్డున
తెలంగాణ పల్లెల్లో
అంతర్జాతీయ వాదులతో సరిహద్దుకు
అంతులేని ప్రమాదమొచ్చింది
గోసి, గొంగడిగాళ్ళు
ఎర్రజెండా చేతబట్టి
భూస్వామ్యం సరిహద్దును
నాగళ్ళతో దున్నేస్తున్నారు
అమాయకుల్లా కనిపించే
పల్లెటూరి పోరగాల్లు
ఆయుధాలు చేతబట్టి
దొరలు గీసిన హద్దులు
ధైర్యంగా చెరిపేస్తున్నారు
బయటి శక్తులతో సరిహద్దుకు
ముప్పేమీ లేనేలేదు
ఈ ప్రజలపైనే యుద్ధం చేసి
మన దోపిడీ సరిహద్దును
నిలబెట్టుకుందాము రండి
ప్రజాస్వామ్యం పడగను
కాపాడుకుందాము రండి
సరిహద్దు భద్రతా దళాలన్నీ
ఇక్కడికే పంపండి

చిరుగుపాత స్త్రీలైనా
బోసినోటి తాతైనా
ముక్కున చీమిడి కారే
మూడేండ్ల పిల్లలైనా
జాలి అసలే చూపకండి
అంతర్జాతీయ వాదులతో కుమ్మక్కై
మన దేశ సరిహద్దుకు
ముప్పు తెస్తున్నది వీళ్ళే
అందరినీ కొట్టండి
అన్నిటినీ కాల్చండి
యువకులైన వాళ్ళను
అస్సలుకే వదలకండి
కాల్చేసైనా వాళ్ళను
మన సరిహద్దును రక్షించండి
రక్షించండి రక్షించండి
సరిహద్దును రక్షించండి

హింసావాదిని నేను కాను...

విమాత్న

తుపాకులు మాట్లాడిన చోట
ప్రాణాలు పండిన ఆకుల్లా రాలిపోతాయి
ఏడిస్తే కన్నీరు కారినట్లుగా
గుండ్లు గుచ్చుకొన్నచోటు
కన్నైన రక్తాన్ని స్రవిస్తుంది
శత్రువుదయినా, మిత్రునిదయినా
బయటబడ్డ నెత్తురు గడ్డకట్టక మానదు
గడ్డ కట్టినంత గాయమైనపుడు
తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని

భయకంపితం జేస్తుంది - ఎక్కడో
జారిపోతున్న ప్రాణాల్ని లెక్కల్లో చేర్చేస్తుంది
వాడు - అహింసా ప్రబోధకుడై
తుపాకులతో మాట్లాడిస్తూ
నన్ను నోటితోనే మాట్లాడాలంటాడు
ఇదెక్కడి న్యాయం.... అయినా
తడారిన గొంతును సవరిద్దామన్నా
వెలువడని నా నిశ్శబ్దపు పలుకులు
'వాడి' తూటాల మోతల్లో ఎక్కడని వినగలడు
'వాడి' భాషలోనే నేనూ మాట్లాడినపుడు
నా మాటల్ని ఖచ్చితంగా వినగల్గుతున్నాడు
వాడి ఘోషను బట్టే నా భాష ఉండడం
తప్పయితే నేను కాదు వాడే దోషి!

నా దేశానికేం...

శ్రీశైల్ రెడ్డి

నా దేశానికేం! సు'భిక్షం'గా వుంది!
అడగండి - అమ్యెమ్మెఫ్ నయినా, వరల్డ్ బ్యాంక్‌నైనా!!
అంతదాకా ఎందుకు ఆర్థికమంత్రినైనా!!!
శాంతికాముక దేశం మనది
కావాలంటే రాజశేఖర్ రెడ్డి సాక్ష్యం
కాదంటే శివారెడ్డి నడుగుదాం
నిత్యం కళకళలాడుతోంది మనదేశం
అబద్ధమనిపిస్తే అడగండి ఏపీపీయస్సీ బిల్డింగ్‌నైనా
ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజీనయినా
ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోంది
బీహార్ నిండా అదే! నంద్యాలలోనూ అంతే!!
నవభారతం ముంగిటా ఈ తంతే!!!

అభద్రతా భావం అసలు లేదు
అడగండి - ఏ గుడిసెవాసినైనా,
సిఎం ఇంటిముందు ఇసుకబస్తానైనా

మతప్రసక్తిలేని 'లౌకిక' రాజ్యం మనది
అపునో కాదో 'లౌక్యు'డైన అద్వానీ నడగండి
కాకపోతే షాహీఇమామ్ బుఖారీ నడగండి

స్త్రీని గౌరవించే దేశమిది, అడగండి -
శీలపరీక్ష కోరిన రాముణ్ణైనా!
కన్యాత్వ పరీక్ష కోరిన మధ్యప్రదేశ్ అసెంబ్లీ సభ్యుణ్ణైనా

సభ్యతా సంస్కారాలు స్నానం చేస్తున్నాయిక్కడ
అనుమానముంటే అడుగుదాం
శివరాజ్ పాటిల్‌నైనా, శ్రీపాదరావునైనా

తేనెలొలుకు తెలుగు మనది, నిజం
'అసెంబ్లీ రౌడీ గారి పెళ్ళా'లను అభినందించిన
ఘెళుఘు వెళుఘుల మూర్తి 'అన్న'గారి నడుగుదాం

అద్భుతాలు సాధిస్తున్న బాలలు
నేడే ఓట్లేస్తున్న రేపటి పౌరులు
'మోతీగల్లీ' పన్నెండేళ్ళ వీరులు

సెన్సారు బోర్డులో శ్రీ వేంకటేశ్వరుడు
'చలన' రంగ చేతిలో రాజకీయాలు
ఐనవారికి అన్ని సదుపాయాలు, కానివారికి లేని కాల్‌షీట్లు

విజ్ఞానం, వినోదం అందించే వెండితెర దీపాలు
ఉత్తర దక్షిణాల 'దివ్య భారత' రూపాలు
యువతను 'శివ'మెత్తించే విన్యాసాలు

ఆర్టీసీబస్సులో ముందునుంచి దిగే
రూల్సు మాత్రమే తెలిసిన యువకులు
కులరొంపిలో బొంగరాలాడే బాలచంద్రులు

అభిప్రాయ భేదాలు లేకుండా
అంతా ఒక్కటై నిలుస్తారు
బస్సులా రైళ్ళూ తగలెట్టడంలో !

రెండు, మూడు పురుషార్థాలంటేనే మక్కువ
కాస్త 'మందు'టే ఏంకావాలి ఇంకా ఎక్కువ
దాదర్ ఎక్స్‌ప్రెస్ ఒక్కటే తక్కువ

ప్రాంతీయ రోగాలు, కావేరీ రాగాలు
కర్నాటకలో మరణ మృదంగాలు
'బంగారు' దేశంలో 'జయ' గీతాలు

గిరిజనులకు దక్కని 'పోడు' పొలాలు
హైదరాబాదులో శాసనసభ్యులకు ఇళ్ళస్థలాలు
'ఇంకు' ఇంకుతున్న మానవతా కలాలు

ఇక్కడంతా సులభం - వ్యయప్రయాసలనవసరం
అయిదుడజన్ల ఎంపీలుంటే అవ్వచ్చు దేశ ప్రధాని
కల్లోలాలు సృష్టించగలిగితే కావచ్చు ముఖ్యమంత్రి

జనసామాన్యమైనా, జడ్జిగారైనా
అందర్నీ సమాదరించే ఖాకీ లాఠీలు
అందుకు సాక్ష్యం గుజరాత్ ఎన్. ఎల్. పటేలు

ఖాకీల 'అమర కాండ', కత్తుల 'మర'కాండ
వీరందరికి రాజకీయుల అండదండ, అంతా దమనకాండ
పర్యవసానమా పూలదండలో పెరంబుదూరు ఉండ

సుధలు చిలికించే 'శ్లేష' కవులు
సరస కథలూ, సమరంజనులూ
లలితకళల మహాపోషక ప్రజలు

కథ :

నిర్ణయం

పి. చందు

వరలక్ష్మి సాయంత్రం మార్కెటు నుండి తిర్గి వచ్చింది. రెండు రోజులుగా ఇంట్లో నుండి ఎటు బయటికి కాలు పెట్టలేదు. గత నెల చివరి వారంలో మొద లయిన సమ్మె ఇంకా ఒక కొలిక్కి రాలేదు. మార్కెటు వీధుల్లో కొత్తగా దిగిన ఐదువేల మంది సి. ఆర్. పి. యఫ్. పోలీసులు కవాతు చేస్తున్నారు. ఎక్కడ చూసినా పోలీసులే కనిపిస్తున్నారు. బజారులో ఎరక్కపోయి ఎవరైన నిలుచొని ఉంటే పోలీసు లాఠీలు వాళ్ళ వొళ్ళు హూనం చేస్తున్నాయి. వరలక్ష్మి భర్త ప్రభాకర్ ఇంటినుండి ఎటు బయటికి కదలటానికి అవకాశం లేకుండా పోయింది. ఇంట్లో సరు కులు నిండుకున్నాయి. చేతిలో డబ్బు కూడా లేకుండాపోయింది. పండుగకు ఇచ్చిన వెయ్యి రూపాయల అడ్వాన్సు అందుకున్న తర్వాత సరుకులు తేవటం కోసం వరలక్ష్మి తానే బజారుకు వెళ్ళింది. ఇంతవరదాక వాళ్ళు వీళ్ళు అంటే విన్నదేకాని ఎంత నిర్బంధం ఉందో బజారుకు వెళ్ళితేకాని అర్థం కాలేదు.

బజార్ల నిండా రిజర్వు పోలీసులను చూసేసరికి ఆమెకు కొంత భయం కల్గింది. ఎర్రటి మొఖాలు, నెత్తిమీద అదోమాదిరి ఖాకీ టోపీలు, పొడవాటి తుపా కులు, మరికొంతమంది దగ్గర పొట్టి మిషన్ గన్స్‌తో ఎక్కడ చూసిన గుంపులు గుంపులుగా కనిపించే పోలీసులతో బజారు వాతావరణమే మారిపోయింది. బజారులో తిరగాలంటే ఎవరికైనా జడుపు పుడుతున్నది. దానికితోడు పొడవాటి లాఠీలతో ఎందుకు కొడుతున్నారో కూడా తెలియకుండా కనిపించిన వారినల్లా కొడుతుండటం వలన, ఎప్పుడు సాయంత్రాలు జనం జిబజిబలాడుతుండే మార్కెటులో అరకొర మనుష్యులు భయం భయంగా తిరుగుతున్నారు.

వరలక్ష్మితో కూరగాయల మార్కెటులో ఆలుగడ్డలు అమ్మే ముసలవ్వ "మేం కూడా దుకాణంల కూచుండేటట్టులేదు తల్లి, వ్యానులు వేసుకొని వచ్చి మాట పలుకు లేకుండా గంపల్లో మేం అమ్మే కూరగాయలను తీసుకపోతున్నరు. ఇదేందని అడిగేట్టులేదు. వాళ్ళు ఇచ్చిందేదో పుచ్చుకోవాలి తప్ప మారు మాట్లాడేటట్టులేదు" అన్నది.

"మన మాట వాళ్ళకు తెల్వదు. వాళ్ళమాట మనకు తెల్వదు. వాళ్ళకు

కొట్టుడు, కాల్చుడు తప్ప మరో విషయం తెలియదట. ఫుల్ అథారిటీతోని వచ్చింద్లట" వయసు మీదపడ్డ కార్మికుడొకడు కూరగాయలమ్మే ముసల్దాని మాటలు విని చెప్పుకొచ్చిండు.

"ఇక ఎంత హంగామ జరుగుద్దో ఏమో? ఇదివరకు ఎన్ని స్ట్రయికులు జరిగినా ఎన్నడు గిట్లలేదు. ఈ కొత్త పోలీసులు వచ్చిన తరువాత బజార్ల తిరిగే పసురాలు సుత కనిపిస్తలేవు. మూడు రోజుల క్రింద మార్వాడి షాపుకారి ఆవును మాయంచేసి ఎవరో కోసుకొని తిన్నరట.... చూడబోతే పశువులను కాదు, ఏవరికి మందినే పీక్కుతినేటట్టున్నారు" అంది కూరగాయల ముసల్ది.

ఇంటికి వచ్చిన తరువాత కూడా వరలక్ష్మికి ముసల్దాని మాటలే గుర్తుకు వచ్చినవి. అమ్మ బజారుకుపోతే తినటానికి ఏదన్నా తెస్తుందని ఆశతో పిల్లలు ఎదురొచ్చారు. కాని వారికి నిరాశే ఎదురయింది. హడావుడిలో పడిపోయి పిల్లల చిరుతిండికోసం ఏదన్నా తీసుకురావటం మరిచేపోయింది.

సరిగ్గా పది సంవత్సరాల క్రిందట వరలక్ష్మికి ప్రభాకర్‌తో వివాహం జరిగింది. కాలరీ ఉద్యోగమంటే నెలతిర్గేసరికి పింఛనుగా వందలకు వందలు వస్తయని, పల్లెటూర్లో పని చేసినట్టు కూలినాలి చేసుడు తప్పుద్ది, కాలుమీద కాలేసుకొని, ఇంత వండుక తినుడు తప్ప మరోపని ఉండదని అందరు అంటుంటే మురిసింది.

కాలరీకి వచ్చిన తరువాత ఆమె అంచనాలన్నీ తలక్రిందులయ్యాయి. పని చేసుకొని బ్రతికే వానికి ఎక్కడికి పోయినా ఒక్కటే తీరు ఉన్నదని ఆమెకు అర్థం కావటానికి ఎన్నో రోజులు పట్టలేదు. ఆమె భర్త ప్రభాకర్ నెమ్మదస్తుడు. ఇతరుల బాధలు చూసి చలించిపోయే గుణమున్నది. ఆ తత్వమే అతన్ని మిగతా కార్మికులు ఆదరించేలా చేసింది. అతని ఆచరణకు ఆమె ఎప్పుడు అడ్డంకిగా మారలేదు. కుటుంబాన్ని చూసుకుంటూ ఎన్ని మంచిపనులు చేసినా ఆమె అడ్డుకోలేదు. పైగా అంతరాంతరాల్లో గర్వించింది కూడా. నిజానికి వాళ్ళ కుటుంబమే ఒక పోరాట కేంద్రంగా మారింది.

"మనం పోరాడేది న్యాయం కోసమైనప్పుడు మనం దేనికీ భయపడవలసిన పనిలేదు" అనేవాడు ప్రభాకర్. కాని పరిస్థితులు రోజు రోజుకూ తీవ్రరూపం దాల్చేసరికి తన భర్త తనకు, పిల్లలకు దూరమైపోతాడేమోనన్న భయం పీడించ

సాగింది. ఇంటిపట్టున ఉండి తన కార్యకలాపాలను కొనసాగించడానికి ఆమెకు ఏ అభ్యంతరం లేదు. కాని పరిస్థితులు మారిపోయి, ప్రభుత్వం తీవ్ర నిర్బంధం మొదలుపెట్టిన తరువాత అంతో ఇంతో ఎక్స్‌పోజ్ అయిన కార్యకర్తలకు నాయకులు "పరిస్థితులు మునపటి తీరుగ లేవు. మనం మారిన పరిస్థితులకు అనుగుణంగా మన పోరాట రూపాలను మార్చుకోవాలి. అలా మార్చుకోలేనప్పుడు మన ఉద్యమానికి మేలు చేయకపోగా హాని చేసినవారము అవుతామని" అన్నప్పుడు వరలక్ష్మి మొఖంలో సందేహ భయాలు ముసురుకున్నవి.

"అక్కా ! మారిన పరిస్థితులకు అనుగుణంగా మన ఆలోచనలు, మన ఆచరణ కూడా మారాలి. అందుకు మనం తయారవ్వాలి. శత్రువు దుర్మార్గంగా దాడి చేస్తున్నడు, మనం అలస్యం చేసిన కొద్దీ దాన్ని అవకాశంగా తీసుకొని మనల్ని తుడిచి పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇప్పటికే మనకు ఇటువంటి చేదు అనుభవాలు ఎదురయినవి. మెరికల్లాంటి కార్యకర్తలను నష్టపోయాము. ఇకముందు మనం తెలిసి తెలిసి నష్టపోవడం మూర్ఖత్వమే అవుతుంది" అన్న ప్రేమపూరితమైన చిన్నని గుండ్రటి కళ్ళు దీపపు కాంతిలో మిలమిలలాడుతూ స్ఫురణకొచ్చాయి.

ఇలాంటివే అనేక ఆలోచనలు వరలక్ష్మిని ఒక్కుమ్మడిగా చుట్టుముట్టాయి. చేతి సంచులు నేలమీద పెట్టి గోడకు ఒరిగి కూర్చున్నది. అమ్మ మొఖంలోని ఆలోచనలు పట్టించుకోని పిల్లలు సంచులన్నీ వెతుకుతున్నరు. వరలక్ష్మి తన ఆలోచనల్లో తనున్నది.

ఆ రాత్రి చాల పొద్దు పోయేవరకు తనకు నిదుర రాలేదు. మనసంతా మొద్దుబారిపోయి, ఎవరో గుండెను పట్టి పీకుతున్నట్టుగా ఫీలయింది. తనతోపాటు నులుకమంచంలో నిదురపోతున్న తన ఇద్దరు పిల్లలను ఎవరో ఎత్తుక పోతారేమో నన్నంత బెరుకుగా, ఇద్దరు పిల్లల మీద చేతులు వేసి అదిమి పట్టుకొని నిదుర రాక విలవిలలాడింది. అప్రయత్నంగానే ఆమె కన్నులు వర్షించసాగినయి.

ఇదంతా ఎందుకోసం ? ఏదో ఉన్నంతలోనే సరిపెట్టుకుంటూ, చాలమంది లాగ బాపులు నడిచిననాడు పనిచేసుకుంటూ, నడవనినాడు అందరిలాగే పస్తులు పండుకుంటే సరిపోయేది కదా ? మీదికి వచ్చిన తరువాత ఎటు పోవటానికి దా కనిపించక గిలగిల్లాడితే ... తనకు తెలిసినంతవరకు తన భర్త ఏ తప్పు చేయ

లేదు. కొందరు కార్మికుల్లాగా రోజు తాగివచ్చి ఇంట్లో నానా హంగామా చేసింది లేదు. చివరికి బీడి కూడా ముట్టుకోడు. బావి నడిచిన రోజు క్రమం తప్పకుండా బదీలీలు చేస్తడు. అయినా జీతం చాలేదికాదు. ఎప్పుడు అంతంత మాత్రంగానే బ్రతుకు గడిచిపోయేది. ఆయన పనిచేస్తున్న బావిలో గ్యాస్ వచ్చి తొమ్మిది మంది కార్మికులు ఒక్కసారిగా చనిపోయినప్పుడు, ఆ చనిపోయిన కార్మికులను దహనం చేసేదాక వెంట ఉండి, మరునాడు ఇంటికి వచ్చి, చిన్నపిల్లవాడిలా తనమీద పడి వెక్కి వెక్కి ఏడ్చినప్పుడు.... ఆయనకంటే వయసులో పెద్దవారు కూడా ఆయన్ని గౌరవించి మాట్లాడుతూ తమ కష్టసుఖాలు చెప్పుకుంటుంటే విని తన మనసు గర్వంతో ఉప్పొంగి పోలేదా ?

'లక్ష్మి మనమేమి గొంతెమ్మ కోర్కెకలు కోరటంలేదు. మేము మనుష్యులమే, మనుష్యుల్లా బ్రతకడానికి అవకాశం ఇవ్వండి మనుష్యుల్లా పనిచేయడానికి పరిస్థితులు కల్పించండి. మమ్మల్ని మనుష్యుల్లా చూడండి' అని కోరుతున్నాము అని అతను చెప్పుకపోతుంటే, కాంతివంతమైన అతని మొఖంలోకి తన్మయత్వంతో తదేకంగా చూస్తుండిపోయేది కాదా ?

ఎక్కడ ఆపాల్సి ఉండే అతన్ని ? మనిషిగా ఆలోచించకుండా ఆపాల్సి ఉండేదా ? వరలక్ష్మి గాఢంగా గాలి పీల్చి ఈ లోకంలోకి వచ్చింది.

బజారు నుండి తెచ్చిన సరుకులను ఇంటినిండా పరిచి డబ్బాల్లో, గంజుల్లో సర్ద సాగింది.

"మాకు తినటానికి ఏదితేలేదా అమ్మా" అంటు పిల్లలు కలగజేసుకొని వెలితి నిండిన మొఖాలతో ఇద్దరు ఒకేమారు అడిగారు.

ఆమె తలఎత్తి ఏడేండ్లవయసు వాడయిన పెద్ద కొడుకు మొఖంలోకి చూసింది. వాడు స్టూలు మీద కాలుమీద కాలు వేసుకొని అచ్చం అతని తండ్రి లాగా మూతిముడుచుకొని కూచున్నడు. ఐదేండ్ల చిన్నబాబు దిగాలుగా మొఖం పెట్టిండు. అదేస్టూలు మీద ప్రభాకర్ కూర్చొని ఇంటి పనిలో తాను మునిగిపోయి ఉంటే దేశ రాజకీయాల గురించి వివరించేది గుర్తుకు వచ్చింది. ఆమె తేరుకొని 'మరిచిపోయిన బిడ్డా, కొద్దిగ ఆగినంక పల్లీలు వేంచి పెడుతాను అంటు పిల్లలను ఊరడించింది. పిల్లలిద్దరు చెరి కొన్ని పచ్చిపల్లీలు పిడికిట పట్టుకొని ఆడుకోవటానికి బయటికి

ఉరికింగ్రసు. చెదిరిన ఆమె ఆలోచనలు దొంతరలు తెరలు తెరలుగా మళ్ళీ మనసులో మూగినవి.

○ ○ ○

రెండు రోజుల క్రింద ప్రభాకర్ ఇంట్లో నుండి బయటకి పోయిండు. ఇంత వరకు మళ్ళీ తిర్గి రాలేదు. అగస్టు ఇరువైనాడు జరుగబోయే ఊరేగింపుకు సన్నాహాలు మొదలుపెట్టిన తరువాత ఇంట్లో అతనికి కాలునిలిచింది లేదు. ఎప్పుడు వస్తాడో ఎప్పుడు పోతాడో తెలియటంలేదు. వచ్చినప్పుడు వండిన నాల్గు మెతుకులను గబ గబ నమిలేస్తూ "బ్రహ్మాండమైన ప్రదర్శన నిర్వహించాలి. కార్మికులంతా వివిధ సమస్యలతో సతమత మయిపోతూ ఎండుటాకుల్లా రెపరెప లాడుతున్నరు. ఈ ప్రదర్శన వాళ్ళ ఆందోళన నుంచి పోరాటాన్ని రగల్చాలి. నివురుకప్పిన నిప్పు లాగున్న వారి కోపాన్ని బయటికి రప్పించాలి. వివిధ యూనియన్లకు ఇష్టం లేకున్నా మనం ఏర్పాటు చేసిన ఐక్య సంఘటనలో కలిసి వచ్చేలా చేయడంలో మనం విజయ వంతమైనాము-మేము వారందరితో ఒకే మాట చెప్పాం" నోట్లో అన్నాన్ని గబ గబ మింగేసి, గడ గడా మంచినీళ్ళు తాగిండు. రెప్పవాల్చకుండా వరలక్ష్మి అతని మొఖంలోకి చూస్తుండి పోయింది. అతను అన్నం తినటం ముగించి లేచివచ్చి వాల్చిన మంచంలో విశ్రాంతిగా కూచొని చెప్పటం మొదలుపెట్టిండు.

"కార్మికులకు మంచి బతుకు కావాలి, కనీస వసతులు కావాలి. అవి పోరాడ కుండా సాధించగలమా? మేం కనీసవసతుల కోసమే పిలుపునిచ్చాం. అవి కావాలంటే మాతో కలవండి. పోనీ కార్మికులకు ఉన్న వసతులే చాలంటారా? అయితే మాతోకలవాల్సిన పనిలేదు".

వాళ్ళ దగ్గర సమాధానం లేదు.

"మరైతే కార్మికుల తక్షణ సమస్యల పరిష్కారానికి ఎందుకు కల్సిరారు అని మేం సూటిగా ప్రశ్నించాము. అయిష్టంగానే వాళ్ళ పోరాటానికి కలిసిరాక తప్పలేదు" అంటూ అతను గబగబా చెప్పుకొచ్చిండు.

ఆమె భర్తకేసి తదేకంగా చూస్తుండి పోయింది. రెండు గదులున్న వారి గుడిసె మధ్యన ఉన్న నిట్టాడుకు ఒరిగి నిలుచున్నది. ఏదో ఆవేశం కమ్మినట్టుగా ఉద్వేగభరితంగా అతను చాల విషయాలు చెప్పుకొచ్చిండు. కాని ఆ విషయాల

మీద ఆమెకు మనసు పోలేదు. అతని ఉత్సాహం చూస్తుంటే ఆమెకు భయం కల్గింది.

మరునాడు ప్రదర్శన అనగా, ఆ రోజు రాత్రంతా బ్యానర్లు రాస్తూ గడిపిండు. ఆ రోజే ప్రభాకర్ తండ్రి వీరయ్య ఊరు నుండి వచ్చిండు. ఇరవై అయిదు సంవత్సరాలు బొగ్గు బాయిలో పని చేసినా అతనికి స్వంతవూరు మీద మమకారం చావక రిటైరుమెంటు కాగా వచ్చిన డబ్బులు తీసుకొనిపోయి స్వంత పల్లెలో వ్యవసాయం మొదలు పెట్టిండు. రెక్కలు ఉడిగిన తరువాత వ్యవసాయం ఏం చేస్తావని ఎవరన్నా వినిపించుకోకుండా కాలరీ వదలి పల్లెటూరికి పోయిండు. అయితే వ్యవసాయం అతనికి పెద్దగా అనుకూలించలేదు. అయినా భూమిని అంటి పెట్టుకొనే ఉన్నాడు.

వీరయ్య భోజనంచేసి నులక మంచంలో వొరిగిపోయి కొడుకు చేస్తున్న పని చూస్తుండి పోయిండు. ఇదేం పని అనిగాని, ఇది తప్పు అనిగాని, ఒప్పు అని గాని అతను ఎప్పుడు పిల్లలను అడ్డంకి పెట్టలేదు. బుద్ధి జ్ఞానం నేర్చిన వారు తమ మంచేదో, చెడ్డ ఏదో నిర్ణయించుకుంటారని అతను భావించాడు. ఇంకా తడి ఆరని ఎర్రటి సిరా రాతలను అంతంత మాత్రంగా వచ్చే చదువుతో కూడబలుక్కొని చదివిండు.

'కార్మికుల పిల్లలకు ఉచిత విద్యాసౌకర్యం కల్పించాలి లేదా చదువుల కోసం ఖర్చు క్రింద నెలకు వంద అలవెన్స్ ఇవ్వాలి'.

'కార్మికుని ప్రతి గుడిసెకు మంచి నీటి సౌకర్యం కల్పించాలి'

'సూపర్ బజార్ల ద్వారా చౌకధరలకు నిత్యావసర వస్తువులను అందించాలి'

'పనిలో రక్షణ కావాలి'

గుండ్రటి అక్షరాలతో ప్రభాకర్ ఒక్కటొకటిగా వ్రాసి గదినిండా పరిచిండు. ఇంకా వ్రాయవలసిన డిమాండ్స్ చాల ఉన్నాయి. వీరయ్య గది నిండా పరిచిన నినాదాలను కూడబలుక్కొని చదివి.

"అప్ బిజ్జా దొడ్డికి పోతే నీళ్ళు అందించేందుకు ఓ బదిలీ పిల్లర్‌ను పెట్టాలని రాయి" వీరయ్య.

మాపు వీరయ్య అన్న మాటలకు వరలక్ష్మి బీరిపోయి చూసింది. మళ్ళీ ఏవో నినాదం వ్రాయటంలో మునిగిపోయిన ప్రభాకర్ తలఎత్తి తండ్రి ముఖంలోకి చూసిండు. బోసి పండ్లు బయట పడంగా వీరయ్య నవ్వుతున్నాడు.

"ఏం ఇదంతా నవ్వులాటగా ఉందా ?" అంటు ప్రభాకర్ ఉక్రోషంగా అడిగిండు.

వీరయ్య మొఖంలో నవ్వు చెదిరిపోలేదు. తెల్లటి గుబురు మీసాలు అదరంగ "మీరు పెట్టే డిమాండ్లు మేనేజుమెంటు తీర్చేనా ?" అంటూ రెట్టించిండు అను మానంగా. వీరయ్య తన సర్వీసంతా గొడ్డులాగా ఎటువంటి కనీస సౌకర్యాలు లేకుండా పని చేసిండు. ఆయనతో పని చేసిన వారిలో కొందరిని బావి మింగేసింది. అంగ వికలురై వీధినపడ్డారు కొందరు. అధిక పని భారంలో అర్ధాంతర చావులకు గురిఅయిండ్లు కొందరు. నెత్తురంతా బొగ్గు బావిలో ఉడిగిపోయి పీకేసిన బొక్కలా తయారయిండు వీరయ్య. అందుకే అతనికి అపనమ్మకం.

శాంతాన్ని ముఖంలోకి తెచ్చుకొని తండ్రికి నచ్చచెపుతున్న ధోరిణిలో ప్రభాకర్ "ఇవేం గొంతెమ్మ కోర్కెలు కావు. మనం ఒక పశురంతో పనిచేయించు కుంటే, అది ఉండేందుకు ఇంత నీడ కల్పిస్తం, యాల్లకు ఇంత తిండి పెడతం, రోగమొస్తే మందులు ఇప్పిస్తం. రెక్కలు ముక్కలు చేసుకునే కార్మికుడికి అంత కంటే ఎం ఎక్కువ ఇస్తాండ్లు. మనిషి బ్రతుకే పశురం కంటే ఎందుకు కనా కష్టం అయిపోయింది" అన్నాడు తండ్రి మొఖంలోకి పరీక్షగా చూస్తు వడిలిపోయిన వీరయ్య మొఖంలో ఏ భావం స్పష్టం కాలేదు. మారుమాట్లాడకుంటా బీడి ముట్టించుకొని గప్ప గప్ప పొగ వదులుతూపోయి మంచంలో వెల్లికలుగా పండు కొని వాసాలకేసి చూస్తుండిపోయి కొడుకు మాటలు విన్నడు.

ఆ రోజు సాయంత్రం తిర్గి ఊరెల్లి పోయేందుకు వీరయ్య తయారయిండు. పిల్లలిద్దరు తాతయ్య నంకలో దూరిను. వ్రాసిన బ్యానర్లను కట్టగా కట్టిండు ప్రభాకర్. వీరయ్య కొడుకును దగ్గరికి పిలుచుకొని "ఈ పని మేం ఎప్పుడో చేయవలసి ఉండే.... మా అప్పుడే ఈ పని చేస్తే మీకు ఈ కష్టాలుండేవికాదు. కాని మాకు అప్పటింత బుద్ధి జ్ఞానం ఉండేదికాదు. మంచేదో, చెడు ఏదో తెలిసేదికాదు. మా

బతుక్కు ఇదే రాసిఉందని, మా కర్మ అనుకునేటోల్లం - నొప్పులు లేకుండా ఏ తల్లి కానుపు కనదు కాని జర పయిలం బిడ్డా" అంటు వీరయ్య వెళ్ళిపోయిండు.

• • • •

అగష్టు ఇరువైన ఇరువై వేలమంది కార్మికులు బ్రహ్మాండమైన ప్రదర్శన చేసిౙ్రు జన్మలో ఇటువంటి ప్రదర్శన చూడలేదని చెప్పుకొచ్చిౙ్రు చూసినవాళ్ళు. తీవ్ర నిర్బంధంవల్ల అణచి పెట్టుకున్న కోపాగ్ని లావాలా ఒక్కసారిగా ఎగజిమ్మింది. వేలాదిమంది కార్మికులు వీధుల్లోకి వచ్చారు. ఏదో ఉన్మత్త కోపావేశంతో మెడ నరాలు పగిలిపోతాయన్నంత ఆవేశంతో కార్మికులు నినదించారు. దాదాపుగా రెండు మైళ్ళ పొడవున ప్రదర్శన వీధుల్లో ఊరేగుతుంటే పోలీసులు నిలువు గుడ్లేసుకొని చూస్తుండి పోయిౙ్రు. ఇది ఊహించని పరిణామం పోలీసులకు. ప్రదర్శనలో బల వంతంగా కలిసి వచ్చిన మిగతా నాయకులు కూడా ఉసిళ్ళపుట్ట తీరుగా వచ్చే జన సందోహాన్ని చూసి ఆశ్చర్యపోయారు. చిలవలు పలవలుగా ప్రదర్శన గురించి చూసిన వాళ్ళు చెపుతుంటే వరలక్ష్మి మనసు ఉద్వేగభరితమైంది.

ఆ ప్రదర్శన తరువాత ప్రభుత్వం అంత వరదాక అమలు జరుపుతున్నామని చెప్పుకుంటున్న మూడు సూత్రాల పథకాన్ని కేవలం నిర్బంధమనే ఏక సూత్ర పథ కంగా మార్చివేసింది కేంద్ర హోంమంత్రి రాష్ట్రప్రభుత్వం అడిగిందే తడవుగా సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలోని తీవ్రవాదాన్ని అణచడం పేరుమీద కేంద్ర రిజర్వు దళాలను, సి. ఐ. యస్. ఎఫ్ దళాలను పంపించారు. ఆ ప్రదర్శన తరువాతే, కార్మికులపై అధిక పని భారాన్ని మోపడానికి వెదురు తట్టల స్థానే కేను తట్టలను పెట్టింది. దాన్ని వ్యతిరేకిస్తు మొదలయిన సమ్మె, కార్మికులు ఎదుర్కొం టున్న వివిధ సమస్యల పరిష్కారానికై సమ్మె పోరాటంగా పరిణమించింది.

సమ్మె గోదావరి దాటి ఆదిలాబాదు జిల్లా బొగ్గు గనులకు వ్యాపించింది. డెబ్బయి వేలమంది కార్మికులు తట్ట చెమ్మాసులు మూలకు పెట్టి సమ్మెలోకి పోయిౙ్రు.

ఐదు వేలమంది ఎర్రమొఖాల రిజర్వు పోలీసులు ఒక్కుమ్మడిగా పారిశ్రామిక ప్రాంతం మీద పడ్డారు. రాత్రిపగలు తేడా లేకుండా పోలీసు పెట్రోలింగు జీపులు బుర్, బుర్ లాడుతూ తిరుగుతున్నవి. వీధులు చీకటైతే చాలు నిర్మానుష్యమై పోతు

న్నాయి. తుఫాను ముందు ప్రశాంతతలా వాతావరణం మారిపోయింది. సమ్మె గురించి వాస్తవాలు వ్రాసిన స్థానిక విలేఖరులను అధికారులు బెదిరిస్తున్నారు. “మీ యిష్టం వచ్చినట్టు పిచ్చిరాతలు వ్రాస్తే పుచ్చెలు ఎగిరి పోతాయ్” అని డియస్పి గిరిధర్ “అంతా ప్రశాంతంగా ఉంది. ఏదో కొద్దిమంది తీవ్రవాదులు తప్ప సమ్మెను బలపరిచేవారే లేరు” అని ప్రకటించాడు. అలా ప్రకటన వెలువడిన రోజు మధ్యాహ్నమే సాయుధులైన రిజర్వు పోలీసులు వందల సంఖ్యలో వీధుల్లో కవాతు జరిపారు. వీధుల్లో జనం భయంతో తలుపులు మూసుకున్నారు. వరలక్ష్మి పిల్లలు బయటికి పోకుండా రెండు చంకల క్రింద ఆపి, కిటికి నుండి పోలీసు కవాతును పరిశీలించింది. వీధులగుండా పోలీసు కవాతు వెళ్ళిన చాలసేపటికి కాని తేరుకోలేదు. ఎవరో వొంట్లోని సత్తువంతా పీల్చేసినట్టుగా నిస్సత్తువ ఆవరించగా గుండెలను చేతులతో అదుముకొన్నది. ప్రదర్శనకన్నా ఒకరోజు ముందు ఇల్లు విడిచిపోయిన ప్రభాకర్ ఇంకా ఇంటికి రాలేదు.

పడమటికి వంగిన సూర్యుడు పోలీసు కవాతు చూసి భయపడే సామాన్యుడిలా పడమటి కొండల్లో దాక్కోవటానికి పరుగులు పెడుతున్నాడు. ఎప్పుడు ఆకాశంలోకి విషాన్ని చిమ్మే ఎరువుల ఫ్యాక్టరీ పొగగొట్టం మూగపోయి నిలబడిపోయింది. ఎన్టిపిసి మూడవ వంతు ఉత్పత్తి ఆగిపోయింది. అడ్డు అదుపు లేకుండా ఆకాశంలోకి చొచ్చుకపోయిన, ఎప్పుడు నిప్పులు కక్కే చారల చారల చిమ్నిమీద అంతవరదాక ఓపిగ్గా కూచున్న పీతిరి గద్ద లేచి దూరంగా సాగిపోయింది.

“లక్ష్మక్కా ఎవరికోసం చూస్తానవు ? బావ కోసమా ?” అంటూ గారపండ్లు బయట పడంగా నవ్వుకుంటు రాంచందర్ వచ్చిండు. కొత్తగా కొనుక్కున్న సెకండ్ హాండ్ చారలచొక్కా అతని వొంటికి సరిపడక వదులుగా ఉంది. అతిగా బీడీలు కాల్చటం వలన నల్లబడి మొద్దుబారిపోయిన పెదవులు.

“నిన్న పొద్దున లేచి పోయిండు. ఇంకా రాలేదు” అంది తేరుకొని వరలక్ష్మి. ఆమె వెనకాలే ఇంట్లోకి నడిచి ముందు గదిలోని స్టూలు మీద కూచున్నాడు రాంచందర్.

“అక్కా అంత వడ్లు పెరుగు కలిపినట్టుగా ఉంది వ్యవహారం” అంటూ రాంచందర్ మాటల్లోకి దిగిండు. రాంచందర్ వాళ్ళ ఇంట్లో మనిషిలా కలిసిపోయి

ఉంటడు. ఆపదలో సంపదలో పిలువకుండానే వచ్చేంత చనువుంది. ప్రభాకర్ రాంచందర్ ఒకే బావిలో పనిచేయడమే కాకుండా ఒకే షైలి. ప్రభాకర్ అంటే విపరీతమైన అభిమానం.

"మేనేజిమెంటు ఈ సారి మొండికేసేటట్టున్నది. కార్మికులు సమ్మెను ఎన్ని రోజులు చేస్తరో చెయ్యనీ, చేసి చేసి వాళ్ళకే యాష్టవస్తది అప్పుడిక అన్నల మాట వినరు అనుకుంటాండు. ఇంకొక దిక్కు పెద్ద ఎత్తున అరెస్టులు చేసి కార్మికులను భయపెట్టాలను చూస్తాండు" అంటు రాంచందర్ చెప్పుకొచ్చిండు. బీడీ ముట్టించు కొన్నడు. పొగ వదులుకుంటూ "సచ్చి చెడి గీబాయిలకు వచ్చి పడ్డం. ఎక్కడికి పోయినా ఏదే మానికలు"అన్నట్టుగున్నది. ఊళ్ళపొంటి దొరలు పడనియ్యలేదు. దొరలకు ఎదురు తిరిగితే పోలీసులొచ్చిండ్లు. ఊళ్ళన్నీ వెగ్గంపాడు చేసిండ్లు. ఇక గిట్లయితే ఏం బ్రతుకుతామని గీబాయిలకు వచ్చినం. ఇక్కడ గిదే పరిస్థితి. పెనం మీది నుండి పొయ్యిల పడ్డ తీరుగున్నది. గీబాయి దొరలు ఊరి దొరలను మించి పోయిండ్లు. ఇక పోలీసోల్లంటవా, వాళ్ళకింక పట్టపగ్గాలుంటలేవు. జన్నకిడిసిన అంబోతుల్లా ఊరుమీద పడి తిరుగుతాండ్లు ... ఇగ ఎక్కడికి పోయేటట్టున్నది" ఇట్లా చాలసేపు మాట్లాడి పోయిండు.

వంట అయిన తరువాత, పిల్లలకు భోజనాలు పెట్టింది. పిల్లలు నిదుర పోయిన్రు. కడుపులో ఆకలి అనిపించలేదు. ప్రభాకర్ ఇంకా రాకపోయేసరికి మనసులో ఆరాటం ఎక్కువైంది. ఏదో తిన్నాను అనిపించుకోవడం కోసం పళ్ళెంలో నాల్గు మెతుకులు వేసుకొంది. అదికూడా సరిగా తినలేక పోయింది. మంచంలో అడ్డందిడ్డంగా పండుకున్న పిల్లలను సర్ది మంచంలో వొరిగింది. ఏవేవో ఆలోచనలు చుట్టు ముట్టగా చాలసేపటిదాక నిదురపోలేదు. అప్పుడే కొస్త మగతగా నిదుర కమ్ముకొంటుండగా ప్రభాకర్ వచ్చిండు. వేసుకున్న అంగి బాగా మాసిపోయింది. ముఖం కొస్త పీక్కుపోయినా అతని కండ్లు ప్రకాశవంతంగానే ఉన్నాయి.

"ఇప్పుడు గుర్తుకొచ్చిందా ఇల్లు" అంది నిష్ఠూరంగా వరలక్ష్మి.

"ఏం చెయ్యమంటావు ? సమ్మె రోజు రోజుకు తీవ్రరూపం దాల్చుతున్నది. సమ్మెను ఫేయిల్ చేయడానికి మేనేజిమెంటు, పోలీసులు కుమ్మక్కయి నగ్నంగా ముందుకొచ్చిన్రు. ఈ పరిస్థితిలో మనమంతా ఒక్కతాటిమీద గట్టిగా నిలబడేందుకు మన ప్రయత్నం మనం చెయ్యాలి కదా ?" అన్నాడు కండ్లు చికిలించి.

ఆమె మారు మాట్లాడకుండా మౌనం వహించింది.

ప్రభాకర్ వొంటిమీద అంగి తీసి దండెం మీద వేసిండు. లుంగీ చుట్టుకుంటు "బాగా ఆకలిగా ఉంది.... నిన్నటి నుండి సరిగా అన్నంకూడా తినలేదు" అంటూ క్షణమాగి, "తిండిలేక కాదు, తీరుబాటు లేక" అంటు చెప్పుకొచ్చిండు.

ఆమె అన్నం వడ్డించేసరికి అతను కాళ్లు, చేతులు కడుక్కొని వచ్చిండు. అన్నం తింటున్నంతసేపు అతనేమి మాట్లాడలేదు. బాగా అలసిపోయి ఉండటం వలన అతను తిన్న వెంటనే వచ్చి మంచంలో వొరిగిండు. మరుక్షణమే అతన్ని నిదుర కమ్మేసింది. భర్తతో ఎంతో మాట్లాడాలని అనుకున్న లక్ష్మికి నిరాశ ఎదురయింది చాలసేపు నిదుర రాక అటు ఇటు దొర్లి మెల్లగా నిదురలోకి జారుకుంది.

• • •

పున్నమి వెన్నెల ఆకాశంలో ఊరంతా మత్తుగా నిదురలో మునిగిపోయి ఉంది. ఇరువై నాలుగు గంటలు బడబడలాడే ఫర్టిలైజరు ఫ్యాక్టరీ, సెవన్ ఇంక్లయిన్ సి. యస్. పి. కూడా మూతపడిపోయి అర్ధరాత్రి నిశ్శబ్దాన్ని ఎక్కువ చేశాయి. సన్నటి కీచురాళ్ళ రొదతప్ప ఎక్కడ ఏ అలికిడి లేదు. పదవ ఇంక్లయిన్ పోయే రోడ్డుప్రక్కనే ఉన్న గ్రామం గ్రామమంతా నిదురలో మత్తుగా జోగుతున్నది. సరిగ్గా సమయం రెండు గంటల రాత్రివేళ, ప్రశాంత నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ మొదలయింది రాక్షసకాండ.

ఊరు మీద ఊరు పడ్డట్టుగా గడబిడ. అది కలో నిజమో తెలుసుకొనేసరికి ఫళ్ళున తలుపు విరిగింది. భయంతో వరలక్ష్మి దిగ్గున లేచి కూచున్నది. ఎదురుగా కుదిమట్టంగా బలసిన పోలీసాఫీసర్ లాఠీ తాటించి విసురుగా ప్రభాకర్ తలమీద వేసిండు. అతను సర్కిలో, డిఎస్పియో ఎవరైంది ఆమెకు తెలియలేదు. తలచిట్లి రక్తం చిమ్మింది. అప్పటికే చుట్టుముట్టిన పోలీసులు లాఠీలతో తుపాకి మడమలతో అతని శరీరాన్ని నుగ్గు నుగ్గు చేస్తున్నరు. ఖాకీ మూకల మధ్యన అతను బాధగా గింజుకుంటూ వరలక్ష్మికి కనిపించిండు. ఏదో శక్తి ఆవరించినట్టుగా, వాళ్ళను తోసుకుంటూ పెద్దగా అరుస్తూ పోలీసు దెబ్బలు భర్తకు తాకకుండా అతన్ని వాటేసుకున్నది. నలుగురు పోలీసులు ఆమెను బలవంతంగా గుంజేసి ప్రభాకర్‌ను బయటికి లాక్కపోయిండ్రు. ఏం జరుగుతుందో తెలియని అమాయక భయంతో ఏడుపు లంకించు

తున్నది. ఆమెకు స్పృహతప్పి కొద్దిసేపట్లో తేరుకున్నది. ఇల్లంతా చిందర వందరయి ఉంది. బియ్యం పప్పు ఉప్పు అంతా కలగలసిపోయి ఇంటినిండా ఎగజల్లి ఉంది. ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండటం వలన పోలీసులకు కావల్సిన సమాచారం ఏదీ దొరకలేదు. భయంతో భీతిల్లి ఏడుస్తున్న పిల్లలిద్దరిని గుండెలకు అదుముకొని వరలక్ష్మి ఏడ్చింది.

ఎంతపని అయిపోయింది. ఇటువంటిది ఎప్పుడో ఒకప్పుడు రాకతప్పదని అన్నలు చెప్పినప్పుడు తానే అతనికి గుదిబండ అయిపోయి, ఇద్దరు పిల్లలను కాళ్ళమీద వేసి "ఈ పిల్లలిద్దరికీ నాకు ఇంత విషమిచ్చి నీవు నీ దారి చూసుకొమ్మ"ని అడ్డు నిలిచింది. అటు ఇటు తెల్చుకోలేక వారం పది రోజులు పిచ్చిపట్టినట్టుగా తిర్గి తిర్గి చివరికి ఇంటి దారికొచ్చిడు. కాని చివరికి ఏమైంది? చూస్తూ చూస్తూ తన కండ్ల ముందే యమభటుల్లాంటి పోలీసులు తన ప్రాణాన్ని తన ముందే గద్దలా తన్నుక పోయిన్రు. తన్ను తాను తిట్టుకుంటు వరలక్ష్మి ఏడ్చింది.

చుట్టుపక్కల వాళ్ళు వచ్చిన్రు. ఓ ముసలి తల్లి వరలక్ష్మి తలను చేతుల్లోకి తీసుకొని గుండెలకు అదుముకొని ఓదార్చింది. "వాళ్ళ ఇంట్ల పీనుగలెల్లా, వాళ్ళను మైసమ్మ ఎత్తుకపోను. ఊరు ఊరంతా ఆగం ఆగం చేసి అందినకాడికి అందరిని పట్టుకపోయిండ్లు" తాను కూడా ఏడుస్తూ చెప్పుకొచ్చింది.

వరలక్ష్మి మనసులో ఏదో ఆశ తొంగిచూసింది.

"అవునక్కా మా ఆయన మాపొల్లను తోలిరావటానికి ఊరెల్లబట్టి బతికి పోయింద్రు కాని, ఉంటే ఆయన్ని కూడా పట్టుక పోయేటోళ్ళు" అంది మరో స్త్రీ.

"మన ఒక్క వాడలనే రెండు వందల మందిని దాక పట్టుకపోయిండ్లు"

ఏం జీపులు ఏం పోలీసులు. అవ్వతోడు ఉసిల్ల పుట్టతీర్గ వికుమకపడ్డరు" ఇలా తలో మాటన్నరు.

తన భర్త ఒక్కడే కాదు, వందలాదిమంది వెంట ఉన్నరన్న ఏదో సంతృప్తి ఆమెను కొంత ఊరట చెందేలా చేసింది.

తెల్లారే వరకు వాడ మీద ప్రతి ఇంట్లో అదే పరిస్థితి నెలకొని ఉంది.

○ ○ ○

ఆ సంఘటన జరిగిన పదవనాడు వరలక్ష్మి ఇంటికి రాంచందర్ వచ్చిండు. ఈ పదిరోజులు వారికి ఆ నోట ఆ నోట ఎప్పటి సంగతులు అప్పుడు తెలుస్తునే ఉన్నాయి. పట్టణంలో దాదాపు రెండు వేలమంది కార్మికులను మూకుమ్మడిగా అరెస్టులు చేసినట్టు తెలిసింది. అయితే ఎవరిని ఎక్కడుంచారో తెలియక అరెస్టు అయినవారి సంబంధీకులు ఆగం ఆగం అయి తిరుగుతాన్రు.

అక్టోబరు నాల్గున ఒక పైపు చర్చలుంటే ఈ అక్రమ అరెస్టులు చేయడ మేమిటని అన్ని కార్మిక సంఘ నాయకులు యాజమాన్యాన్ని కలువడానికి పోతే, వారికి ఇంటర్వ్యూ ఇవ్వకుండానే, మేనేజింగ్ డైరక్టర్ ఆస్ట్రేలియా నుండి నేషనల్ థర్మల్ స్టేషన్‌కు బొగ్గు సప్లయి గురించి చర్చించేందుకు వెళ్ళాడు.

రాంచందర్ రావటం చూసి వరలక్ష్మికి ప్రాణం లేచివచ్చింది. ఈ పదీ రోజులకే మనిషి పురాగ తెల్లబడి పోయిండు. కుడి కంటె బొక్కమీద ఇంకా మానని గాయం నడవటానికి ఆయాసపడుతూ మెల్లగా వచ్చి ఎప్పటిలా స్టూలుమీద కూచున్నడు. ఆమెకు మనసులో భయం పేరుకపోయి 'ఆయనేడి ?' అని అడిగింది.

"బావతోపాటు అందరు క్షేమమే" అతను మొఖంలోకి నవ్వుతెచ్చుకొని నిర్లిప్తంగా ఏం పరువాలేదన్నట్టుగా తల ఎగరేసి "ఒక్కొక్క గదిలో ముప్పయి నలభై మందిని కుక్కిండ్లు. నిలుచునే చోటులేదు. ఇక పండుకునేది ఎక్కడ. పైకెల్లి తాపకు పదిమందిని పిలిచి ఇంటరాగేషన్....అంటే ఏం లేదు. కాళ్ళలో రోకలి బండలు ఎక్కించాడు" అతని మొఖం వివర్ణమైంది "అవ్వతోడు కడుపుల పేగులు తెగిపోతయి అనుకో" అంటు క్షణమాగి చెప్పుకొచ్చిండు. ఇంతకు వానికి ఏం కావాలంటే ? మీలో కార్యకర్తలు ఎవరు ? వాళ్ళ పేర్లు చెప్పితే వదిలి పెడతాం అని గాండ్రు కప్ప డియస్పీగాడు ఒక్కటే ఊదర. ఒక పైపు బాధతో మేం విల విల లాడుతుంటే వాడు నింపాదిగా సిగరెట్లు కాల్చుకుంటూ అడిగేటోడు—అవ్వతోడు నాకయితే అప్పుడే వాని గొంతుక కోరికేయాలన్నంత కోపం వచ్చిదంటే నమ్ము.

వరలక్ష్మికి అతని మొఖంలో ఆ సంఘటన తాలూకు నీలినీడలు కనిపించాయి.

రాంచందర్ భారంగా నిట్టూర్చి "ఎవ్వరు ఒక్కమాట కూడా చెప్పలేదు.

ఎవ్వని నోటి గుండా ఒక్కమాట బయటపడ్డా అవతలి వానికి మూడుతదిగదా ? ముసలి ముతక వారిని ఓ మాదిరిగా కొట్టిండ్లు. కొద్దిగా నదరుగా ఉన్న వాళ్ళను పొల్లు పొల్లు చేసిండ్లు" ఇంకా ఆ భయంకరానుభూతి తాలుకు విషయాలను చెప్పు కొస్తునే ఉన్నడు.

కాని వరలక్ష్మికి, ఆమె భర్తను గురించి స్పష్టంగా ఏ విషయం చెప్పకపోయే సరికి అసహనం పెరిగిపోయి తానే గొంతు విప్పి అడగలేకపోయింది.

రాంచందర్ ఆమె ముఖంలోని భావాన్ని పసిగట్టినట్టుగా తలగోక్కుంటు "ఇంతకు అసలు విషయం చెప్పటం మరిచాను. అక్కా బావను కూడా వదిలే సిండ్లు"

వరలక్ష్మి మొఖంలో ఏదో బాధ
రాంచందర్ లేచి నిలుచున్నడు

"మరి ఇంటికి ఎందుకు రాలేదు ? ఎప్పుడ స్తనన్నడు ?" అని వరలక్ష్మి అడగాలనుకున్నది కాని అడుగలేదు.

రాంచందర్ మొఖంలో తనకు కావల్సిన భావం కోసం వెతికింది. ఏ భావం కనిపించలేదు.

వరలక్ష్మి అప్పటి నుండి ప్రభాకర్ కోసం ఎదురు చూస్తూనే ఉంది. ప్రభాకర్ వార్తల కోసం అందరిని అడుగుతూనే ఉన్నది.

పచ్చగా సాగే ఆమె సంసారంలో చిచ్చురేపింది ఎవరు ? ప్రభాకర్ కుటుంబంమీద మమకారంతో, పిల్లలమీద ప్రేమతో ఇంటికి వచ్చి బతుకగలడా ? ఇంతకు ప్రభాకర్ చేసిన నేరమేమిటి ?

చీకటి గుయ్యారాల్లాంటి బొగ్గు బొక్కల్లో నల్ల బంగారం ఇంధనం తీసి తామే మానవాళికి ఇంధనమై కనీస వసతుల కోసం మనిషిగా బతకడం కోసం పోరాడటమేనా ?

వరలక్ష్మి, ప్రభాకర్ లాంటి లక్షలాది కుటుంబాలు కలిసి జీవించే రోజెప్పుడో,

నవల-సీరియల్ :

రాగో

సాధన

(గత సంచిక తరువాయి)

12

దల్సు ఇంట్లో నిండు గ్రహణం పట్టినట్టుంది. బిట్ట పొట్టకు కరువులేని ఇంట్లో బుక్కెడు అంబలికే పూట పూట గండమవుతూంది. నూకల జావ తప్ప మరొకటి ఎరగని దల్సు ఇంట్లో నూకల పూసే లేదు సరికదా జొన్న అంబలి, జొన్నగటుక పుట్టడమే గగనమవుతూంది.

రాగో ఉంటే "జొన్నగడ్డ" కూలికి పోయి జొన్నలన్నా తెచ్చేదని పొయ్యి దగ్గరికి పోయినప్పుడల్లా తల్లీ, కూచీ సణుగుతూనే వున్నారు. గిన్ని (పళ్ళెం) దగ్గర కూచున్న ప్రతిసారి తండ్రికీ, కాకకూ కూడా అదే గుర్తుకొస్తుంది.

ఉప్పు, మిరం పూట పూర్తి కొనడానికే బెంగాలోనికి ఇచ్చి ఇచ్చి ఉన్న ఇప్పపూలు, గారె కాయ కూడా ఒడిసాయి. ఓ పూట డికాషన్ తాగే అలవాటు పేరు లేకుండా పోయింది.

తల పట్టుక కూచున్న దల్సుకు ఏం తోచడంలేదు. కాళ్ళు జాపి వాకిట్లో వెల్లెలికిలా పడి పొర్లుతూ పొట్ట చూపి ఏడ్చే కుక్కను చూసి దల్సు మనసు చెరువై పోతూంది.

ఆ పూర్తి విత్తనాలుంచే ముల్లెకట్ట విప్పి భూమిల అలికిండు. మూడేండ్ల కెల్లి వానలు ఎటమటం అవుతుంటే బీడుపడ్డ పొలమే దిన దినం పెరుగుతుంది. ఈ యేడు అట్లనే అయితే ముందటికి ఇత్తనం కూడ పుట్టదని అందరి లాగనే దల్సు కూడా ఫికరు చేస్తున్నడు.

చుట్టుపట్ల ఏ పనీలేదు. కూలీనాలికి పిలిచేటోడే లేడు. వానకాలం అని ఉన్న రోడ్డు పని కాస్తా ఆగిపోయింది. ఆకులమీద నూరో, ఇన్నూరో వస్తే వానకాలం గాసానికి వెళ్ళేది. మూడేండ్ల సంది చేకపట్టి సర్కారోడే వుంచుకోబట్టి ఉన్నరేటు కూడా ఇయ్యక సంపే (సమ్మె) జరగబట్టే. ఇంకో రెన్నెళ్ళు పోయి దీపావళి వస్తే గాని బొంగుపని షురుకాదు". దీర్ఘంగ శ్వాస వదిలిన దల్సు మనసు కకావికలైంది.

గొట్టోళ్ళు చేసుకునే పెద్ద పండుగ నావ్వ ఖోల్వి. పండుగనాడు వచ్చినోనికి లేదనీకుంట మానెదో, తప్పెదో పుట్టినింట్ల వచ్చినోని ముఖం చూసుకుంట లేదనాల్సి వస్తుంది. ఎన్నడూ కడపదాటి యింకొకరిని నోరిడిసి అడగనోనికి ఇవాళ పూట పూర్తి బిమలు పుట్టించుకరావడం ఇజ్జతు పోయినంత పనే అవుతుంది. లేవబోతున్న దల్సుకు నెత్తిమీద గుల్లలతో వాకిట్ల అడుగుపెడుతున్న యారాల్లిద్దరు కంటపడ్డారు.

"బాల్ అద్ (అదెంటిది)" - దల్సు.

"ఓసో బాతల్ మంత జర్మతవే" (ఇంకేముంది మామూలే)- నంటూ భార్య ఎడంచేత్తో గుల్ల దించి కింద పడేసింది. తోటికోడలు గుల్లకూడా బరువుగా ఏమీ లేదు.

ఒక గుల్లలో కంక కక్కులు, పుట్టకొక్కులు, మరో గుల్లలో చెన్నగడ్డలు వున్నాయి.

చెన్నగడ్డలు చూస్తున్న దల్సుకు కడుపులో తిప్పినట్టయింది. అదే మాట పైకి అన్నాడు.

"పూటకు లేదని నానని గడ్డలు తెచ్చి వండుకుంటే లేని బీమారీలలో వాపుదల తచ్చేట్టున్నది".

"ఇంగో" (అవును) అంటూనే మరదలు నాలుగు రోజులుగా పారే సీళ్ళల్ల నానబెట్టిన గడ్డలు గుల్ల నుండి తీసుకొని ఉడకపెట్టనీకి పోయింది. నాలుగుసార్లు ఉడకబెట్టి ఆ సీళ్ళు పారబోస్తేగాని చేదు (విషం) పోదు. ఏమైనా పూటకింత విషం మింగినట్లే ఉన్నది అని ఆవిడ మనసులో శేకపోలేదు.

అడవికి పోయిన గొడ్లను తిరిగి తిరిగి పోద్దూకేవరకు దొరికించుకొని అప్పుడే రామ కడపల్లో అడుగు పెట్టినాడు. అమ్మంగ, దావంగ మిగిలిన రెంకావుల్లోనూ రాముడు బక్కపనే తెచ్చేవరకు దల్సు నొసలు చిట్లించాడు.

"ఇంకొకటి ఏమైందిరా, దొరకలేదా"- దల్సు ఆత్రుత ఆగలేదు.

"ఇంగో" (అవును) అంటు నిదానంగా పంపుల దగ్గరికి నడిచాడు రామ. నీళ్ళు తోడి కాళ్ళు చేతులు కడుక్కొని కొన్ని ముఖంపై చల్లుకున్నారు.

అడవి పాలు అయిన ఆవు గూర్చి నిట్టూర్పు విడిచిన దల్సులో అది మామూలే అన్నట్టుంది తప్ప ఆందోళనే లేదు.

తమ్ముణ్ణి లేపుకొని ఉన్నొక్కొవును పట్టుకొని, దల్సు రోడ్డు మీది కొచ్చే సరికి ఛళ్ళున తెల్లారింది. బత్తెం కట్టుకొని, అంచుకు చిల్లి కొట్టిన గంజుకు తాడు కట్టుకొని చెరో జబ్బకు వేసుకుని అన్నదమ్ములు నడుస్తున్నారు. నడుమ ఒక నిద్ర చేస్తేగాని వారు అంగడి చేరుకోలేరు. నాటి కాలములైతే ఎవరింట్ల అగినా ఆ పూటకు అర్సుకునేవారు. ఈ కరువుగొట్టు రోజుల్లో మిక్కుటానికి వస్తే అంబలి దొరకాలన్నా అడిగేటోనికే నోరు రాకుంటా ఉంది. ఉండి ఉండి అప్పుడోటి ఇప్పుడోటి పొడి పొడి మాటలే తప్ప అన్నదమ్ముల మధ్య ముచ్చట సాగడం లేదు.

ఆ రాత్రి నిద్రకు అగిన షేడినార్ పటేల్ దల్సుకు దూరపు బంధువు. ఆ చుట్టు పట్ల పేరున్న పటేలే. ఈ నడుమ పటేల్‌తనం పోయింది. అన్నగాండ్లకు బువ్వ పెట్టాడనీ, సంఘపోల్లను పట్టి యివ్వలేదనీ నౌఖరీ ఊడబీకిండ్రు పోలీసులు. ఇదే నయమని ఆ పటేల్ మొత్తంగానే సంఘంలో తిరుగుతుండు.

'దల్సు! ఆవునమ్ముతావురా' —పటేలు

"ఇంగో (అవును) కోళ్ళు, మేకలు ఐనోంగ గిదొక్కటే మిగిలింది. నొవ్వ పండుగ ముందరుండే. పూట పూటకు కటకటయితుంది దాదా" అంటూ నిదానంగా పడుకొనే జవాబు చెప్పాడు.

"అంగడికి నేను కూడ వస్త. మేక పోరగాండ్లు మిగిలినయి. పట్టుకస్తా! కోడి పోరగాండ్లకు ఇచ్చిన ధరకూడ ఇస్తలేరు" అన్నాడు నీరసంగా పటేలు.

హి....హి....హి.... అంటూ నవ్వి నడుంవాల్చాడు రామ.

"రాగో కనబడిందిరా! మొన్న మా వూరికి వచ్చిన దళంలో వుంది". అంటూ రహస్యం చెబుతున్నట్టు మెల్లగా గొణిగాడు పటేల్.

రాగో పేరు విన్న అన్నదమ్ములిద్దరూ గభాలున లేచి కూచున్నారు. ఇంకేం చెప్పతాడో అని ఎదురుచూస్తూ.

"మంచిగానే ఉంది" అని మాత్రం అన్నాడు పటేల్.

జాముకో మాట, పూటకో ముచ్చట గాకుండా అదేదో గబగబ చెప్పతే బాగుండునని ఇద్దరిలో లోలోనే గింజుకుంటున్నారు. చివరకు రామే ధైర్యం చేసి "ఓసో బాతల్ ఇత్త! (ఇంకేం అన్నది) దాదా" అన్నాడు దాంతో "ఏం

వుంటది, ఏమీ చెప్పలేదు" అని పటేల్ ఒత్తిగిల్లాడు. ఇద్దరు నీరసపడి మళ్ళీ నడుములు వాల్చారు.

ఆ నోటా, ఈ నోటా ఈ కబురు వింటూనే వున్నాడు రాముడు "ఒక్కసారి ఇంటి దాక వచ్చి పొమ్మను" అని ఎన్నోసార్లు రాముడు కబురు చెప్పంపాడు కూడా. "బిడ్డకి మా కబురందిందో లేదో మరి!" అనుకుంటూ జారుకున్నాడు.

రాగో అదేపనిగా గుర్తుకు వచ్చిన దల్సుకు ఇక ఆ రాత్రి కునుకే పట్టలేదు.

అంగట్లో హడావిడి బొత్తిగా లేదు. అసలే కరువు అందులో వర్షాలు. బేరగాళ్ళ పెద్దగా రావడంలేదు. పీలున్నపుడల్లా ఆ రైతులు ఊరువచ్చి ఉన్నదేదో అమ్ముకొని అక్కడుండే షావుకార్ల నుండి కావల్సింది కొనుక్కుంటున్నారు. గిరాకి లేని బేరగాళ్ళ ఈగలు కొట్టుకుంటూ గుణుక్కుంటూ కూచున్నారు. ఎవనికి ఉద్దెర యిచ్చినా గ్యారంటీ లేని కాలం. మనుషుల మీద నమ్మకం లేకుండా పోతుంది. నూర్పిళ్ళ కాలంలో ఊరూర తిరిగి రైతుల నుండి బోరాల్లో వడ్లు నింపుకొచ్చిన కాలం పోయిందని షావుకార్లు పుసూరు మంటున్నారు. నగదు మిత్తీకిస్తే అడగపోను గుండె చాలకుండా ఉంది ఊర్లల్ల.

"ఏడికోస్తే గాడికేనాయె గీడకొచ్చినోనికే సున్నం పెట్టుదాం" అని గల్లాపెట్టె ముందు కూసున్న షావుకార్లకు చేవినిండ దండ లేదు. షావుకార్ల నక్కజిత్తుల ముందు నిలువలేని రైతులు దక్కిందే చాలని పైసలు చేతులో వేసుకు పోతున్నారు.

గొడ్డుతో దల్సు, దల్సు తమ్ముడు రామ మేకలతో పటేల్ అంగట్లకు వచ్చే సరికి సైకిల్ మీద కోళ్ళతో వచ్చిన సంఘం పాండు కలిసిండు. జోరలతో అంగడికి వస్తున్న రైతులు ఒకరొకరే మెల్ల మెల్లగా చేరుకుంటున్నారు. కలసినోల్లందరికి మీటింగ్ చేద్దాం ఉండమని సంఘం పాండు కబురు ఇస్తున్నాడు.

పొద్దు తిరిగింది. టైం రెండయిపోయింది.

అంగటి పని ముగించుకున్న రైతులు ఒకరొకరే నెమ్మదిగా 'ఒంటిమామిడి' దగ్గరికి చేరుకుంటున్నారు. సంఘం పాండు అందరికన్నా ముందే అక్కడ చేరుకున్నాడు. చీకటి గాక ముందే ఊర్లపడాలని రైతులందరూ తొందరపడుతున్నారు. ఆ తొందర గమనించి పాండు మీటింగ్ ప్రారంభించాడు.

"ఇంగో" అంటూ మొదలుపెట్టిన సంఘం పాండు జేబులో నుండి పొగ డబ్బీ తీసి అది ఖాళీగా ఉండేసరికి "సారీ" (ఖావ) అంటూ దల్సు పైపు చేయి జాప బోయాడు. అతని చేతిలో కూడా ఖాళీ డబ్బీ కనబడడంతో ఇద్దరూ ఒక నవ్వు నవ్వారు. రాముడు అందించిన పొగాకు దొడకు తోస్తూ అసలు విషయంలోకి దిగాడు పాండు.

మూడేండ్ల నుండి కరువుంది. యేటింత యేటింత ఎక్కువై నెత్తిమీదికి వచ్చింది. ఆదుకునేటోడు లేకుంటా పోయిండు. అప్పులిచ్చేటోడు పుట్టకుండా అయ్యిండు. ఏమన్న ఇంత ఉన్నోడు ఊళ్ళె ఉంటే మెల్ల మెల్లగా వాడు మన తీరే అయితుండు. ఈ కరువుల వెలసిపోకుండా ఉన్నోడు అంటే ఏమన్నగీ షావుకార్లే. నిరుడు సవాయి (వడ్డీ) లేకుండ తెచ్చుకున్న వడ్ల అప్పు పంట రాక ఎవరు కట్టనే లేదు. నొవ్వపోల్లకు ఉపాసం ఉండే రోజులొచ్చాయి. ఈ ఊర్లలో షావుకార్లు మాత్రం చెక్కు చెదరకుండ ఉన్నారు. గొడ్లు, మేకలు, కోళ్ళు హరోకటి ఈల్ల కాడికే చేరుతున్నాయి.గంప నెత్తిల పెట్టుకొని మన ఊరూరు తిరిగిన ఈ షావుకార్లు ఇయ్యాల బలసిపోయిండ్రు. మనల్నే నమ్ముకుంటయండ్రు.

కూటికి లేకుండా, బట్టకు లేకుండా పోరగాండ్లు గొడగొడ ఏడ్వంగ రోజు గడవాలంటే గండం ఉన్నది. మొన్న 'కోదెకస' దగ్గర ఉపాసం ఉండలేక ఆకలై ఇప్పకల్లు తాగిన లాలుమామ సొలగి పెరడు (నది)ల పడి చచ్చిపోయిండు. చెన్నగడ్డలు పడక కక్కుడేర్గుడు పెట్టి రిమ్మచ్చినోనికి రిమ్మవస్తే పోయెటోని ప్రాణమే పోతుంది.

ఇట్ల చూసుకుంట ఉంటే కలువదని అందరం జమై బరిపోయి అర్జీ ఇచ్చినం. అదిజూసి వచ్చినోడు లేడు. అడిగినోడు లేడు. ఈ సర్కారోడేమన్న ఆదుకుంట డంటే "బుడ్డను నమ్మి ఈకకు పడ్డట్టయితుంది". ఇగ మనమే విచారం చేయాలే.

అక్కడక్కడ ఉన్నోని ఇంట్ల మెత్తు తీయకుండా గుమ్ములల్ల విత్తులున్నాయి. ఇగ మందిని ముంచి పెద్దగయిన ఈ షావుకార్లు ఉన్నారు. పొరగాండ్లు, పెద్దోళ్ళు ఆకలికి చావడం మంచిది కాదు. గీ ఉన్న నా కొడుకులు ఎట్లు ఇయ్యరో చూడలే. అడుగుదాం. ఇస్తే మంచిదే. లేకుంటే మనకు చాతనయినట్టు మనం కొంట పోతేనే బతుకుతం. ఇది నా ఒక్కని విచారమే గాదు. మన అన్నలు గూడ "గంతే అయితది' అంటుండ్రు.

మళ్ళీ అంగడి అంటే వచ్చేవారమే. ఈ వారం రోజులల్ల మనం మన పట్టిలున్న ఊర్లల్ల గట్టిగా వుండేటోల్లందరికి కబురు ఇయ్యాలే. అందరం జమ కావాలే. ఎవరెటు పోకటో, ఏం చేసుడో ఆనాడే మాట్లాడుకుని పోదాం. ఇగ మీరే మంటరో చెప్పుండ్రి అంటూ ముగించాడు పాండు.

అక్కడ కూచున్న జనాల్లో అందులో "తప్పేముంది" అలాగే చెయ్యాలి" అన్నట్లే ఉంది. ఆకలికి మాడి మనం ఉత్త పున్నేనికి చావడం, ఉన్నోదేమో సుఖంగ ఉండుడు. ఇది మంచిదిగాదనే అందరికి అర్థమైంది. రెక్కలిర్సుకొని కష్టం చేసినా గిదే బతుకాయె. తిండి లేక హరిగోసాయె ఇగ ఏం చేసుడు: అన్నదే వారందరి మనస్సుల్లో మెదులుతుంది. గుసగుసలు ప్రారంభమైనయి. దగ్గరి దగ్గరి ఊర్లకు నువ్వు అంటే నువ్వు అని కబురు ఇచ్చే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆ యా ఊర్లల్ల ఉన్నోళ్ళ లిస్టు, ఆ పట్టీలున్న షావుకార్ల లిస్టు చకచకా మెదళ్లోకి ఎక్కుతుంది. అందరికి బాధ్యతలు అప్పగించాడు పాండు. ముగ్గురు యువకులు లేచివచ్చి పాండు సరసన నిలబడ్డారు. 'ఇది పోలీసు రాజ్యం దాదా' అంటూ ఎత్తుకోగానే చాలా గొంతులు కోరస్ కలిపాయి. మీటింగ్ పూర్తయిందని లేచి అందరు దారి పట్టారు.

దల్సు, రామకాస్తా వెనుక బిడ్డట్టున్నారు. పాండు దారికి ఎక్కేసరికి 'మేమూ అటే' అంటూ వెంట నడిచారు.

అన్నలకు పాండు దగ్గరివాడని స్పష్టంగా అర్థమైన దల్సు మెల్లగా కదిలించాడు.

"దాడికి అన్నలొస్తరా-పారీ (బావ లేదా వియ్యంకుడు)

"చెప్పుడు కష్టమే. మనం గట్టిగ ఉండాలిగానీ ప్రతిదానికీ అన్నలే రావాలంటే ఎట్లా- అయినా మీ ఊరి వాళ్ళందరిని తెస్తరుకద మీరు" అన్న పాండు జవాబులో తనకు కావలసింది లేదని దల్సు ఉసురుమన్నాడు. అన్నలు వస్తే బిడ్డ కలుస్తుందని ఆశకు.

"అదికాదు బావ. రాగో ఎట్లుంది"-అంటూ రామ అసలు విషయం లోనికి గుంజాడు.

"దాని రంధి విడిచి పెట్టుండ్రోయ్. దానికేం డోకాలేదు ఏమైన అది గట్టిదే. పార్టీలోకి పోవడం మంచి పని చేసింది. లోకుల కోసం నిలబడుతుంది" అన్న పాండు మాటలలో దల్సు తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

....

అనుకున్న ప్రకారం అందరూ 'తోలుబొక్క' దగ్గర జమ అవుతున్నారు. ఆడ, మగ పిల్లలు కూడా వున్నారు. ఎక్కడికి పోవాలో, ఏం చేయాలో ఎవరికీ అంతు చిక్కడంలేదు. పాండువస్తే గానీ ప్రోగ్రాం తేలదు అనుకుంటున్నారు ఆ యా ఊర్ల సంఘాలవాళ్ళు.

'అన్నలొ స్తరేమో' అన్నట్టు మెట్ట దిక్కు, వాగు దిక్కు చూస్తున్నారు. చూస్తూ చూస్తూ వుండగానే జనం పెరిగారు. దూరం నుండి వచ్చినవారు కొందరు చెట్లకింద నడుం వాల్చారు. పిల్లలకు తల్లులు పాలు పెడుతున్నారు. యువకులు హుషారుగా ఒకర్ని ఒకరు పలకరించుకుంటున్నారు.

దూరంనుండే పాండు రావడం చూసిన ఒక బాయి 'పాండు దాద' అనేసరికి అందరూ ఖిల ఖిల లేచారు.

"రాం ! రాం !" "లాల్ సలాం దాద" అంటే "లాల్ సలాం" అని అందరిని పలకరిస్తూ చేయి కలుపుతున్న పాండు చుట్టు పెద్ద గుంపు తయారైంది. అతని కబురు వినడానికి అందరూ చెవులు రిక్కించారు.

"దాదా ! జెర నాకు ఆలస్యమైంది. మనందరం ఇవ్వాల కలుసుకోవాలనుకున్నాం కదా ! రావల్సిన వాళ్ళందరూ వచ్చినట్టే కదా !" అని మొస తీసుకొని అందర్నీ కలియ చూసాడు పాండు—

మనందరం యివాల 'ఆలూరు'కు పోవాలి. గొడ్లు మళ్లే వేళకు బయలుదేరితే సరిగ్గా వేళకి చేరుతాం. అక్కడ షావుకార్ల ఇళ్ళు ఒక్కటైనా సరే విడిచిపెట్టకూడదు. అందరూ హుషారుగా వుండాలి.

ఈ షావుకార్లంతా ఒట్టి బాజెగాళ్ళన్నది మనకు తెలుసు. ఏడ్చినా మొత్తుకున్నా వదిలిపెట్టొద్దు. తలుపులు లోపల్నుంచి బిగిస్తారు. అందరూ గొడ్డళ్ళు తెచ్చుకున్నారు కదా! మన సంఘం దాదాలు కొందరి దగ్గర పలుగులు కూడా వున్నాయి. తలుపు తియ్యలేదని ఏ యిల్లు, ఏ దుకాణం వదలొద్దు.

పనకిరాని సరుకులు అనవసరమైన బరువులు నెత్తిన పెట్టుకోవద్దు. ముఖ్యంగా నూకలు, మిర్చి, పప్పు, బట్టలు మనకు కావలసినవి ఏవీ మిగిలిపోనివ్వొద్దు. కుదువబెట్టిన వారి వస్తువులు మనం తెచ్చుకోవాలి.

తర్వాత ప్రతి యింట్లోనూ సంఘం దాదలు కూడా కొందరుండాలి. అప్పు పత్రాలు, పద్దుల పుస్తకాలు మిగిలిపోకుండా చూడ్డం మీ పని.

దాదా, మనం ఏ షావుకార్నిగాని, ఆ యిళ్ళల్లో ఏ ఆడమనిషినిగాని ఏమీ అనొద్దు. ఎవర్నీ చంపొద్దు. వాళ్ళ యిన్నేళ్ళ మనల్ని దోచుకొని దాచుకొన్న మన కష్టార్జితం మనం తెచ్చుకుందాం. అంతే.

అయితే ఎవరైనా అడ్డుకున్నా ఎదురుకున్నా మనం దేనికీ జంకొద్దు. ఏం జరిగినా ఫరవాలేదు.

ఇప్పటిదాకా యీ కబురు మనం కడుపులోనే పెట్టుకున్నాం బయటెక్కడా పొక్కలేదు. పోలీసులు రావాలంటే మూడుగంటలైనా పడుతుంది. కనుక ఏమీ గాబరా పడకుండా మన పని అంతా నిబ్బరంగా చకచకా చెయ్యండి.

ఒకవేళ ఏదేనా జరిగినా అడుగు వెనక్కి వేయకుండా గట్టిగా నిలబడండి. మనం చాలా మందిమే వున్నాం. మనం దేనికీ భయపడొద్దు. మనకి అన్ని దన్నులు వున్నాయి. మర్చిపోకండి. నేనుకూడా మీలోనే వుంటున్నాను. ఏదైనా మాటుంటే మళ్ళీ నేనే చెప్తాను.

ఆఁ దాదా! ఒక్కటి బాగా మతికుంచుకోండి. అక్కడున్నంతసేపు ఎంత పని వున్నాసరే ఎవ్వరూ ఏ వూరు పేరుగాని ఏ దాదా పేరుగాని బయటకి అనొద్దు.

మరొక సంగతి - జావో, అంబలో, నీళ్ళో వుంటే తాగేసి తయారుకండి" అంటూ సంఘం పొందు కార్యక్రమం అంతా వివరించి జాగ్రత్తలన్నీ చెప్పాడు.

ఊపిరి తీస్తున్నచప్పుడు మినహా మరొక శబ్దం లేకుండా అందరూ చెవులు రిక్కించి వింటున్నారు. ఆ మునిమాపు చీకట్లో చెట్లనీడల్లో కలిసిపోయి మొత్తం ఎందరున్నారో చెప్పడం కష్టమే.

చిక్కబడుతున్న చీకటిని చీల్చుకుంటూ ఆ నీడల దండు కదిలింది.

అలారు అప్పుడే నిద్రలోకి జారుకుంటున్నది. పద్దులు చూసుకున్న పెద్ద షావుకార్లు దీపాలు మల్పి మంచాలు ఎక్కుతున్నారు. కోయగూడెం, మాలవాడ ఎప్పుడో చీకట్ల మునిగిపోయాయి. ఆరుతూ, వెలుగుతూ, బిక్కు బిక్కు మంటున్న సోలార్ లైటు పంచాయతీ గుమ్మం ముందు బెదురుతూ నిలబడింది.

సద్దుమణిగిపోయిన అలారులో అకస్మాత్తుగా పెద్దరొద ప్రారంభమైంది. అర్ధరాత్రి వరదవచ్చినట్టు ఊళ్ళోకి కాపువీధి దాటుకుంటూ ఆ వరద షావుకార్ల వాడను ముంచెత్తింది.

ఒక్కసారిగా గందరగోళం, గగ్గోలు ప్రారంభమైంది. తలుపులు దబదబ బాదుతున్నారు. గొడ్డండ్ల దెబ్బలకు తలుపులు విచ్చుకుంటున్నాయి. ఆడవాళ్ళు, పిల్లలు గోడుగోడుమంటున్నారు. షావుకార్ల పెడబొబ్బలతో కోయ, కాపు యువకులు కూడ కొందరు పరుగు పరుగున ఆ వాడకు చేరుకొని తాము కూడ సందట్లో చేరిపోయారు. అవుతలి లైనులో ఉన్న గార్డు, గుమాజీల గదుల్లో దీపాలు చప్పున మలిగిపోయాయి.

పుల్లయ్య షావుకారి పాండు కాళ్ళమీద పడి బోరుమన్నాడు. డబ్బులిచ్చుకుంటాను తనను ప్రాణాల్తో వదలిపెట్టమని కాళ్ళవేళ్ళ పడుతున్నాడు. గోడౌన్ తాళాలు, తుపాకి వసూలు చేసుకొని సంఘం పాండు అతని వెంట యువకులు పుల్లయ్యను పక్కకు తోసేసి ముందుకు కదిలారు.

గోడౌను తలుపులు తెరుచుకునేసరికి కట్టతెగిన చెరువులా జనం లోపల చొరబడ్డారు. ఆ చీకట్లో తడుముకుంటూ జనాలు సరుకులు సదరడం మొదలైంది. క్షణాల్లో జోరలు నిండుతున్నాయి. మూటలు నెత్తికెక్కుతున్నాయి. డబ్బాలు, ప్యాకెట్లు ఖళ్ళున కింద పడుతున్నాయి. పది నిముషాల్లో పుల్లయ్య గోడౌను వరద తీసిన పంట పొలంలా బావురుమంది.

పాండు దళం బజార్లోకొచ్చేసరికి ఎదుటి గుమ్మంలో గప్పున చలిమంట లేచింది. అప్పుపత్రాలు, ఖాతా పుస్తకాలు తగలబడిపోతూవుంటే ఇంట్లో నుంచి బయటకు నడుస్తున్న గిరివి పెట్టిన నగలు, పాత్రలు ఆ మంటల వెలుగుల్లో ధగధగ లాడుతున్నాయి.

అరగంటలో కోలాహలం సద్దుమణిగి దండంతా ఊరి బయటకు చేరుకుంది.

తుపాకీ భుజాన వేసుకొని పాండు ముందు దారితీయగా మబ్బుపట్టిన మసక వెన్నెల్లో ఆ దండు చరచరా నడుచుకుంటూ అడవిలో కలసిపోయింది. 'ఒంటి మామిడి' దాటి ప్రక్కకు తప్పుకొని 'బోడిమెట్ట'దిగి ఒర్రె ఒడ్డున 'జంటమద్ది' చెట్ల వద్ద కొచ్చేసరికి "దాదా ఇక్కడ దింపుకుందాం" అన్నాడు పాండు.

బరువులు దించుకొని జనం ఒక్కపెట్టున ఒర్రెలో దిగి మొఖాలు కడుక్కొని దప్పిక తీర్చుకున్నారు. అందరు నీళ్ళుతాగి గడ్డకెక్కేసరికి మద్దిచెట్టు మొదట్లో చిన్న నెగడు రాజేసింద్రు. పాండు మరికొందరు సంఘంవాళ్ళు సామానులన్నీ వరుసగా సదురుతున్నారు.

పాండు అక్కడే ఉన్న మొద్దుమీద నిలబడి 'దాదలు వినండి' అనేసరికి నిశ్శబ్దం చోటు చేసుకుంది.

"దాదా, మనం అనుకున్నట్టు అంతా ఏ అడ్డు లేకుండా చకచకా సాగింది. మన సామానులే కాకుండా కావలసిన సరకులతోపాటు పుల్లయ్య తుపాకి కూడ తెచ్చుకో గలిగాం" అందరిని కలియచూశాడు.

నెగడు చుట్టూ బియ్యం, దినుసులు, బట్టలు దేనికవే విడివిడిగా పేర్చి ఉన్న సరకుల గుట్టల్ని ఆడవాళ్ళు, దాదలు చేతులతో తడిమి చూస్తున్నారు. కొర్రాయి ఎత్తి పట్టుకొని వెలుతురులో దగ్గరిగా పరీక్షిస్తున్నారు. పాండు మళ్ళీ గొంతు సవరించు కొని "మనం కష్టపడి మోసుకొచ్చిన ఈ సరకుల్లో ఏ ఒక్కటీ బేకార్ కాకుండా జాగ్రత్తగా తీసుకపోయి వాడుకోవాలి. పోలీసులొచ్చినా సరే ఇవి మళ్ళీ వాళ్ళచేతుల్లో పడనివ్వకూడదు. నిలవ ఉండే సరకులు ఇళ్ళల్లో దాచుకోవద్దు. ఎవరెంత బాధ పెట్టినా, ఎవరు ఎవరి పేరు చెప్పొద్దు" అంటూ "సారీ! పంపకాలు త్వరగా కాని ద్దాం" అంటూ పాండు పనిలోకి దిగాడు.

ఒకరి వెంట ఒకరు జనమంతా బియ్యం ఒక బోరలోకి పడుతూ ఉప్పు, కారము విడి విడి ముళ్ళలు కడుతుంటే వంతుల వారిగా క్షణాల్లో పంపకం సాగి పోతున్నది. గుడ్డలమూటవద్ద నిలబడి పాండు పేరు పేరున ఎవరికేది అవసరమో చూసి పంచెలు, దుప్పట్లు, లుంగీలు, రవిక బట్టలు చకచకా పంచుతున్నాడు. బట్టలు పుచ్చుకున్నవాళ్ళు చేతులతో తడిమి చూసుకుంటూ, చెంపలకు రాసుకుంటూ నెగడు వెలుగులో అటు ఇటు తిప్పిచూస్తు మురిసిపోతున్నారు.

ఒక ఎర్రటి సిల్కు జాకెట్టు గుడ్డ చేతికొచ్చేసరికి పాండు ఎదురుగా తన ఊరి శేడోమె వచ్చింది.

"ఇదీ మంచి బట్టబాయి" అని అందించబోతుంటే బోసిగా నవ్వుతూ "అది నేనేం చేసుకోను దాద, నాకున్న ఒక్క పోరి ఎప్పుదెదుగుతుందో, నాకైతే రవికతీసి నాలుగేళ్ళయింది కాదా, దాని వంతుకు నూకలో, కారమో పొయ్యి" అనేసరికి బిత్తర పోయిన పాండు గుడ్డల గట్టీలో నుంచి ఓ దుప్పటితీసి ఆమె చేతికిస్తూ "నూక లిందులో పోయించుకో బాయి" అన్నాడు.

దువ్వెనలు, టిక్లీలు, బ్యాటరీ లైట్లు, నూనెసీసాలు, పౌడరు డబ్బాల కుప్ప దగ్గరికి చేరి పడుచువాళ్ళు తలా ఒకటి ఎంచుకుంటున్నారు.

సమీక్షా వ్యాసం :

వేకువ

కె. వి. ఆర్.

చీకటి తన ముట్టడిని ఇప్పటికీ ఎత్తలేదు. పాలకులు మారినా వ్యవస్థలు మారినా పేదరికం మాత్రం ఎప్పటిలాగానే ఉంది. 'అభివృద్ధి' గణాంకాలలో కనిపించినంతగా బతుకులలో కనిపించడం లేదు. రాజ్యాంగచట్టం సరికొత్తగా ప్రకటించుకున్న లక్ష్యాలలో సోషలిజం ఒకటైనా అది ముచ్చటగా కాగితం మీదనే ఉంది. వెయ్యినొక్క ముఖాలతో దోపిడీ ఇతోధికంగా సాగిపోతూంది. పరిపాలకవర్గం అనునిత్యమూ అమలుజరిపే ప్రచ్ఛన్న దౌర్జన్యంలో అది అంతర్భాగమే. పేదరికం అనేదే ఒక బ్రహ్మాండమైన హింస. జీవితసౌఖ్యం తోటి అది యథేచ్ఛగా చెలగాట మాడగలుగుతూంది. మానవీయతను అడుగడుగునా దెబ్బతీస్తూంది. మనుషులను పశుతుల్యంగా తప్ప చూడడంలేదు. ఇది రాజ్యం దుర్మార్గం.

నిమిషాల్లో పంపకాలు పూర్తయి భుజాలకెక్కి ముళ్ళెలు నెత్తిన కూచున్నాయి.

ఇక కదలడమే ఆలస్యం అన్నట్టు నిలబడిన జనాన్ని చూస్తూ పాండు "దాదా ఒక ముచ్చట మిగిలిపోయింది. మనం తెచ్చిన ఈ తుపాకీ అన్నలకిద్దాం. మీ విచారం ఎలాగుందో చెప్పండి".

"వాళ్ళు మన పిల్లలేకదా! అది వాళ్ళ దగ్గరుంటేనే మంచిది" అన్నాడు-కేడెనార్ పటేల్ దల్సును చూస్తూ.

జనం అందరూ ఒక్కసారిగా 'ఇంగో' (అవును) అన్నారు. వెంటనే పాండు అందుకోని

'దండకారణ్య ఆదివాసి సంఘం' అనగానే అందరు 'జిందాబాద్' అన్నారు.

ఆ మసక వెన్నెల్లో దాదలందరు కలుద్దాం అంటే కలుద్దాం అని లాల్‌సలాంలతో చేతులు కలుపుకుంటూ ఎవరి దారిన వారు బయలుదేరారు.

(ఇంకా ఉంది)

నలబై నాలుగేళ్ళ కిందట నిజంగానే బూర్జువా విప్లవం ప్రారంభమై వుంటే, నేటికీ భూమి బందీయై ఉండేదికాదు. వ్యవసాయ ప్రధానమైన దేశంలో రైతాంగం బక్కచిక్కి నడుము విరిగి ఉండేదికాదు. ప్రభుత్వాలు ప్రవేశపెడుతూ వచ్చిన భూ సంస్కరణలు జమీందారీ, ఈనాందారీ పద్ధతులను అంతమొందించి వుండవచ్చు. వేలాది, వందలాది ఎకరాల ఆసాములను గూడా తొలగించి వుండవచ్చు. జరిగి తీర వలసిన మార్పులో ఇది సముద్రంలో కాకిరెట్ట మట్టుకే. నిజానికి ఇది కంటినీటి తుడుపు, రాజ్యం కపటం. భూస్వామ్యం సమూలంగా అంతరించి వ్యవసాయం కూడా పెట్టుబడిదారీగా మారిపోయిందనేవాళ్ళకు, గ్రామీణ యథార్థం సాకల్యంగా తెలుసునా అని అనుమానం. దేశం ఒక ప్రాంతంలో ఉన్న పరిస్థితి మరొక ప్రాంతంలో లేదు. ఒక జిల్లాలోనే పల్లపు ప్రాంతానికీ మెట్టప్రాంతానికీ తేడా లున్నాయి. భూస్వామ్యంలో వచ్చింది కేవలం పైపైమార్పే. భూస్వామిక ఆస్తి సంబం ధాలు మౌలికంగానే దెబ్బతినలేదు. వాటి తాలూకు భూస్వామిక సంస్కృతి సంప్ర దాయాలు నిరంతరాయంగానే కొనసాగగలుగుతున్నై. క్రూరపెత్తనం ఇంకా సజావు గానే ఉంది. నిజానికి, పరిపాలక వర్గంలో భూస్వామ్య అవశేషాలకు నేటికీ స్థానం ఉంటూంది.

'హరిత విప్లవం' (గ్రీన్ రివల్యూషన్) జరిగిందన్న ప్రాంతాలలో కూడా రైతాంగం బాగుపడిందేమీలేదు. పంటలు మారివుండవచ్చు, ఎరువులు మారి వుండ వచ్చు. విత్తనాలు మారివుండవచ్చు. దున్ని పండించేవాడు మాత్రం అట్టడుగునే వున్నాడు. జరిగిందల్లా సరికొత్తగా సంపన్నమైన ఒక కొత్త ఉపవర్గం ఏర్పడటమే వ్యవసాయ సంపద మిగులు లాభసాటి తెన్నులకు మళ్ళి ఈ వర్గానికి ఆర్థిక, రాజ కీయ ప్రాముఖ్యాన్ని సమకూర్చగలుగుతూంది. కాంట్రాక్టర్లూ, సినిమా ప్రొడ్యూ సర్లూ, హోటల యజమానులూ, కొత్త వర్తకులూ తెగబలుస్తున్నారు. చివరకు విద్య, వైద్యరంగాలకు గూడా ఎగబడుతున్నారు. నయా సంపన్నవర్గం భూస్వామిక పద్ధతు లకే గ్రామాలలో వారసత్వం పుచ్చుకుంది. రైతుకూలీలయిన దళితులనూ వెనకబడిన కులాలనూ వెనకటికంటె క్రూరంగా అణిచిపెట్టే దుష్ప్రయత్నాలు చేస్తూ ఉంది. హింస కొత్తతొడుగు ధరిస్తూంది.

అన్నపూర్ణ, రత్నగర్భ అంటూ ఆత్మసంతృప్తికి చెప్పుకునే బాబులను జీవి తం అపహసిస్తూంది. "వాపీ కూప తటాకాదులు" వెనకటివి ఎన్నడనగానో మూల

బడి నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలలో ఒకవైపు ప్రకృతి కరుణించక, ఇంకోవైపు మైనర్ ఇరిగేషన్ వసతులూ లేక, వ్యవసాయదారులు నిత్యక్షామాన్ని ఎదుర్కొంటూ వస్తున్నారు. రైతులు రైతుకూలీలుగా మారుతున్నారు. కన్నబిడ్డలవంటి పశువులను మేపలేని దుస్థితిపాలై పట్నాల కసాయివాళ్ళకు తెగనమ్ముకుంటున్నారు. దినకూలీలుగా ఉన్నూళ్ళు వదిలి పనులున్నచోట్లకు వలసలు కట్టి నికృష్టమైన పరిస్థితులకు లోబడిపోతున్నారు. చేతివృత్తులవాళ్ళు తమ ఉత్పత్తులకు గిరాకీ లేక పట్నాలకు తరలి వెళ్ళి ఏ మిల్లుల్లోనో చేరి కొత్త వాతావరణంలో ఇమడలేకపోతున్నారు. రైతాంగం బిడ్డలు కొందరు బొగ్గుగనుల లోతులు కొలుస్తున్నారు. మరి, గిరిజన రైతాంగం స్థితిగతుల గురించి చెప్పేదేముంది? అసలే సాధుజీవాలు. మైదాన ప్రాంతాలనుంచి తరలి వచ్చే దోపిడి దొంగలనుంచీ ఫారెస్టు అధికారుల నుంచీ, గిరిజన కార్పొరేషన్ ఉద్యోగుల నుంచీ మరెంతమంది నుంచో తమ జీవనానికి వచ్చే ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు.

రైతులుకానీ, రైతు కూలీలు కానీ, గిరిజనులు గానీ, మొత్తంగానే దౌర్జన్యానికీ దోపిడీకీ అర్రునిచ్చి తమ మానవత్వాన్ని దిగజార్చుకుంటున్నారా? కారు మబ్బులో మెరుపుతీగలే లేవా? వ్యవస్థీకృతమైన అక్రమానికి ప్రతిఘటనే లేదా? ప్రాంతీయమైన తారతమ్యాలు ఉండవచ్చునేమో గాని, అసంతృప్తి ఎక్కడనైనా రకరకాల ధిక్కారంగా భగ్గుమంటుంది. రైతాంగం తనంత తానుగా విప్లవశక్తి కాదనీ, కార్మికవర్గం నాయకత్వాన మాత్రమే అది విప్లవశక్తి కాగలదనీ దేశ దేశాంతర చారిత్రకానుభవం తేల్చింది. కార్మికవర్గ అగ్రగామి చైతన్యం గల కమ్యూనిస్టు పార్టీ విప్లవ కార్యాచరణలో భాగంగా, ఇప్పుడు మనదేశంలో వ్యావసాయక విప్లవాన్ని ఘటిల్ల జేసేందుకు నడుముకట్టివుంది. గత పాతికేళ్ళుగా రైతాంగ పోరాటాలు జరుగుతూవున్నై. వీటి ప్రభావం పల్లెలనుంచి పట్నాలకు, రైతాంగం నుంచి కార్మికవర్గానికి వ్యాపిస్తూవుంది. అయితే రాష్ట్రంలో అంతటా ఒకే పరిస్థితి లేదు. ఉత్తర తెలంగాణా జిల్లాలలో ఉన్నంతగా పోరాట వాతావరణం కోస్తాజిల్లాలలోనో రాయలసీమ జిల్లాలలోనో లేకపోవచ్చుగాని, ఈ ప్రాంతాలలో గూడా జీవిత వృక్షం అక్కడక్కడా ఎర్రచిగుళ్లు తొడగకపోలేదు. మొత్తంమీద, గ్రామాలు కదలబారుతున్నై.

కళ్ళముందు జరుగుతూన్న చారిత్రాత్మకమైన ఈ పెనుమార్పును తెలుగు సాహిత్యం ఏ మాత్రం తన వస్తువుగా స్వీకరిస్తూంది?

కవిత్వానికైతే ఇది దాదాపు అసాధ్యం. విప్లవ కవిత్వమైనా జీవిత వాస్తవాన్ని వాలినంతగా ప్రతిఫలించలేదు. కవిత్వ స్వభావమే అంత అనుకోవలసి ఉంటుంది. కాని, వచన సాహిత్యం విషయం వేరు. ముఖ్యంగా నవల, కథానిక ఈపని చెయ్యగలవు. తెలుగులో వాస్తవికతావాద ధోరణి కొత్తదేమీ కాదు. కుటుంబరావు, కరుణకుమార, మా గోఖలే, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, గోపీచంద్, రా.వి. శాస్త్రి, కాశీపట్నం రామారావు, మరెందరో రచయితలు తరతమ భేదాలతో వాస్తవికతావాద కథాసాహిత్యాన్ని పరిపుష్టం చేసి ఉన్నారు. వీరిలో కొందరైతే కళాశిఖరాలను స్పృశించారు. ప్రశస్తమైన కథా వస్తువును ప్రశస్తమైన శిల్పంతోటి ఉజ్జ్వలం చేశారు. కాని, ఇటీవలి దశకాలలో జీవితం మొక్కట్లు ప్రస్ఫుటమైన ఉత్తమ కథలకు కరువేర్పడినట్టుగా ఉంటూంది. రా. రా; కేతు విశ్వనాథరెడ్డి, సోదుం జయరామ్, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, మధురాంతకం రాజారాం వంటివారితో సైతం ఈ కరువు తీరలేదు. ఈ లోపల వినోద ప్రధానంగా మల్లాది వెంకట కృష్ణమూర్తి తరహా కథలు రంగాన్ని ఆక్రమించుకున్నాయి. అర్థవంతమైన ఘటనలు కేంద్రంగా మన్నుతునకల వంటి పాత్రలతోగూడిన కథలు తెరమరుగౌతూ వచ్చాయి. అయితే అవి సర్వసంపూర్తిగానే లేనట్టు అర్థంకాదు. అల్లం రాజయ్య, బి. యస్. రాములు, కాలువ మల్లయ్య, బోయ జంగయ్య, భూషణం, అప్పల్నాయుడు వంటి కథకులు కంటబడుతూ వచ్చారు. వీరిలో ఎక్కువమంది తెలంగాణా, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలవారు కావడం కాకతాళీయమేమీ కాదు. సంఘర్షణనుంచి వ్యక్తిత్వం విస్ఫులింగాలు వెదజిమ్ముతూ, ధిక్కార ధ్వజాన్ని చేబట్టిన పీడితులు యుగచరిత్రలో కొత్త అధ్యాయాన్ని రక్తరంజితంగా రచిస్తున్న ప్రాంతాలు కూడా ఇవే.

ఈ వాస్తవాన్ని నిరూపిస్తున్న కథా సంకలనం 'భూమిక'. క్రూరమైన జీవితం కొట్టేదెబ్బల పచ్చిగాయాల్లాంటి 24 కథలున్నాయి. ఈ కథకులు వరసగా చక్రవేణు, మధురాంతకం నరేంద్ర, సింగమనేని నారాయణ, బోయ జంగయ్య, కాలువ మల్లయ్య, కాట్రగడ్డ దయానంద్, పాపినేని శివశంకర్, జూకంటి జగన్నాథం, అల్లం వీరయ్య, నందిని సిధారెడ్డి, వివినమూర్తి, అల్లం రాజయ్య, భూపాల్, దేవరాజు మహారాజు, స్వామి, కల్యాణరావు, ఎస్. రాములు, కార్మిక, వల్లూరుపల్లి రంగారావు, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, ఏ. అప్పల్నాయుడు, భూషణం, గోదావరి, ఫణికుమార్. పరిచయం చేసిన కె.వి. ప్రసాద్ రాసినట్లు, ఈ కథా రచయితలు

"మహా రచయితలుగాదు". అయితే, అనేకులు మంచి కథకులే. కొందరైతే గొప్ప రచయితలయ్యే క్రమంలో ఉన్నారనవచ్చు. మహారచయిత ఆకాశం నుంచి ఊడి పడడు - అలా పరిణతి చెందుతాడు. నిరంతర సాధనకు మారుపేరైన 'వ్యుత్పత్తి' ప్రతిభకు తోడుకావాలి వస్తువుకుతగ్గ శిల్ప ప్రౌఢిమ చేకూరాలి.

*　　　*　　　*

మంచిరోజులు పోయాయి, కరువు వచ్చిపడింది. ఊళ్ళో మగవాళ్ల పొలాల్లా ఊళ్ళు విడిచి ఎక్కడో ముగ్గురాళ్ళ గనుల్లో కూలిపనులకు వెళ్ళారు. కొందరు తిరుపతిలో రోడ్డుపని చేస్తున్నారు. మిగిలినవాళ్ళు ధాన్యంలేక కలబందగడ్డలు తిని ప్రాణాలు నిలుపుకుంటున్నారు. గొడ్లకు మేతలేదు సరిగదా, గొంతు తడుపుకోడానికి నీటిచుక్కైనా లేదు. బెంగుళూరు కసాయివాళ్ళకు అమ్ముకోవలసినట్టేర్పడింది. కర్రాపును ఆరోప్రాణంగా చూచుకునే రాయుడు, తల్లి దాన్ని తెగనమ్మిందని తెలుసుకుని బెంగపెట్టుకుంటాడు. "ఆ గంగతల్లికీ కరుణలేదు! రాజ్జమేలే మారాజుల గుండెలూ కరగలా. ఆకరికి కసాయి వ్యాపారులే కనికరించి నాలుగు రూకలిచ్చినారు. నువు ప్రాణంగా చూసుకునే ఆవే కసాయి కరువుకు పానాలిచ్చి నీ చెల్లెల్ని కాపాడింది. ఇంకా నాలుగురోజు లుండేట్టుగా మన ప్రాణాల్ని నిలబెట్టింది. రాజ్జమేలే పాపిష్టి మనుషులకన్నా గొడ్లేమేలురా!" అంటూ నాగమ్మ మనస్సులో రోదించే కథ-'కసాయికరువు'.

"దండాలు దొరా! నేను సామీ....మునెమ్మని...." అంటూ పాత సత్తుగిన్నెలాంటి తలతో, గోగునార పోగుల్లాంటి వెంట్రుకలతో, ఫారెస్టు గార్డ్ మొదలు రైల్వే టికెట్ ఇన్‌స్పెక్టరు వరకు ఎందరికో తనను పరిచయం చేసుకునే ముసల్ది, తలమీద మోపుకున్న కట్టెల మోపును దించదంపే దించదు. ప్రతి ఒక్కరికీ ఎంతో కొంత ముట్టజెబుతూనేవున్నా, ప్రతి ఒక్కరూ దబాయిస్తారు. ఊళ్ళో వ్యవసాయపు పనులు పుట్టవు. రైతులు కూలీకి పిలవరు. 'మాల, మాదిగ' వాళ్ళు బతకాలంటే అడవిలో కొట్టుకున్న కట్టెల మోపులు ఊళ్ళోకి తెచ్చి అమ్ముకుంటేనే గాని దారి లేదు. ఈ కాకులను కొట్టి గద్దలకు వేసేవాళ్ళు ఒకరూ ఇద్దరూ కాదు. "ఈ మోపు మీకు కట్టెలమోపుగా కనిపిస్తావుండాదేమో సామీ! ఇది నా ప్రాణం-ఇది నా రక్తం-ఇది నా చెమట సామీ!" అందుకనే మునెమ్మకు తన్నులూ తోపులూ తిట్లూ, చివరికి దెబ్బలూ కూడా లెక్కలేదు. తాను చేసింది తప్పా? "కడుపుకు తప్పు గిప్పు తెలియవు సామీ!" - "కాకులు-గద్దలు".

వెంకటప్ప ఓ మోస్తరు రైతు. బోరింగ్ వేయించినా నీళ్ళు సరిగా అందక మూడెకరాల మడి ఎండిపోయింది. వెనక్కాయ పంట తీసేది కలకాకుంటే కల్ల. తిండిగింజలకు కూడ అక్కర వచ్చింది. ఎక్కడా అప్పు పుట్టదు. బీడీ కొనడానికి గూడా పైసలు లేవు. చివరకు గత్యంతరం లేక పెద్దకొడుకుతో కలిసి రోడ్డు పనికి పోవడానికి నిర్ణయించుకుంటేనే ఆ పూట గడిచింది - "విముక్తి"

మీది దృశ్యాలు రాయలసీమ రైతాంగ జీవితానికి సంబంధించినవి. మరి తెలంగాణాదో ?

పండించిన వడ్లకు ధర పలకదు. కరెంటు సరిగా అందదు. మార్కెట్‌లో పట్టపగటి దోపిడీ. "పొలంలో పందికొక్కుల్నుండి కాపాడుకున్నాంగాని, ఈ ఊర పందుల్నుండి కాపాడుకోలేక పోతున్నాం" చేసిన అప్పులు చెదలు తిన్నట్లు తింటున్నాయి. భూమి తనఖా బ్యాంకులు, అంజుమన్ బ్యాంకులు అప్పులిస్తాయంటే వాటి వడ్డీలు రైతాంగాన్ని తినేస్తున్నై. "సర్కార్ అప్పులిచ్చి మిత్తితో సహా వసూలు చేస్తుంద్రు. లేకుంటే గొర్రెల్ని, నగల్ని, గిన్నెల్ని గుంజుకు పోతంద్రి. కరెంటోడు కరెంటిచ్చి బిల్లు తీసుకుంటూనే కొంచెం ఆలిసం అయితే ఫీజు పీక్కపోతుంద్రి. మరి మేం కట్టె పన్నులు పంచేస్తున్నట్లు ? నా పేరునలేక అడుగుతా" అంటున్నాడు, ఊరు వదిలి బావి దగ్గర కాపురముంటూన్న రామన్న-"చెదలు".

ఊరి దొర, సర్పంచ్ అయిన భూంరావు కొలువుతీరి పంచాయతీ జరుపు తున్నాడు. నర్సయ్య కూతురు మల్లవ్వ విధవరాలై కూడా గర్భం తెచ్చుకుందని కుల పెద్దలమద్దతుతో వెలివేయించి దండుగ వసూలు చేసుకోవాలని భూంరావు ప్రయత్నం. అయితే కడుపు చేసిన రాజయ్య కులపంచాయితీనేగాక దొరను కూడా ధిక్కరించి, "అణిగి మణిగి ఉన్నకొద్దీ గిట్లనే సవారి జేత్తరు. కులం కులమని ఇడిపోతే మనండ్ల మనకే కొట్లాట పెట్టరు. కష్టపడి బతికేటోల్లది,కూలోల్లది అంతా ఒక్కటే కులం" అంటూ మల్లవ్వతో, "ఎందుకు బయపడ్తన్నవ్? ఏం తప్పు జేసిన్నని నాలెకు మొక మేసినవు ? నాతోనిరా ! నిన్ను లగ్గం జేసుకుంట"నని అన్నాడు - 'వెలి' వ్యక్తి పరమైన ఇలాంటి ధిక్కారమే వేలాది గుండెల్లోంచీ గొంతుల్లోంచి వెలికురికి సంఘటిత మైనప్పుడుపోరాటానికి పూర్వ రంగాన్ని సమకూర్చగలుగుతుంది.

చితికిన రైతు రామయ్యతాత, నడమంత్రపు సిరి వచ్చి పడినవాడు గణపతిశెట్టి షావుకారు. ఎరువులకిందా మందులకిందా తెచ్చిన అప్పు తీరనేలేదు. తండ్రి మంచి

సంక్రమించిన పాతికెకరాల పొలంలో సగం ఈపాటికే శెట్టి పరమైంది. మిగిలిన పొలం మీద కన్ను వేసిన విషయం గ్రహించి, "దేన్నమ్మినా దాన్ని మాత్రం అమ్మొద్దురా నాయనా!" అంటూ తన చివరి కోరిక వినిపించాడు రామయతాత- "మబ్బుతునకా....! మట్టి ముద్దా !!

మాలపాడులో తనకున్న నాలుగెకరాల పొలం తాలూకు వసూలు చేసుకోడానికి నగరం వదిలి స్వగ్రామం వెళ్ళిన "నేను"కు ఊరంతా మారినట్టు కనిపించింది. పార్టీ కక్షలు బలిశాయి. ఊరికి కరెంటు రాలేదు. గ్రంథాలయం లేదు. పొలాల సంగతి చూద్దామంటే డొంకలూ దార్లూ కలిపేసు కుంటున్నారు. తన పొలం సాగు చేసే బుచ్చి రామయ్య కౌలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాడు.

"ఏ యేటి కాయేడు చేతి కందింది నోటి కందడంలేదు. శాకిరి దప్ప మిగిలేదీ కనబట్టంలా". క్వింటాలు పత్తికి నాలుగువందల రేటు పలికితే రైతుకు మిగిలేదేమీ లేదు. "కాలే గట్టాలో, బాంకు బాకీయే తీరవాలో తోసదు.కల్తీ యిత్తనాలు గొంటాం. కల్తీ ఎరువులూ, కల్తీ మందులూ ఏస్తాం. మందు లేసినా పురుగు సావదు. పంట పండినా రేటు రాదు. అప్పుడు దాకా మార్కెట్లో మంచి రేటుంటది. పంట చేతికి రాగానే తగ్గిపోద్ది. ఏమిటో సిత్రం." ఊరంతా ఏదో "అదృశ్య విషాదంలో" మునిగి ఉంది- "మట్టి గుండె". ఇదంతా కోస్తా జిల్లా రైతులబాధ.

మళ్ళీ తెలంగాణా ప్రాంతం. చేనేతకు గిరాకీ పోయింది. మిల్లుబట్ట ఊళ్ళకు దిగుమతి అవుతూంది. చేర్యాల షావుకారుకు మైసయ్య బాకీపడి ఇల్లు రాసిచ్చాడు. కుటుంబాన్ని తీసుకుని సిరిసిల్లకు తరలి వెళ్ళాడు. పేటు దగ్గర కూలి పనికి కుదిరాడు. రోజుకొక చీర నేస్తూ వచ్చినా ఆదాయం నెలతిండికే సరిపోయేది. కొడుకు రాజేశంను చదివించే వసతి కూడాలేదు. వాడూ నెల జీతానికి కుదిరాడు. పవర్ లూం నడపడం నేర్చుకున్నాడు. ఇప్పుడు అతనికి సిరిసిల్లలో కూడా స్థానం లేదని తెలిసి వచ్చింది. కుటుంబం అప్పుల పాలైంది. కాబట్టి భీవండికి ప్రయాణమయ్యాడు- "పట్టణం ఇనుప కౌగిలి నుంచి నగరం రాక్షసి నోట్లోకి" - 'వలస'.

ఊళ్ళకు కాలువలు వచ్చాయి. కాలువ నీళ్ళతోనే కలిగిన మారాజులు వచ్చారు. వారిలో చౌదరి ఒకడు. పచ్చి బాలెంత రాజెల్లి చంటి బిడ్డను తీసుకుని పొలం పనికి వచ్చింది. పోరణ్ణి మంచె కింద పండేసి పనిలో దిగింది. పాలు చేపు వచ్చేదాకా బిడ్డ గుర్తురాలేదు. తీరా పాలివ్వడానికి వెళితే బిడ్డలేదు. కుక్క-లెత్తుకొని పోయాయి. రాజెల్లి

పిచ్చిదయింది. అప్పటినుంచీ కనిపించిన ప్రతి ఒకర్నీ "పదేలా సిన్నపిల్లగాని ఏడుపు ఇనత్తలేదా ?" అని అడుగుతుంది. 'వేటకుక్కలు' తరుమగా రెండేళ్ళ కిందట ఊరు విడిచి వెళ్ళిపోయి ఇప్పుడు తిరిగివచ్చిన నరహరికి ఈ ప్రశ్న వేసింది—'పిలగాని ఏడుపు'.

ఊరిని ఆనుకుని వున్న అడవిని రిజర్వుగా ప్రకటించాక, అందులో మేతకు దిగే జీవాలకు పుల్లర కట్టవలసి వచ్చేది. డబ్బు ఎక్కువ తీసుకుని కూడా రసీదు లిచ్చేవాళ్ళు కాదు. పదేళ్ళ భూమి తాలుకు వ్యవసాయంజేసే పోజాలు కూతురు వీరవ్వ. అతనికి గొర్లూ మేకలూ ఉన్నాయి. వాటిని అడవిలోకి తోలుకొనిపోతుంది. ఒక రోజున ఫారెస్టు అధికారులు వచ్చిపడి గొర్రెలను పట్టుకుని లారీ కెక్కించారు. గొల్ల కుర్మ సంఘం మనుషులు లారీని అటకాయించారు. ఎదురు తిరిగి తమ జీవాలను విడిపించుకున్నారు—'పుల్లర'.

రైలుబండిలో ముంజ లమ్ముకుని పొట్టపోసుకునే సత్తెయ్యలాంటి అమాయకుల నోళ్ళు కొట్టేలా చంద్రరావు ఊరికంతటికీ చెందిన తాటిచెట్లను వేలంపాటలో సొంతపరచుకుని ముంజల వ్యాపారం ప్రారంభించాడు. అల్లుడివద్ద నుంచి 'వ్యాపార రీతి' గురించి తెలుసుకున్న కిటుకులు అమలుపెట్టాడు. బాగుపడ్డాడు, నెత్తీనోరూ కొట్టుకున్న సత్తెయ్యను చావగొట్టి పంపాడు. కాకినాడ సమీపంలో తేగలనాడు ప్రాంతానికి చెందిన తాళ్ళూరు కథ— 'ముంజలు'.

ఆవారా కేసుకింద పోలీసులు వారంరోజుల కిందట పట్టుకెళ్ళిన కుర్రాడు రైలు కిందపడి చచ్చిపోయాడు. తల్లిదండ్రులకు కబురు పంపితే తల్లివచ్చి గర్భశోకం వెళ్ళగక్కుతుంది. తండ్రి రాజారాం మరో దిక్కునుంచి వచ్చాడు. భార్యకూ అతనికీ సంబంధం తెగి చాలాకాలం అయింది. అతను నిర్మయంగా ఉన్నాడు. చూడవచ్చిన వాళ్ళు తనను దెప్పుతున్నా చలించడం లేదు. "ఇప్పుడు రాజారాం ఒక ధ్వంసమైన పల్లెలా వున్నాడు". అతని మనసులో— "కూలిపోయిన గుడిసెలు, పెంకలు కిందికి తోడిన పెంకుటిండ్లు, చెల్లాచెదురుగా పడిన ధాన్యం, తొక్కబడినా కుండ, గుర్గి, ధ్వంసమైన గ్రామం" రూపుకట్టింది. అతని మనస్సే ధ్వంసమైపోయి వుంది. ఒకప్పుడు తాను పదెకరాల భూమి సాగుచేసినవాడే. బావికోసం చేసిన అప్పు, ఇంజను కోసం భూమి తనఖా బ్యాంకువద్ద చేసిన అప్పు తీరక చరాస్తి జప్తు

అయింది. భార్య కూలికి కుదిరింది. తాను దిమ్మరి అయ్యాడు. దొర దగ్గర కొన్నాళ్ల ఊడిగం చేశాడు. తర్వాత తునికి ఆకు కల్లం పట్టాడు. పాత ఇల్లు పోగొట్టుకున్నాడు. భార్యకూ బిడ్డకూ దూరమై చివరి కిక్కడికి వచ్చి బిడ్డ శవం చూశాడు. భార్య ఛీ కొట్టింది. ఒంటరిగా గుండెలు పగిలేలా ఏడవాలనిపించింది కాని ఏడుపురాదు. పోశమ్మ దేవత మర్రిచెట్టు వద్దకు వచ్చాడు. అక్కడినుంచి దారులు చీలుతాయి. ఒకటి తన పల్లెకూ మరొకటి పొరుగూరికీ ఇంకొకటి పెద్దపల్లి టౌనుకూ నాలుగోది రామగిరి అడవికీ పోతాయి. "రాజారాం లోలోపల జరిగిన విధ్వంసాన్ని పూర్తిగా అర్థం చేసుకుని అతన్ని లేపి, గుండె కదుముకోగలిగిన 'బాటసారులు' నాలుగు బాటల్లో ఏ బాటనుంచి వస్తారో మరి?"— 'మనిషీ లోపలి విధ్వంసం'.

పాలమూరు లేబర్‌కు చెందిన తల్లిదండ్రులకూ, అన్నకూ వదినెకూ దూరమై హైదరాబాదులో డాక్టరు సుబ్బారావు ఇంటిలో పనికి కుదర్చబడిన వెంకటేశ్ డాక్టర్ గారి తల్లి పెట్టే హింసలు భరించలేకపోయాడు. తన తండ్రి మహేందరం సేట్‌వద్ద తీసుకున్న అప్పు తిరిగి రాబట్టుకోడంలో భాగంగా సేటే వెంకటేశ్‌ను ఈ పనికి కుదిర్చాడు. చివరకు డాక్టరు తల్లి చిట్టెమ్మకు తగిన శాస్తిచేసి అంబర్‌పేట నుంచి పరారై కాచిగూడ రైల్వేస్టేషను చేరుకున్నాడు. మహబూబ్‌నగరు వెళ్ళి అక్కడి నుంచి తన ఊరు చేరుకోవడమే అతని ధ్యేయం— 'ఆరా'.

గొడ్లను మేపే పోశయ్య చదువుకోవాలనుకుంటాడు గాని, ఈ కోరిక తీరే మార్గం లేదు. తండ్రి దొరవద్ద తీసుకున్న రెండువందల బాకీ తీరాలంటే దొరగారి పశువులను మేపుకు రాక తప్పదు. ఎవరివో గొడ్లను కడిగి శుభ్రం చేసినందుకు ప్రతిఫలంగా దొరికిన ఇరవై పైసలతో బలపాలు కొనుక్కుంటానని మురిసిపోయాడు. కాని, ఆ పైసలు ఉప్పు కొనడానికి తల్లి తీసుకుంటుంది. "సద్వులు సద్వి రాజ్యాలేలే రాతలు మనకేడివి బిడ్డ ?"—'పొడవని పొద్దు'.

గాడిద కష్టం చేస్తూ వచ్చినా అది ఒక లెక్కలోకి రాకుండా వచ్చిందని బాధ పడే తల్లి, ఆస్తిని కుమారుడికి దక్కించాలన్న తాపత్రయంలో కుమార్తె కోపానికి గురౌతుంది. కాని, చాటుమాటుగా వెనకేసుకున్న డబ్బును కుమార్తెకిచ్చి కన్నతల్లి ప్రేమను చూపుకుంది. "స్వయం సంపాదన" కోసం వడ్డీ వ్యాపారాన్ని ఆశ్రయించింది. "మనుషుల మధ్య సంబంధాల్ని శాసించి నడిపించగల సూత్రాలు డబ్బులోనే ఉంటాయేమో, ప్రధానంగా...." —'నీడల ముడులు'.

జొన్న పోయింది. పొగాకు వచ్చింది. అదీపోయి పత్తి వచ్చింది. ఫ్యాక్టరీలకు ముడిసరుకైన పత్తి వ్యవసాయంలో బాగుపడుదామనుకున్న రైతులు బోర్లాపడ్డారు. ఏజంట్లూ, దళార్లూ లక్షలమీద లక్షలు గడిస్తూంటే రైతులకు అప్పుసప్పులే మిగిలాయి. ఇక్కడి పొలాలమ్ముకుని బళ్ళారి వంటి దూర ప్రాంతాలకు వెళ్ళినవాళ్ళు లాభపడిందేమీ దు. పద్మ ఈ విషవలయంలో చిక్కుకుంది. భర్త నారాయణ భూమిని నమ్ముకున్న మనిషి. అయిదెకరాల్లో వేసిన పత్తిపంట మీద వచ్చిన పైకం బాకీలకు గూడా సరిపోలేదు. ఒంటిమీద ఉన్న బంగారు తెగనమ్ముకోవలసివచ్చింది. "పొలంమీద పెట్టుబడి, దానిమీద వచ్చిన పంటధర- యివన్నీ నేను అనుకొన్నట్టుగా గాక, మరెవరో అనుకొన్నట్టు జరుగుతున్నట్టుంది.... పెద్దకుట్ర జరుగుతోంది పద్మా". ఆ కుట్రకే నారాయణ బలి అయ్యాడు, ఆత్మహత్య చేసుకుని— 'పద్మ'.

తవ్వుతూన్న కాలువలో జారి అడ్డంబడిన లచ్చిని దవాఖానాకు తీసుకుపోయే దిక్కులేదు. పాలమూరు లేబరేగాక, రాయలసీమ ప్రాంతం నుంచీ ఒరిస్సా నుంచీ కూలి పనులకు వచ్చిన లేబరును పశువు కంటే హీనంగా చూస్తున్నారు. కాంట్రాక్టరు ముఖ్యమంత్రికి కావలసిన వాడని ధీమా మొరబెట్టుకుంటే తిట్లూ తాపులూ, టిప్పర్ డ్రైవర్ సురేందర్ ధైర్యం చెప్పాడు. "అసలు మీరు గీ చుట్టు పల్లెలు చూశ్లేదా! ఒక్కొక్క పల్లెల ఎట్ల జరుగుతాంది, ఏం జరుగుతాంది యిన్లేదా". రైతాంగం దొరల ఆటలు కట్టిస్తున్నారు. ఈ వాతావరణంలో నోరూ వాయీ లేని లేబర్ కూడా తన శక్తిని తాను తెలుసుకుంది. కాల్వమీది లేబర్ సంఘం ఏర్పడింది. గుత్తేదార్ల ఇంజనీర్ల దౌర్జన్యాన్నీ దోపిడీని ఎదుర్కోడానికి పూనుకుంది- 'తిరుగుబాటు'.

బొగ్గుబావుల్లో పనిజేసేవాళ్ళకు కుంపటి రాజేసుకోడానికి బొగ్గే కరువైంది. బొగ్గు ఏరుకోడానికి వెళ్ళిన మల్లవ్వను పోలీసులు పట్టుకెళ్ళి ఎక్కడో దూరంగా ఉన్న హైదరాబాదులో కోర్టు ముందు హాజరు పరిచి రిమాండ్‌కు పంపించగలిగారు. "దొంగలు"

కాగజ్‌నగర్ సర్ సిల్కు ఫ్యాక్టరీ మూతబడిపోగా పనివాళ్ళు దిక్కుమాలి పోయారు. భువనగిరి తాలూకాలోని ఒక చిన్న పల్లెకు చెందిన చేనేత కార్మికుడు యాదయ్య నేత బంద్ కాగా ఇరవయ్యేళ్ళ కిందట ఈ ఫ్యాక్టరీ చేరుకున్నాడు. ఇప్పుడిక్కడా రెండేళ్ళుగా పనిలేకుండా వచ్చింది. స్వగ్రామంలో వున్న ఇంటి

జాగాను అమ్ముకుని వద్దామని వెళ్ళినవాడు ఎంతకూరాలేదు. కొడుకు మధునయ్య ప్రతి రైలు బండీ చూస్తాడుగాని తండ్రి రాడు. తీరా వచ్చేసరికి మధునయ్య కనిపించకుండా పోయాడు. "ఇప్పుడు ఒక్క తండ్రి యాదయ్యే కాదు, ప్రభుత్వము మధునయ్య కోసం వెతుకుతున్నది. మురికి వాడల్లో-చప్పిడిదవడల కార్మికుల కళ్ళల్లో-బస్తీల్లో-తుఫాను గాలిలో మ్రోగే కంక పొదల అడుపుల్లో...."-"లాకేటు".

బొగ్గు గని కార్మికుడు నారాయణకు పెళ్ళై ఆరు నెలలయినా భార్యను ఇంటికి తీసుకురాని తండ్రి వీరయ్య మీద కోపం వచ్చింది. తీసుకొచ్చి ఎక్కడ పెట్టి కాపురం చెయ్యాలి? ఉన్నది ఒకే ఒక్క గుడిసె. అరచెయ్యి వెడల్పు జాగా కూడా అదనంగా లేదు. ఇది వీరయ్య సమస్య మాత్రమేకాదు- "గుడిసె గుడిసె భాగోతమే!" అందరూ తలుచుకుని కలిసికట్టుగా కంపెనీ ఖాళీ జాగాలో గుడిసెలు వేసుకున్నాక, నారాయణకు ఒక గుడిసె ఏర్పడింది. సుజాతను తెచ్చుకుని కాపురం పెట్టాడు. కాని ఇదీ మూణ్ణాళ్ళ ముచ్చటే అయింది. కంపెనీ మేనేజిమెంటు కొత్త గుడిసెలు పీకి వేయించింది- 'ఇల్లు'.

బూర్జిగూడ ఏజన్సీ ప్రాంతం గ్రామం. సవర బొంతుకు సీతంపేట బ్యాంకు నుండి అప్పు గురించి నోటీసు వచ్చింది. అలాగే మరికొందరికి కూడా నోటీసులు అందాయి. వాళ్ళంతా కామధేను పథకం కింద ముర్రా గేదెలు సంపాదించి, పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ వారి వేనుకు పాలందించేవారు. రశీదు ముక్కలైతే మిగిలాయి గాని, డబ్బులు మాత్రం బ్యాంకిలో జమ కాలేదు. అప్పు అప్పుగానే ఉండిపోయింది. దాని కోసమే ఈ నోటీసులు. గిరిజనులు కోర్టుల పాలయ్యారు. నలభై పంటల కింద "పచ్చటి అడివితోటి, కొండపోడుల్తోటి, పల్లపు భూఁవుల్తోటి కొండరాజుల్నాగ" బతికిన సవరలు, ఇప్పటికి "మాఁవు యేటయిపోతన్నాఁవో కానుకుండీ సరికి కంబారోలిమయిపోనాము"- 'అరణ్యపర్వం'

చింతపండు రుచికోసం మొగం వాచివున్న పిట్టచాడు మాలపేట మనుషులు గాటీలు దాటి చింతమాను గూడదాకా వెళ్ళి, గిరిజన కార్పొరేషన్ వాళ్ళకు అమ్మ డానికి చింతపండు తెచ్చే సవర్ల వద్దనుంచి కొని కావిళ్ళతో తట్టలతో ఇళ్ళకు తెచ్చు కోవడంలో కార్పొరేషన్ అధికార్లు దాడి చేసి బండ బూతులు తిట్టి, అదిచాలక కొట్టు తారు. దీనితో రెచ్చిపోయిన సంగడూ తతిమావాళ్ళూ కావిడి బద్దలు తిరగేస్తారు.

"కర్రట్టుకుంటే పులుసు దొరికినాది, మరి కత్తిగాదు. అడవిలోని అన్నల్లా తుపాకొట్టుకుంటేనే రాజ్యం దొరుకుతాది," అంటాడు సంగడు. 'విప్లవం వర్ధిల్లాలి!' నినాదం అందుకుంటారందరూ.

గోండులూ కొలాములూ 'సాధు' జీవులు. జంగ్లాతువాళ్ళ షావుకార్లూ సాగించే జులుమునూ దోపిడీని ఎదిరించలేరు. పోగాకు లచ్చయ్య చేసే హితబోధ వింటారే తప్ప షావుకారు జగ్గయ్య చేసే అన్యాయాలకు ఎదురుతిరగరు. ఇలా కాదని, లచ్చయ్య తానే వెళ్ళి జగ్గయ్యను దబాయిస్తాడు. మాస్కు ఎడ్లను విడిపించుకొస్తాడు. ఇలా 'పోరకలసార్' అయ్యాగు. భీముదేవరంత బలం గలవాడనీ, పులిమీద వస్తాడనీ గిరిజనులు లచ్చయ్య అండ జేరుతారు. వాంకిడి వగైరా ఊళ్ళ షావుకార్లను గడగడలాడించి షావుకార్లు గుంజుకున్న వెండి, బంగారం, పశువులు, భూములు మళ్ళీ చేజిక్కించుకుంటారు. "ఒక్క నిప్పురవ్వ రగిలింది. అది ఆదిలాబాదు అడవులు చుట్టేసి దావానలమయ్యింది-" 'మలుపు'.

మడావి జంగూకు చెందిన ఐదెకరాల భూమిని మాధవరావు కబ్జా చేసుకుని జంగును తరిమివేశాడు. తాసీల్దారూ కలెక్టరూ తన భూమిని తిరిగి తనకు ఇప్పిస్తారని జంగు ఆశలు పెట్టుకుంటాడు. ఉట్నూరు డిప్టీ కలెక్టరు తనకనుకూలంగా తీర్పు చెప్పినా మాధవరావు భూమిని విడిచి పెట్టడు. జడ్జిమెంటు కాగితాన్ని చింపివేస్తాడు. కోపం వచ్చి మాధవరావు మీదికి దూకిన జంగూను మాధవరావు మనుషులు కర్రలతో చితకగొట్టుతారు. అప్పుడుగానీ తెలిసిరాలేదు జంగూకు 'అన్నల'తో చెప్పుకుంటే పంచాయతి చేసి తన భూమి తనకిప్పించి ఉందురు. "అన్నలు పోయినంక అవన్నీ మళ్ళీ గుంజుకోరా, గీసంగతంత పోలీసోల్లకు ఎర్క లేదనుకున్నావా ? అన్నలు ఎప్పటోకి మన గూడెం లుండరుగదా ? అళ్ళ అటు పోంగనే పోలీసోల్లు ఇటు దంచుతారు. ముల్లుతోని ముల్లు దీస్కోవాలె. మనకెందుకు గకిరికిరిలన్ని ?" అని అనేవాడు. ఇప్పుడు తెలిసి వచ్చింది. ఆకుపచ్చ బట్టలేసుకుని వచ్చిన మనుషులలో ఒకరు, జంగూ ఒంటిమీది దెబ్బలు చూసి బ్యాగులోనుండి బ్యాండేజీ తీసి గాయాలు స్పిరిట్ తో తుడిచి కట్టుకట్టి ఇంజెక్షన్ చేయగా, "జంగుదాదా నీ జమీన్ ఎటూపోదు" అని మరొకరు ధైర్యం చెప్పారు-'అన్నలొచ్చిన్రు'.

ఉప్పు చింతపండూ పశువులూ పాకలూ బిడ్డలూ పాపలూ బొగ్గూ కట్టెలూ పొలమూ పుట్రా అప్పులూ నప్పులూ-ఇదంతా కూడా జీవితమే. వీని తాలూకు

నేలతల్లి విముక్తి కోసం

సామాజిక చరిత్ర - కథ

—ఉజ్వల

భారతదేశ రాజకీయాల్లో సాయుధ పోరాటాన్ని ఎజెండా మీదకు తెచ్చినదీ నక్సల్బరీ పోరాటమయితే ప్రజా సంఘాల నిర్మాణం, పాక్షిక పోరాటాల నిర్వహణకు స్థానం కల్పించి విప్లవోద్యమాన్ని సెట్‌బ్యాక్ (వెనుకంజ) నుండి ముందుకు నడిపించినదీ, యావత్ భారతం దృష్టిని తన వైపు సారించేట్లు చేసినదీ అయిన పోరాటం ఉత్తర తెలంగాణాది. ముఖ్యంగా పీపుల్స్‌వార్‌కు ప్రజాపునాది నేర్పరచిన 'జగిత్యాల జైత్రయాత్ర' దనటం అతిశయోక్తి కాదేమో!

విప్లవోద్యమంలో వచ్చిన యీ పరిణామం ఫలితంగా సాహితీరంగంలో విరసం (1970), విద్యార్థి (1975), యువజన (1978) సంఘాలు వెలిశాయి. వీటి

కఠోరమైన వాస్తవాన్ని శకలాలు శకలాలుగా సాహిత్యంలో ప్రతిఫలనం పొందించిన ఈ కథలకు పాటి మట్టి వాసన ఉంది. వ్యవసాయమూ కుటీర పరిశ్రమలూ చేతి వృత్తులూ కలగలిసి ఉండిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎన్నడనగానో ఛిన్నాభిన్నమైంది. దాని స్థానంలో రావలసిన మరో వ్యవస్థ పాతదానితో రాజీ పడిన ఫలితంగా భూస్వామ్యం ఇంకా చావాటి పీనుగులా వాకిటికి అడ్డంగా పడివుంది. కొత్త సామాజిక శక్తులు పల్లెపట్టులోకి విస్తరిస్తున్నాయి. ఫలితంగా, బతుకు అస్తవ్యస్తమౌతూంది. బీభత్సానికి పర్యాయపదమౌతూంది. ఇది రాత్రీ కాదు, పగలూ కాదు- వేకువ. దీన్ని అనేక కోణాలనుంచి చిత్రించిన ఈ కథలు కళాప్రమాణాల దృష్ట్యా అన్నీ ఒకే స్థాయికి చెందినవి కావు. ఉత్తుంగ శృంగాలు కనిపించవేమోగాని ఇది ఉన్నతమైన పీఠభూమి అనిపిస్తుంది.

భూమిక (కథా సంకలనం)

సాదా ప్రతి : 17 రూపాయలు

లైబ్రరీ ఎడిషన్ : 25 రూపాయలు

ప్రతులకు : బండారి కిష్టయ్య బుక్‌స్టాల్
శివాజి నగర్

గోదావరిఖని-505 209

కొనసాగింపులో 1981వ సంవత్సరంలో రైతు కూలీ సంఘం ఏర్పడింది. ఇదంతా 80ల వరకు ఆంధ్ర రాజకీయ పటం మీద మార్పులు సూచిస్తుండగా 80ల తర్వాత చిత్రం భారతదేశ రాజకీయ పటాన్నే ప్రభావితం చేసినది. గోదావరి దాటిన విప్లవోద్యమం ప్రాణహిత, ప్రాణహిత నుండి ఇంద్రావతి వరకు వ్యాపించిన కాలం అది. అందుకే ప్రాణహిత, ఇంద్రావతిలలో పరిణామాలను స్పృశించాలనుకున్న వారికి గోదావరి చెప్పిన గాథలు తెలుసుకోవడం అవసరమనిపించడం సహజమని భావించిన 'ప్రభాత్ ప్రచురణకర్తలు' తెలుగులో వెలువడిన 'నేలతల్లి విముక్తికోసం' కథల సంపుటి నుండీ 'అరుణతార', 'సృజన'ల నుండి మొత్తం 25 కథలను ఎంపిక చేసి హిందీ పాఠకులకు పుస్తక రూపంలో అందించారు. అదే 'జమీన్ బంధన్ ముక్తి కేలియే'.

అది సెప్టెంబర్ 7, 1978. భారత కమ్యూనిస్టు పార్టీ (మా-లె) (ఇప్పటి పీపుల్స్‌వార్) ఆధ్వర్యంలో బ్రహ్మాండమైన రైతుకూలీ ప్రదర్శన. అదే జగిత్యాల జైత్రయాత్ర. ఇరవయిరెండు గ్రామాల్లోని భూస్వాముల ఆక్రమణలో వున్న సుమారు ఏడువందల ఎకరాల బంజరు, పోరంబోకు భూమిని పేద రైతులు, వ్యవసాయ కూలీలు దున్నుకున్నదీ, సుమారు 40 గ్రామాల్లోని వ్యవసాయ కూలీలు, జీతగాళ్ళు పోరాడి కూలిరేట్లు పెంచుకున్నదీ అయిన చరిత్ర ఆనాడు కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల తాలూకాది. తెలంగాణా గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాములు పంచాయితీల పేరుతో జరిమానాలు, దండుగలు, ధరావతుల పేరుతో పేద రైతుల నుండి విపరీతంగా డబ్బు గుంజడం మామూలయిపోయింది. ఇలా సంవత్సరాలుగా గుంజిన వేలాది రూపాయలను కక్కిస్తున్నటువంటి ఆ రైతాంగం యొక్క చైతన్యం సుమారు 150 గ్రామాల రైతాంగాన్ని కదిలించింది, ప్రేరణనిచ్చింది. కొద్ది గ్రామాలకు పరిమితమైన 'సంఘ' నిర్మాణం జిల్లాకంతటికీ వ్యాపించడానికి మలుపు రాయి ఆ ప్రదర్శన. అలాంటి నేపథ్యాన్ని చిత్రీకరించే వాస్తవగాథే సంపుటిలోని మొదటి కథ 'సంఘం'.

అది 1978. ఆంధ్రలో విప్లవోద్యమం 'ప్రజాపునాది'కి ఆరాటపడుతున్న కాలం. సాయుధ పోరాటం తాత్కాలికంగా విరమింపబడిన కాలం. విద్యార్థి, యువజనులను నూతన ప్రజాస్వామిక విప్లవ ప్రచారం కొరకు, గ్రామీణ ప్రజానీకంతో మమేకం కావడానికి 'గ్రామాలకు తరలండి' అని పిలుపు ఇచ్చిన కాలం. అది ఒక

కొత్త వరవడికి నాంది పలికిన చరిత్ర. ఆనాటినుండి ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో తీవ్ర నిర్బంధం నడుమ విద్యార్థి-యువజనులు క్యాంపెయిన్ కార్యక్రమం కొనసాగిస్తూనే ఉన్నారు. ఇలా 1978లో 'గ్రామాలకు తరలిన' దళాల్లోని ఒక దళం యొక్క మొదటి అనుభవమే లక్ష్మి రాసిన 'గమ్యం చేరేదాకా పరుగు పందెం' కథ.

అలాగే ఈ కథా సంపుటంలోని 'కుంపటి' కథ రైతాంగంలో పెరుగుతున్న పోరాట చైతన్యం, భూస్వాముల దాష్టీకం యొక్క నగ్నచిత్రం. మెట్‌పల్లి కరీంనగర్ జిల్లాలోని మరో తాలూకా. ఆ తాలూకాలోని చినమెట్టుపల్లి భూస్వామి మిరియాల జగన్మోహనరావు. 1958 నాటికి కేవలం 35 ఎకరాల ఆసామి. 1978 నాటికి అంటే ఇరవయ్యేళ్ళలో 150 ఎకరాలకు పైగా పట్టాదారుడయ్యాడు. వీడి అధికారం చుట్టుప్రక్కల ఏడెనిమిది గ్రామాలకు వ్యాపించి వుండింది. అమాయక రైతుకూలీల నెందరినో తన గడీముందు బంధించి చితకబాదడం, గుండాలచే తన్నించడం, ఆస్తులు లూటీ చేసి వారి ఇళ్ళను తగులబెట్టించడం లాంటి అమానుష కృత్యాలెన్నో చేశాడు కాంగ్రెసు పార్టీ జిల్లా సెక్రటరీ పదవితో సహా అనేక హోదాల్లో రాజకీయాధికారం చేజిక్కించుకొని తాలూకాలోని రైతాంగాన్ని పీడించుకతిన్నాడు. జగిత్యాల రైతుకూలీ ప్రదర్శనతో బెంబేలెత్తిన జిల్లా భూస్వామ్య వర్గానికి మొనగాడుగా రైతాంగానికి ఎదురు నిలిచాడు. సంఘం నిర్మించుకుందామని సమావేశమయిన స్వగ్రామంలోని రైతాంగంపై 1978, సెప్టెంబరు 14న గుండాలచే దాడి చేయించాడు. తెల్లారి పది గ్రామాలనుండి సుమారు 12 వందల మంది ప్రజలు క్షమాపణ డిమాండ్ చేస్తూ వీడి గడీ ముందుకు ఊరేగింపుగా రాగా గడీలోనుండి విచక్షణారహితంగా కాల్పులు సాగించి 19 మంది రైతులను గాయపర్చాడు. దుర్మార్గుడు, ప్రజాకంటకుడు అయిన ఈ భూస్వామి ఆ తర్వాత రైతాంగం చేతిలో కుక్కచావు చచ్చాడు.

అత్యవసర పరిస్థితి తొలగిపోవడంతో బహిరంగంగా ప్రజలు కదులుతున్న కాలం. తెలంగాణాలో దసరాపండుగనాడు బతుకమ్మ పండుగ జరుపుకుంటారు. తిమ్మాపురం (కరీంనగర్ జిల్లా, తిమ్మాపూరు తాలూకా) గ్రామంలో దసరా పండుగ నాడు గ్రామస్థులంతా దొరగడీ ముందే బతుకమ్మ ఆట ఆడాలని దొర చాటింపు వేయిస్తాడు. అది భూస్వామి సాంఘిక పెత్తనానికీ, అధికార దాహానికీ నిదర్శనం. ఆ రోజు గ్రామస్తులు దొరకు కంకణం కడతారు. తదుపరి దొర జమ్మి తెస్తాడు. జమ్మి కోయడం హరిజనులకు నిషేధం. వారు కన్నెత్తయినా జమ్మిచెట్టును చూడ

కూడదు. ఈసారి తిమ్మాపూర్ గ్రామ ప్రజలు ఈ దుస్సాంప్రదాయానికి స్వస్తి పలకా లని నిర్ణయించుకున్నారు. తమ వాకిళ్ళముందే బ్రతుకమ్మ వేడుక జరుపుకున్నారు. ఆ గ్రామంతో సహా చుట్టుప్రక్కల 20 గ్రామాలకు తిరుగులేని రైతాంగ నాయకుడు కా॥ లక్ష్మీరాజం ఆ రోజు ప్రజలంతా సాంప్రదాయకంగా దొరకు కట్టాల్సిన కంక ణాన్ని తమ ప్రియతమ నాయకుడికి కట్టారు. దీనితో దొరలు సృష్టించిన కట్టుబాట్లకే కాదు దొరపెత్తనానికి కూడా ముప్పు ఏర్పడిందని గ్రహించిన మనోహర్రావు రెచ్చి పోయాడు. 1977 నవంబర్ 6వ తేదీన దారికాచి గొడ్డళ్ళు కత్తులతో లక్ష్మీరాజంపై దాడి చేయించి హత్య గావించాడు. ఈ యదార్థ ఘటనకిచ్చిన కథారూపమే "ఎత్తిన పిడికిళ్ళు".

గ్రామాలలో కుటుంబ సంబంధాలపై ఉద్యమ ప్రభావం, యువతరం ఉద్య మంలో క్రియాశీలకంగా పాల్గొనడం, వెనుకటి తరంలో వస్తున్న మార్పు, భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో రైతుకూలీ మహిళల ముందంజ.... రెండవవైపు వేలాది రైతులపై బూటకపు కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పడం, విచారణ లేకుండా జైళ్ళలో మగ్గబెట్టడం మొదలైంది. ఈ నేపథ్యంలో భూస్వాములను శిక్షించడం కొరకు, అలాగే కేసులకయ్యే ఖర్చు మూలంగా ప్రజలకు కలిగే ఆర్థిక భారాన్ని తగ్గించుకోడానికి భూస్వాములపై 'జరిమానాలు' విధించే పోరాటరూపం ముందుకు వచ్చింది. దాని ప్రతిబింబమే మనకు 'మార్పు', 'జరిమానా' కథల్లో కనిపిస్తుంది.

1981, ఏప్రిల్ 18న గిరిజన రైతుకూలీ మహాసభ కొరకు తమ తమ గూడేల నుండి గుంపులు గుంపులుగా గిరిజన రైతుకూలీలు ఇంద్రవెల్లి సభకు చేరు కుంటున్న సమయం. అప్పటి అంజయ్య హయాంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సభను జరగనివ్వకుండా చేయడానికి నిషేధాజ్ఞలు జారీ చేసింది. మీటింగుకు తరలివస్తున్న వందలాది గోండు ఆదివాసీలను నిర్బంధించింది. అయినా తరంగాలవలె ముందుకు తోసుకొస్తున్న వారిపై విచ్చలవిడిగా కాల్పులు జరిపి 60 మంది అమాయక ఆదివాసీ గిరిజనులను పొట్టనపెట్టుకుంది. "రేపటి ఉజ్వల భవిష్యత్ కోసం అడవి నేడు తగల బడుతోంది, తిరగ బడుతోంది " అంటూ చిత్రింపబడిన 'ఇంద్రవెల్లి' ఘటన గోండు గిరిజన రైతాంగంయొక్క అడుగుల సవ్వడిపై కలవరపడుతున్న ప్రభుత్వ నిర్బంధా నికి దర్పణం 'ఇంద్రవెల్లి' కథ.

ఆ తర్వాత ఆంధ్రరాష్ట్రంలో కాంగ్రెసు పోయి తెలుగుదేశం పార్టీ అధికార పీఠాన్ని అలంకరించింది. అది నిర్బంధం ఫాసిస్టు పోకడలను సంతరించుకున్న కాలం. సభలపై నిషేధం, అక్రమ అరెస్టులు, బూటకపు ఎదురు కాల్పులు, గ్రామాల పై పోలీసు ముష్కరుల మూకుమ్మడి దాడులు, రైతాంగ కార్యకర్తల ఇళ్ళను కూలగొట్టడం లాంటివి ఉధృతంగా సాగుతున్న దశ. ఇదేసమయంలో భూస్వాములను గుండాలు, పోలీసులు అమరవీరుల స్థూపాల్ని కూలగొట్టి నేలమట్టం చేయడం ప్రారంభించారు. అందులో భాగంగానే కుక్కలగూడూరు గ్రామంలో రైతాంగాన్ని అర్గనైజ్ చేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన కా॥ కుమారస్వామి స్మారక స్థూపాన్ని కూలగొట్టిన పోలీసులు గ్రామంలో భీభత్సాన్ని సృష్టించారు. ఈ నిర్బంధానికి ప్రజలు భయపడలేదు. "కాల్చినా.... కూల్చినా" గాని పోరాటాన్ని విడవమని ప్రతిజ్ఞ చేసుకున్నారు.

సింగిరేణి కార్మికుల జీవనం కూడ బొగ్గులాగే అంధకారమయంగా ఉంటుంది. బొగ్గు బావుల్లో కనీస సౌకర్యాలు, పనిముట్లు లేకుండానే వారు పని చేయాల్సి ఉంటుంది. అదేమని అడిగితే మస్టరు పడదు. అటువంటి దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్న కార్మికులు కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఉప్పొంగిన భూమి పోరులో ఉత్తేజితులై పోరాడితే తప్ప తమ హక్కులు సాధించుకోలేమని గ్రహించారు. ఫలితంగా 1981లో సింగరేణి కార్మిక సమాఖ్య నేర్పరచుకొని కోతచట్టం రద్దు చేయాలనే కోర్కెతో 60 రోజులు సమ్మెచేసి రాష్ట్ర ప్రభుత్వం గుండెల్లో రైళ్ళు పరిగెత్తించారు. ఆనాటి ఆ సమ్మెను వ్యతిరేకించిన తొత్తు ట్రేడ్ యూనియన్లు ఈనాడు శ్రామికుల్లో పడిపోతున్న తమ పలుకుబడిని నిలబెట్టుకోవడానికి అదే కోత చట్టం రద్దు చేయాలనే డిమాండుతో సమ్మెకు పిలుపిచ్చారు. సమ్మెకైతే పిలుపిచ్చారు గాని మునుపటిలా తామనుకున్నప్పుడు ఆపటం సాధ్యం కావటంలేదు. 'కొత్తఎత్తు' కథలో రివిజనిస్టు కార్మిక సంఘాలు తమ స్వప్రయోజనాలను కాపాడుకోవటం కోసం ఎంత నిర్లజ్జగా పాకులాడతారో నగ్నంగా ఎండకట్టారు రచయిత. దానితో పాటు గానే శ్రామికుల పోరాట పటిమను, పోరాట సంకల్పాన్ని చక్కగా చిత్రించారు.

"కర్రలేకపోతే గొర్రైనా కరుస్తుందన్నట్లుగానే నిరాయుధులైన విప్లవ కార్యకర్తలను, సాధారణ పౌరులను పట్టుకపోయి బూటకపు ఎదురుకాల్పుల పేరిట అమానుషంగా కాల్చివేస్తున్న పోలీసులు, కార్యకర్తల చేతిలో నిజంగా ఆయుధం

ఉంటే ఎంత పిరికిపందలుగా వ్యవహరిస్తారో వారి అప్పటి ఆచరణకు అద్దంపట్టిన కథ "మేకపోతు గాంభీర్యం".

నిర్బంధం మోతాదు ఎంత ఎక్కువగాపున్నా ప్రజలతో సంబంధం కోల్పోకూడదన్నది, వారిని నిరంతరం పోరాటోన్ముఖులను చేయాలన్నదే విప్లవోద్యమ ఆకాంక్ష. దీన్ని ఆసరాచేసుకున్న పోలీసులు హరిజనవాడలు, గూడేలపై దాడులు ముమ్మరం చేయటమే కాదు, పోలీసు క్యాంపులు పెట్టి నిత్యం అరెస్టులు, దాడులు చేస్తున్నారు. ఉద్యమానికి వెన్నుపోటు పొడిచే ఇన్‌ఫార్మర్స్ పోలీసు యంత్రాంగానికి అండగా ఉంటారని, వీరిని చైతన్యవంతంగా గుర్తించి ఆ 'కలుపుమొక్క' లను ఏరిపారేసి పంటను కాపాడుకోవాల్సిన బాధ్యత సంఘం బాధ్యులదేనన్న స్ఫూర్తి 'కలుపుమొక్క' లో కనిపిస్తుంది.

ఉద్యమ అభివృద్ధిని చూసి కలవరపడి నిర్బంధం ఫాసిస్టు పోకడలను సంతరించుకుంది. శ్రీకాకుళ పోరాటకాలం నుండి "బూటకపు ఎదురుకాల్పుల" తతంగం కొనసాగుతూంది. లాకప్ హత్యలూ, శవాలను విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు వ్రేలాడదీయటం, మిస్సింగులు, కోర్టుల్లోనుంచి మాయం చేయటం, కోర్టు ఆవరణ ల్లోనే కాల్చి చంపడం, నగరపు నడిరోడ్డులో సైకిల్‌పై వెళుతున్న వారిని వేటాడి చంప ప్రయత్నించటం, ఇండ్లల్లో నిద్రిస్తున్నవారిని కాల్చి చంపడం- ఇలా ఎన్నో క్రూర నిర్బంధ రూపాలు అమలులో కొచ్చాయి. నేటికీ అవలు జరుగుతున్నాయి.

విప్లవకారులు ప్రజల శ్రేయస్సుకోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. తాము చిందించిన రుధిరతైలంతో దీపాలు వెలిగించి విప్లవానికి బాటను చూపుతున్నారు. ప్రజలకోసం ప్రాణాలిస్తున్న, వారికోసం పాటుపడుతున్న తమ బిడ్డలంటే విప్లవకారులను కన్న తల్లిదండ్రులకు ఎనలేని గర్వం. ఒక దశలో తమ బిడ్డలు తమని విడిచి వెళ్ళటాన్ని వ్యతిరేకించిన తల్లిదండ్రులు తరువాయి కాలంలో వారు ఎక్కడవున్నా క్షేమంగా ఉండాలని పదే పదే కోరుకుంటారు. అలాగే వారు విప్లవ విద్రోహులు కాకూడదని కూడా కోరుకుంటారు. అలాంటి తమ బిడ్డలనుండి ఏ చిన్న సందేశం వచ్చినా విపరీతంగా సంతోషపడిపోతారు. వారిది అవధుల్లేని ఆనందం.

కా. రమణారెడ్డిని కోరాపుట్ (ఒరిస్సా) నుండి విశాఖపట్నం కోర్టులో హాజరు పర్చడానికి (కా. పున్నంచందర్‌తో బాటు) తీసుకువెళుతూ దారిలో కాల్చి

వేస్తారు. 'ఒక తండ్రి కథ'లోని ఇతివృత్తం ఇదే. స్పందించటం తెలియనివారికి హృదయ స్పందన కలిగించే కథ. ఆఖరి కొడుకంటే ఆ తండ్రికి అమితమైన ప్రేమ. ఎందుకంటే స్వార్థాన్ని విడిచి ప్రజలకోసం పోరుబాటలో నడుస్తున్నాడు. అతను అరెస్టయి జైల్లో ఉన్నాడు. తండ్రిని చూడాలని రమ్మని ఉత్తరం రాశాడు. అతని ఉత్తరం అందుకున్నప్పటినుండీ ఆ తండ్రి అనుభూతులతో మమేకమైన పాఠకుడు ప్రయాణపు ముందు అతని బావమరిది పట్టణం నుండి వచ్చి ఆ తండ్రిని ఇంటికి దూరంగా ఏకాంత ప్రదేశానికి తీసుకుపోతున్నప్పుడు ఎక్కడ ఎన్‌కౌంటర్ మరణం వార్త చెపుతాడో అని కలతపడతాడు. అటువంటి వార్త కాకూడదని కోరు కుంటాడు. కథా రచయిత గోపి ఆ తండ్రి మనోభావాలకు అక్షరరూపం ఇవ్వడంలో విజయం సాధించాడు.

ఈ కథా సంకలనంలోని 'సన్న జీవాల కథ' కూడా ఇంచుమించు ఇలాంటిదే. నిరుపేద తల్లిదండ్రుల ఏకైక సంతానం సత్యం. చదువులో చురుకైనవాడు. బుద్ధి మంతుడు. ఒకరోజు ఇంటినుండి వెళ్ళిపోతాడు. అలా ఇల్లు విడిచిన కొడుకు గురించి రెండేళ్ళ తర్వాత జైల్లో ఉన్నట్లు కబురందుతుంది. ఏదోరకంగా చేసి డబ్బుకూడ బెట్టి కొడుకును బెయిలు మీద విడిపించుకొని ఇంటికి తీసుకెళ్ళ బోతున్నప్పుడు జైలు ఆవరణలోనే, తల్లిదండ్రులు చూస్తుండగానే పట్టపగలు సాదాదుస్తుల్లో ఉన్న పోలీసు గద్దలు తన్నుకుపోయాయి. కథ చదువుతున్నప్పుడు ఘటన మన కళ్ళ ముందే జరుగుతున్నట్లనిపించి సత్యంని కాపాడుకోవటానికి విలవిల్లాడుతుంది హృదయం.

ఇటు గోదావరి దాటిన విప్లవోద్యమం విశాల దండకారణ్యంలో అడుగిడింది. గెరిల్లా దళాలు ఆదివాసీల అభిమానాన్ని చూరగొని వారి మనసుల్లో స్థానాన్ని సంపా దించాయి. తునికాకు కూలీరేట్ల పెంపుదలకూ, వెదురు కూలీరేట్ల పెంపుదలకూ పోరాటం చేసి విజయం సాధించిన ఆదివాసీ రైతులు, రైతుకూలీలు సంఘటితపడి 1989 లో దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన్‌ను స్థాపించుకున్నారు. ఆ విధంగా ఏర్పడ్డ డి ఎకె ఎమ్ ఎస్ నేతృత్వంలో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక దోపిడి - పీడనలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు జరిగి విజయం సాధించాయి. ఊహూరా గ్రామరక్షణ దళాలు, మహిళా సంఘాలు, బాలల సంఘాల నేర్పరచు

కుంటూ వారంతా పోరాటపథంలో సంఘటిత పడుతున్నారు. అలా ఏర్పడిన ఒక గ్రామ రక్షక దళం యొక్క సాహసిక ప్రదర్శనే "గ్రామ రక్షక దళం" కథ. ఇదే సంపుటిలోని "బందూకులు ఆకును తెంపలేవు", "జనసేన" మొదలైన కథలు ఆదివాసీల పోరాట చైతన్యానికీ, సమయస్ఫూర్తికీ ప్రతీకలుగా చెప్పుకోవచ్చు.

సెమీ ఫారెస్టుగా వున్న నిజామాబాద్-ఆదిలాబాద్ ప్రాంతాలు మొదలుకొని బస్తర్ ప్రాంతం వరకు సాగే కూలి పోరాటాల్లో ఒకటి తునికాకు కూలీల పోరాటం. దీనిమీద ఆంధ్ర, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలకు ఆదాయమే కాక, ఎందరో కాంట్రాక్టర్లు లక్షలు ఆర్జిస్తున్నారు. కాని ఆదివాసీల జీవనం మాత్రం చేతికీ నోటికీ మూరెడు దూరంగానే ఉన్నాయి. విప్లవోద్యమపు అలల తాకిడి ఆ ప్రాంతానికి తాకక ముందు 100 ఆకుల కట్టకి 3, 4 పైసలుగా ఉన్న కూలిరేటు నేడు కొన్ని ప్రాంతాల్లో 55 పైసల వరకు పెరిగిందంటే విప్లవ పార్టీ ప్రయోజనం, ప్రభావం ఎలాంటివో సుస్పష్టమే. అందుకే ప్రభుత్వానికి ముఖ్యంగా కాంట్రాక్టర్లకి విప్లవ కార్యకర్తలు కంటిలో నలుసులయ్యారు. ఈ పోరాటాలు సాగుతున్న కాలంలో కార్యకర్తలకి అనేక అగ్నిపరీక్ష. కా. పులి మధునయ్య లాంటి కామ్రేడ్ (ఆదిలాబాద్) రక్తాన్ని తునికాకు కళ్ళాల్లో పారించిన దుర్మార్గపు చరిత్ర కంట్రాక్టర్లది. మొదటి దశలో కంట్రాక్టర్ల గుండాయిజం చెలామణి అయినా కాలక్రమంలో అది పారలేదు. పర్యవసానంగా ప్రభుత్వమే ఆకు తెంపించడానికి ముందుకు వచ్చింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం అయితే ఐ. ఎ. ఎస్, ఐ. పి. ఎస్. అధికారుల ఆధ్వర్యంలో ఆకు తెంపించాలని ప్రయత్నించింది. పరాజితగా మిగిలింది. ఆకు తెగలేదు సరికదా అధికారుల మధ్యగల అవగాహనలోని భేదాలు, వైరుధ్యాలు బయటకు వచ్చాయి. తుపాకీ బలంతో ఆకును తెంపించగలమని ఐ. పి. ఎస్. అధికారులు, తూటాలు ప్రాణాలను తీస్తాయేగాని ఆకును తెంపలేవని ఐ. ఎ. ఎస్. అధికారులు వాదోపవాదాలు చేసుకుంటూనే ప్రభుత్వ సేవలో ఒదిగి పోతున్నారు. వీరిమధ్య వైరుధ్యాలకు, ప్రజల పోరాట దీక్షకు అద్దం పట్టిన కథ 'బందూకులు ఆకును తెంపలేవు'.

ఈ సంపుటిలోని 'నరబలి' కథ భిన్నమైనది. ఆదివాసీల్లో మూఢ నమ్మకాలు హెచ్చు. వారిది వెనుకబడ్డ ఆర్థికం. అందువల్ల సామాజిక అవగాహన కూడా వెనుకబడే వుంది. గెరిల్లా జోన్ పరస్పెక్టివ్‌తో దండకారణ్య వ్యాప్తంగా గిరిజనులను విప్ల

చర్చ

'రేపటి సామ్యవాదం' - ఒక ప్రతిస్పందన

ఆర్. ఎస్. రావు

మనోరంజన్ మొహంతీ వ్యాసం (రేపటి సామ్యవాదం, సృజన, సెప్టెంబర్ 1991) సోషలిస్టు ఆచరణను అంచనా వేయడానికి స్వేచ్ఛను, కచ్చితంగ చెప్పాలంటే వ్యక్తి స్వేచ్ఛను ప్రధాన ఆధారంగా పరిగణిస్తుంది. ఆ వ్యాసం మొత్తంలో స్వేచ్ఛ కాస్త స్వేచ్ఛగానే విహరించింది. శాస్త్రీయ సోషలిజం అనే భావన రూపొందినప్పటినుంచీ, దానిపైన విమర్శ ఈ వ్యక్తి స్వేచ్ఛ అనే భావం చుట్టూనే తిరుగుతున్నది. పెట్టుబడిదారీ విధానానికీ సోషలిజానికీ మధ్య ఉన్న వైరుధ్యం సోషలిజానికి అనుకూలంగా పరిష్కారమయ్యే వరకూ ఇది చర్చనీయాంశంగా పునరావృతమవుతూనే ఉంటుందనుకుంటాను. ఈ పరిష్కారం భౌతిక పునాదిలోనూ, ఉపరితలంలోనూ కూడ జరగవలసి ఉంటుంది. ఈలోగా సోషలిస్టు ఆచరణ పరిష్కారం కోసం కొన్ని సమస్యలను లేవనెత్తుతుంది, కొత్త సమస్యలను ముందుకు తెస్తుంది. అంటే మరిన్ని పోరాటాలు జరుగుతాయి. సోషలిస్టు నిర్మాణం ఎలా ఉంటుందో

వోద్యమంలోకి ఆర్గనైజ్ చేస్తున్న విప్లవపార్టీ వారి అలవాట్లు, కట్టుబాట్లలోని మూఢ విశ్వాసాలను తొలగించే కృషి ప్రారంభించింది. అలాంటి ఒకానొక ప్రయత్నం కథారూపమే 'నరబలి' కథ.

ఒక్కమాటలో చెప్పాలంటే ఈ సంపుటిలోని కథలన్నీ పోరాట కథలు.

ఈ కథల్లో దున్నేవానికే భూమి ఆధారంగా సాగే వ్యవసాయక విప్లవం యిరుసుగా గల నూతన ప్రజాస్వామిక విప్లవంలోని ఆటుపోటులు, విప్లవోద్యమపు అభివృద్ధి-పెరుగుదలా, ముందంజ-వెనుకంజ, ప్రజల గుండెల చప్పుళ్ళ-పూసల్లో దారంలా దాగి వున్నాయి. వీటిల్లో నేలతల్లిని విముక్తం చేయడానికి పిడికిలెత్తిన పీడిత ప్రజానీకం యొక్క దృఢ ప్రతిజ్ఞ ధ్వనిస్తుంది. ఈ కథలకీ-విప్లవోద్యమానికీ అవినాభావ సంబంధమున్నది. విడదీయరాని లంకె ఉన్నది. వీటన్నిటినీ ఒక వరుస క్రమంలో చేర్చి తెలుగులో అచ్చువేసిన విరసం (నెల్లూరు జిల్లా యూనిట్) హిందీలో ప్రచురించిన ప్రభాత్ ప్రకాశకులు అభినందనీయులు.

పారిస్ కమ్యూన్ మొట్టమొదటి ఉదాహరణగా చూపింది. తర్వాతి అనుభవం జవాబు చెప్పవలసిన కొన్ని ప్రశ్నలను వదిలింది. విస్తరించబడిన పారిస్ కమ్యూన్ అక్టోబర్ విప్లవం నుంచి సాంస్కృతిక విప్లవం దాకా సాగింది. ఈ అనుభవం పారిస్ కమ్యూన్ వేసిన ప్రశ్నలలో కొన్నిటికి జవాబు చెప్పింది. మళ్ళీ కొత్తగా కొన్ని ప్రశ్నలు వేసింది. ఈ జవాబు దొరకని ప్రశ్నలను చర్చకోసం ముందుకు తెస్తే సోషలిస్టు ఆచరణ గురించిన చర్చ ఫలప్రదమవుతుంది. సోషలిజం దశ పోరాట దశ. అది ఒక దీర్ఘకాలిక క్రమం. ఇక్కడ మార్క్స్‌ను ఉటంకించడం ఉపయోగకరంగా ఉంటుంది. బూర్జువా విప్లవాలను శ్రామికవర్గ విప్లవాలతో పోలుస్తూ ఆయనేమన్నాడంటే 'పందొమ్మిదో శతాబ్దంలో జరిగినటువంటి శ్రామికవర్గ విప్లవాలు తమను తాము ఎల్లప్పుడూ విమర్శించుకుంటాయి. వాటి మార్గంలో అప్పుడప్పుడు తమను తాము అడ్డగించుకుంటాయి. పైకి చూస్తే సాధించినట్టే కనబడే విషయాల దగ్గరికే మళ్ళీ వస్తాయి. వాటిని మళ్ళీ కొత్తగా మొదలుపెడతాయి. మొదటి ప్రయత్నాలలోని లోపాలను, బలహీనతలను, పనికిమాలినతనాన్ని నిర్దాక్షిణ్యమైన సమగ్రతతో ఖండిస్తాయి. తమ ప్రత్యర్థిని పడదోసినట్టు కనిపిస్తాయి గాని, ఆ ప్రత్యర్థి నేలలోంచి కొత్తశక్తి పొందుతాడు, మరింత శక్తివంతంగా ఆ విప్లవాల ముందు తిరిగి లేస్తాడు. అవి తమ స్వంత ఆశయాల అంతులేని విస్తృతికి తామే బెదిరిపోతాయి. ఇదంతా ఎప్పటిదాకా సాగుతుందంటే, ఇక వెనక్కి తిరగడం అసాధ్యమైపోయే పరిస్థితి ఏర్పడేదాకా...." (ది ఎయిటీన్త్ బ్రుమేర్ ఆఫ్ లూయీ బోనపార్టీ). ఈ మాటలు విశ్వాసచర్యగా పనిచేసి కొంత నమ్మకాన్ని కలిగించవచ్చు. కాని అసలు విషయం విశ్వాసం కన్న ముఖ్యమైనది. అది ఒక శ్రామికవర్గ రాజ్యపు సమస్యల గురించిన ఒక శాస్త్రీయ ప్రకటన.

సోషలిస్టు దశకు, విప్లవానికి ఉన్న కర్తవ్యమేమంటే మానవ చరిత్రలోనే మొదటిసారిగా సాంఘిక సంబంధాలను ఆస్తి-రహిత చట్రంలో నిర్మాణం చెయ్యడం. అదికూడ సాంఘిక సంబంధాలన్నీ ఏవో ఒక రకమైన ఆస్తి రూపాలతో నిర్ణయమవుతున్న చారిత్రక సందర్భంలో చెయ్యవలసి ఉంటుంది. ఈ ఆస్తి రూపాలన్నిటికీ మనుషులు సుదీర్ఘకాలంగా అలవాటుపడి ఉన్నారు. ఆస్తి రూపాలతోనే గాక, ఆ ఆస్తి రూపాలకు అనుబంధంగా ఉన్న భావజాలాలతో కూడ మనుషులు ముడి వేసుకుని ఉన్నారు. అందువల్ల సోషలిజమంటే వివిధ రకాల ఆస్తి రూపాలకు వ్యతి

రేకంగా, ఆ ఆస్తి రూపాలతో సంబంధంలో ఉన్న తప్పుడు చైతన్యానికి (భావజాలాలకు) వ్యతిరేకంగా పోరాటాల దశ. ఆస్తి రూపాలు నామమాత్రంగానే కొనసాగినా, కొన్ని సందర్భాలలో అసలు కొనసాగకపోయినా ఈ భావజాలాలు ఉపరితలంలో కొనసాగుతూనే ఉంటాయి. వివిధ ఆస్తి రూపాలపట్ల వ్యతిరేకతా, పోరాటమూ ఉత్పత్తి సంబంధాల ద్వారా సాగి విజయం సాధిస్తుంది. మానవశ్రమ ఒక్కటే చైతన్యవంతమైన ఉత్పత్తిశక్తి అనే గుర్తింపుమీద ఈ పోరాటం ఆధారపడుతుంది. వివిధ ఆస్తి రూపాలు, వాటితో కలగలిసి ఉండే తప్పుడు చైతన్యం ఈ అంశాన్ని అస్పష్టం చేస్తాయి. మనుషులు ఈ వాస్తవాన్ని, ఈ లక్షణాన్ని గుర్తించలేకపోతారు. ఆచరణ ద్వారా మాత్రమే ఈ గుర్తింపు కలుగుతుంది. తద్వారానే నూతన మానవులు ఉద్భవిస్తారు. ఈ దశనే మార్క్స్ 'శ్రామికవర్గ విప్లవ నియంతృత్వ' దశ అన్నాడు. నిజమైన ఉత్పత్తిదారులయి కూడ ఉత్పత్తి సాధనాల యాజమాన్యం లేని కార్మిక వర్గాన్ని మానవ చరిత్ర సృష్టించింది. సాంఘిక సంబంధాలను ఆస్తిరహిత చక్రంలోకి పరిణమింపజేసే బాధ్యతను మార్క్సిస్టు సిద్ధాంతం ఈ వర్గంమీదనే పెట్టింది. సోషలిజం దశలో రాజ్యపు రూపం శ్రామికవర్గ నియంతృత్వంగా ఉంటుందనే భావన, ఉత్పత్తి సాధనాల యాజమాన్యం నుంచి దూరమైన ఉత్పత్తిదారులు వర్గంగా ఆవిర్భవించినప్పుడే రూపొందుతుందనుకుంటాను. ఈ భావన ఎంత సరైనదో పారిస్ కమ్యూన్, విస్తరించబడిన పారిస్ కమ్యూన్ చూపాయి. ఐతే సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ ఇరవయో మహాసభతో ఈ భావనకు లోపలినుంచే ఒక సవరణ వచ్చింది. శ్రామికవర్గ నియంతృత్వమనేది, ప్రజలందరి నియంతృత్వంగా మారిపోయింది. ప్రజలందరి నియంతృత్వం అనే మాటలోని తార్కిక అపసవ్యతను విస్మరించి, ఆ మాటకు అర్థం చెప్పుకుంటే, శ్రామికవర్గం అప్పటికే తన కర్తవ్యాలను సాధించిందని, తనను తాను స్వతంత్ర వ్యక్తులుగా, స్వతంత్ర ప్రజలుగా పరిణమింప జేసుకున్నదని, అన్ని వైరుధ్యాలు స్వభావంలో మిత్రవైరుధ్యాలుగా మారిపోయిన స్థితి వచ్చిందని అర్థం. అటువంటి స్థితిలో నియంతృత్వం, ప్రజలందరి నియంతృత్వమైనా సరే, అవసరమా అనేది అనుమానాస్పదం. చైనా కమ్యూనిస్టు పార్టీ ఈ భావనను సరిగ్గానే ఖండించింది. మొహంతీ సోవియట్ కమ్యూనిస్టు పార్టీ భావనల తర్వాత జరిగిన చర్చమీద అభిప్రాయాలు ప్రకటించే బదులు, 'శ్రామికవర్గ నియంతృత్వం గాని, ప్రజల నియంతృత్వం గాని, ఏదయినా' అని అలవోకగా రాయడం కాస్త దురదృష్టకరం.

శ్రామికవర్గ నియంతృత్వ దశ ఎటువంటి దశ అని నేననుకుంటానంటే, కొనసాగుతున్న అన్ని ఆస్తి రూపాలను, ఆ ఆస్తి రూపాలకు, అంతకుముందరి ఆస్తి రూపాలకు భావజాల పరమైన సమర్థనలను రూపుమాపవలసిన దశ అది. ఎందుకంటే కార్మికుడు మాత్రమే తనను తాను రెండు స్వేచ్ఛలతో గుర్తించుకో గలడు. సామాజిక సంబంధాల క్రమంలో తనకు తాను విధించుకున్న సామాజిక సంకెళ్ళ నుంచి కార్మికుడు విముక్తం కాగలడు. ఆ సంకెళ్ళు మొదటిది ఆస్తి, రెండోది దానికి అనుబంధంగా ఉండే తప్పుడు చైతన్యం. ఈ చారిత్రక కర్తవ్యాన్ని సోషలిజం దశలో కార్మికుడికి అప్పగిస్తుంది మార్క్సిజం. ఈ దశలో కార్మికవర్గ రాజ్యం వివిధరకాల ఆస్తి ప్రతినిధుల నుంచీ, ఆ ఆస్తి రూపాల భావజాలాల ప్రతి నిధుల నుంచీ గట్టి వ్యతిరేకతను ఎదుర్కొంటుంది. ఇక్కడే ఇంతకుముందు ఉదహ రించిన మార్క్స్ మాటలకు ప్రాధాన్యత ఉంది. అనేక రకాల రూపాలు, చనిపోయి నట్టే కనిపించినవి కూడ నిజానికి ఇనుమడించిన శక్తితో తిరిగి రావచ్చును.

అక్టోబర్ విప్లవం నుంచి సాంస్కృతిక విప్లవందాకా ఉన్న మహత్తర విప్లవ కాలం ఈ సమస్యను స్పష్టంగా ముందుకు తెచ్చింది. తొలిదశలో, సోషలిస్టు ఆచ రణ, విప్లవ శత్రువులను ప్రధానంగా ఆ ప్రయోగం సాగుతున్న సమాజానికి బైటనే (అంటే సోవియట్ యూనియన్‌కు బైటనే) చూసింది. అంటే ప్రమాదం సామ్రాజ్య వాద దేశాల నుంచి వస్తుందని భావించింది. ఇటువంటి శత్రువు గుర్తింపు రాజ్యాధి కార స్వభావంపైన, దాని అంతర్గత నిర్మాణంపైన ప్రభావాన్ని చూపుతుంది. ఆ తర్వాతి దశలో, ఈ అనుభవం నుంచి నేర్చుకుంటూ, చైనాలో కొనసాగిన అనుభ వంతో, విప్లవ శత్రువులను ప్రధానంగా సమాజంలోనే, ఇంకా చెప్పాలంటే పార్టీ లోనే గుర్తించడం జరిగింది. అయితే బైటి శత్రువు ఉనికిని విస్మరించడం జరగలేదు. ఇటువంటి శత్రువు గుర్తింపు వల్ల రాజ్యాధికార స్వభావంలోనూ, దాని నిర్మాణం లోనూ కొన్ని అంశాలుంటాయి. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ ఇరవయో మహాసభ తర్వాత స్టాలిన్ గురించి సి పి ఎస్ యు కూ, సి పి సి కీ మధ్య జరిగిన చర్చ ఈ అంశాన్ని వెలుగులోకి తెచ్చింది.

మానవ సమాజంలో సామ్రాజ్యవాదానికి ఇంకా పట్టు ఉన్న దశలో, ఆ పట్టు అనేక పెట్టుబడిదారీ పూర్వ ఆస్తిరూపాలతో కలగలిసి ఉన్నప్పుడు, సోషలిజం బలవం

తంగా జాతీయ సరిహద్దుల లోపలికి కుంచించుకు పోవలసి వస్తుంది. ఆ సరిహద్దులు పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదం నిర్ణయించినవే అయి ఉంటాయి. ఆ విధంగా సోషలిజానికీ, కార్మికవర్గ నియంతృత్వానికీ వ్యతిరేకమైన శక్తులు, సోషలిజం ఆచరించబడే మానవ సమాజ ఖండానికి లోపలా బైటాకూడ ఉంటాయి. వర్గాల సమీకరణతో పునాదిలో వరుసగా వర్గపోరాటాలు జరపడంద్వారా, ప్రజాసమీకరణతో ఉపరితల రంగాలలో సాంస్కృతిక విప్లవం జరపడంద్వారా లోపలి శత్రువును ఎదుర్కోవచ్చును. సైనిక రాజ్యాంగయంత్రం ఉన్న బైటి శత్రువు కార్మికవర్గ రాజ్యాంగ యంత్రం కూడ అటువంటి దారిలోనే నడిచే పరిస్థితి కల్పిస్తాడు. ఈ రెండు కర్తవ్యాలను నెరవేర్చడంలో, కార్మికవర్గ రాజ్యం దేశజాతీయ చట్రంలోకి కుంచించుకుపోయే ప్రమాదం ఉంది. తద్వారా సోషలిజపు అంతర్జాతీయ స్వభావం భగ్నమైపోయే ప్రమాదం ఉంది. ఇక్కడ 'గోథా కార్యక్రమ విమర్శ' లో మార్క్స్ చెప్పిన మాటలు ఉపయోగకరంగా ఉంటాయి. పోరాటాలంచేసే కార్మికవర్గం స్వదేశంలో తనను తాను ఒక వర్గంగా సంఘటితం చేసుకోవలసి ఉంటుందనేది సుస్పష్టమే. స్వదేశమే తక్షణ పోరాట రంగంగా ఉంటుంది. అంతవరకూ దాని వర్గపోరాటం జాతీయంగా ఉంటుంది. కానయితే అది సారంలో కాదు, కమ్యూనిస్టు ప్రణాళికలో రాసినట్టు 'రూపం' లో మాత్రమే. అంతర్జాతీయ ప్రాతిపదిక లేనట్టయితే, కార్మిక వర్గ రాజ్యాలు జాతీయ చట్రాలలో చిక్కుకుపోతాయి. సి. పి. ఎస్. యు. శాంతి యుత పరివర్తనను, సహజీవనాన్ని ప్రతిపాదించిన తర్వాత జరిగిన చర్చలో సి. పి. ఎస్. యు., సి. పి. సి. ల మధ్య ఈ అంశంకూడ లేవనెత్తబడింది. సి. పి. ఎస్. యు. ప్రతిపాదన ఒకే దెబ్బతో ఒకవైపున సామ్రాజ్యవాదానికీ సోషలిజానికి మధ్యన వైరుధ్యంలో ఐక్యత అంశాన్నే నొక్కి చెపుతోంది. మరోవైపున ఏవైనా పోరాటాలున్నా అవి శత్రుపూరితమైనవి కావని చెబుతోంది. ఈ ప్రతిపాదనను తిరస్కరించి సి. పి. సి. సరైన పనిచేసింది (మొహంతీ వ్యాసం, ఒక విచిత్రమైన అర్థంలో సి. పి. ఎస్. యు. వైఖరిని సమర్థిస్తోంది. ఆయన నచ్చజెప్పే, హేతుబద్ధంగా ఉండే విధానాన్ని అవలంబించడం, పార్టీ ప్రణాళికను, పని తీరును కొనసాగించడం కర్తవ్యంగా ఉంటుందని ఆయన అన్నప్పుడు ఈ సమర్థనే ధ్వనిస్తోంది. మొహంతీ ఏం చెప్పదలిచారో ఇక్కడ స్పష్టంగా లేదు. హేతుబద్ధంగా ఉండకుండా నచ్చజెప్పకుండా సంఘటిత పరచడం సాధ్యమని ఆయననుకుంటున్నారా? ప్రపంచ

వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలు హేతుబద్ధంగా లేకుండానే, నచ్చజెప్పకుండానే, పని చేస్తున్నాయనుకుంటున్నారా? కేవలం హేతుబద్ధత, నచ్చజెప్పడాల వల్లనే సామాజిక మార్పులు జరుగుతాయని ఆయన చెప్పదలుచుకున్నారా? లేదా అలా జరగాలని ఆయన అంటున్నారా? హేతుబద్ధత, నచ్చజెప్పడం, పనితీరుద్వారా రుజువు చేసుకోవడం అనేవి అంతిమంగా శాంతియుత పరివర్తన, సహజీవనం అనేవాటికి తోడుగా ఊతపదాలుగా మారిపోతాయేమోనని నా అనుమానం).

మార్క్సిజాన్ని ఒక శాస్త్రంగా గుర్తిస్తున్నారు. అన్ని శాస్త్రాలలాగానే మార్క్సిజం కూడ రూపాన్ని దాటి సారాంశాన్ని గ్రహించడానికి ప్రయత్నిస్తుంది. మానవ చరిత్రకు మార్క్సిజం సూచించే నియమాల్లో కలిసి ఉండేదేమంటే, వ్యక్తుల చైతన్యం వాళ్ళ ఉనికిద్వారా నిర్ణయమవుతుందిగాని చైతన్యంద్వారా ఉనికి నిర్ణయం కాదు అని. ఈ శాస్త్రీయ అన్వేషణే ఈ శాస్త్రవేత్తలను ఇతర మానవులకన్న అగ్ర స్థానంలో ఉంచుతుంది. సరిగా ప్రకృతి శాస్త్రాలలో కూడ ఇట్లాగే జరుగుతుంది. ఇతర మానవులకన్న ఒక కమ్యూనిస్టు ఎందుకు భిన్నమైనవాడంటే, కేవలం అతను మానవజాతి విశాల ప్రయోజనాల కోసం త్యాగం చేస్తాడు గనుక మాత్రమే కాదు. కాని సామాజిక చలన నియమాలపట్ల అతనికి విశాల అవగాహన ఉన్నది గనుక, ఆ జ్ఞానాన్ని సామాజిక ప్రయోజనం కోసం వినియోగిస్తాడు గనుక. ఒక శాస్త్రవేత్త జ్ఞానానికీ, మామూలు మనిషి జ్ఞానానికీ మధ్య ఎప్పుడూ అఖాతం ఉంటూనే ఉంటుంది. ఈ అఖాతాన్ని వివిధ ఆస్తి విధానాలు రూపొందించే తప్పుడు చైతన్యాల క్రమాలు పూరిస్తుంటాయి. ఈ తప్పుడు చైతన్యాల క్రమాలను మొహంతీ పరాయీకరణల క్రమం అంటున్నారు. ఈ పరిస్థితి వల్లనే అధికారాన్ని హస్తగతం చేసుకోవడం, కార్మికవర్గం పక్షాన దాన్ని కాపాడడం అనే అగ్రగామి పాత్ర పార్టీ స్వీకరించవలసిన అవసరం వస్తుంది. సామాజిక చలన నియమాలను మొదట కార్మికవర్గం గుర్తించే వరకూ, తర్వాత కార్మికేతర వర్గాలన్నీ గుర్తించేవరకూ ఈ క్రమం కొనసాగవలసి ఉంటుంది. సోషలిజం అనే ప్రకాశిత లక్ష్యాలలో ఒకటి శాస్త్రవేత్తకూ, ఇతరులకూ మధ్య ఉన్న అఖాతాన్ని ఆచరణద్వారా, ఆచరణలో మాత్రమే పూరించడం.

ఈ అగ్రగామి పాత్ర అనేదికూడ తరచుగా చర్చనీయాంశమవుతూ ఉంటుంది. మొహంతీ వ్యాసంలో ఈ చర్చ మరొక కోణం నుంచి వచ్చింది.

'రివిజనిజం ప్రమాదం, సామ్రాజ్యవాద కుట్రల ప్రమాదం పాలకపార్టీ నాయకత్వం సమస్యలు కానక్కరలేదు. అని విప్లవాన్ని రక్షించుకునే పోరాటంలో పాల్గొనవలసిన సమస్త విప్లవశక్తుల సమస్య కావాలి' అని ఆయన రాశారు. విప్లవాన్ని అంతిమంగా విప్లవ శక్తులే కాపాడుకోవాలనడం అందరికీ తెలిసిందే. కాని, మొహంతీ ఏం చెప్పదలుచుకున్నారంటే విప్లవ పార్టీ నాయకత్వానికి ఆ భయంగాని, ఆందోళనగాని ఉండనక్కరలేదని. కాని నాయకత్వానికే జరగనున్న కుట్ర గురించి అవగాహనగాని, భవిష్యత్ దృష్టిగాని, ఆందోళనగాని లేనట్టయితే, ఆ నాయకత్వానికి చలన నియమాల మీద పట్టు లేదన్నమాట. చలన నియమాలు కార్మిక వర్గ రాజ్యానికి ఎటువంటి ప్రభావాలు తెస్తాయో తెలియదన్నమాట. అందువల్ల కుట్రకుగాని, జరగనున్న కుట్రకు గాని వ్యతిరేకంగా దాడి కోసం గాని, ఆత్మరక్షణకోసం గాని అది వర్గాలను సంసిద్ధం చేయజాలదు. ఆ వర్గాలను సమీకరించడంలో విఫలమవుతుంది. కార్మిక వర్గానికి చలన నియమాల గురించి తెలిసి ఉంటే మొహంతీ రాసినది సరిగ్గానే సరిపోతుంది. కాని కార్మికవర్గం ఆ జ్ఞానాన్ని పోరాటాల క్రమంలోనే పొందగలుగుతుందని పైన చూశాం. ఆ పోరాటాలు నతపాలంటే నాయకత్వానికి సోషలిస్టు రాజ్యానికి రానున్న ప్రమాదాల గురించి భవిష్యత్ దృష్టి ఉండవలసి ఉంటుంది.

విప్లవ ఆచరణ వేత్తలు 1950ల చివర, 60ల మొదట చర్చించిన విషయాలను సంలీనం చేసుకోకుండా, ఆ ఆచరణను పరిగణనలోకి తీసుకొని కొత్త చర్చనీయాంశాలను గుర్తించకుండా ఎవరయినా సోషలిస్టు ఆచరణ గురించి చర్చిస్తే అది చర్వితచరణంగానూ ఉంటుంది. ప్రయోజనకరంగానూ ఉండదు. అటువంటి ఒక కొత్త రంగాన్ని మొహంతీ సూచించారు. అది చాల ముఖ్యమైనదని నేననుకుంటాను. ఉత్పత్తి విధానాన్ని ప్రజాస్వామికం చేసే క్రమంలో అసమగ్రత గురించి ఆయన వ్యాసంలో సూచించారు. సోవియట్ యూనియన్‌లోనూ, చైనాలోనూ సోషలిస్టు ఆచరణ తొలి రోజులలో ఉత్పత్తి యూనిట్లను ఎట్లా నిర్వహించాలనే విషయమై సైద్ధాంతిక చర్చలు జరిగాయి సోషలిస్టు ఆచరణను ఇతోధికంగా అర్థం చేసుకోవడానికి ఈ చర్చలు ఉపయోగపడ్తాయి. ఈ చర్చలలో శ్రమ కేటాయింపు సమస్య, శ్రమకు విలువ కట్టడం సమస్య, శ్రమ ఉత్పత్తికి విలువ కట్టే సమస్య, మిగులును వినియోగించుకునే సమస్య, సామాజిక అధికారం సమస్య, పార్టీకీ, రాజ్య విభాగాలకూ, ఉత్పత్తిదారులకూ మధ్య సంబంధాల సమస్య తలెత్తాయి. ఒక

సామాజిక నిర్మాణ రూపంగా సోషలిజం, ఉత్పత్తి సంబంధాలమీద సామాజిక అధికారాన్నికల్పించడం ద్వారా సామాజిక సంబంధాలను పునఃసృష్టిస్తుంది. ఇటువంటి ప్రజాస్వామిక ఉత్పత్తి యూనిట్లే సోషలిజాన్ని నిర్మించడానికీ, దాన్ని పరిరక్షించడానికీ పునాదిరాళ్ళుగా పని చేస్తాయి. ఇటువంటి పునాదిరాళ్ళ గురించి మొహంతీ వంటి వ్యక్తులు గణనీయమైన కృషి చేశారు. నిజానికి చైనీస్ కమ్యూన్లమీద మొహంతీ చేసిన కృషి సోషలిస్టు ఆచరణ గురించి చర్చించడానికి ఎంతో సమాచారాన్ని అందజేస్తుంది. అది భారతదేశానికి చాల ఉపయోగకరంగా ఉంటుందికూడ. సైద్ధాంతికంగా కమ్యూన్ను పునర్దర్శించి, సోషలిస్టు ఆచరణ బలహీనతలు ఎక్కడున్నాయో గుర్తించడం సాధ్యమవుతుందా ? ఆ బలహీనత అగ్రగామి పాత్రలో ఉందా, పార్టీ భాగస్వామ్యంలో ఉందా ? ప్రజాస్వామిక ఆచరణ లేకపోవడంలో ఉందా ? ప్రస్తుత చర్చ కేంద్రీకరించే ఏ అంశాన్నయినా సరే అక్కడ గుర్తించవచ్చునా ?

మొహంతీ వ్యాసాన్ని అర్థం చేసుకోవడం నాకు ఇబ్బందయింది. ఆయన సోషలిజం పరిధులను మార్చివేశారని నాకనిపించింది. సోషలిజం అనేది స్వేచ్ఛకు సంబంధించినది అనే ప్రతిపాదనతో ఆయన ప్రారంభించారు. నాకు అర్థమైనంతవరకు సోషలిజం అనేది సామాజిక సంబంధాలను పునర్నిర్మించే ఒక స్పష్టమైన ప్రణాళిక. ఈ పునర్నిర్మాణంలో అది ఆస్తికి ఉండే నిర్ణయాత్మక పాత్రను, ఆస్తి రూపాలనుంచి తలెత్తే భావాలను రూపు మాపడాన్ని దృష్టిలో పెట్టుకుంది. ఈ రూపాలకు వ్యతిరేకంగా పోరాడడానికి స్వేచ్ఛ ఉండే దశ ఇది. కనుక స్వేచ్ఛను ఈ పోరాటాలలో భాగమైనదిగా గుర్తించకపోతే, చివరికి పలాయనాన్ని (పరాయీకరణను) కూడ స్వేచ్ఛగా వ్యాఖ్యానించవచ్చు. వర్గాధిపత్యం మీద పోరాడడానికీ, విముక్తి సాధించడానికీ వ్యక్తిగత స్వేచ్ఛ అనే భావనలు, తెగ, జాతి, కుల, మత ఆధిపత్యాలనుంచి విముక్తి ఎంత ముఖ్యమైన పాత్ర వహిస్తాయో, అంత ముఖ్యమైన పాత్ర వహిస్తాయి.

[మనోరంజన్ మొహంతీ ఇంగ్లీషులో రాసిన తెలుగు అనువాదంపై ప్రతిస్పందన ఇది. తెలుగు అనువాదంలో అనువాదకుల పాత్ర ఎక్కువగా కనబడుతోంది. నేను ఇంగ్లీషు వ్యాసం ఆధారంగానే ఈ ప్రతిస్పందన రాశాను. నా దగ్గర ఉన్న ఇంగ్లీషు వ్యాసానికీ, (అనువాదానికి మూలమైన) 'జనత' పత్రికలో అచ్చయిన ఇంగ్లీషు వ్యాసానికీ కొన్ని భేదాలు ఉన్నట్టున్నాయి.]

విరసం 13వ మహాసభల్ని జయప్రదం చేయండి !

1992 జనవరి 11, 12. 13 తేదీలలో గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో (గాంధీపార్క్ ప్రక్కన) విరసం 13వ మహాసభలు జరుగుతాయి. ఈ సభలలో నాలుగంశాల పైన ప్రసంగాలు, చర్చలు ఉన్నాయి. భారత దేశ ఆర్థిక వ్యవస్థపై సామ్రాజ్యవాద ఆధిపత్యం గురించి పౌరహక్కుల సంఘ కార్యదర్శి కా॥ బాలగోపాల్, రష్యా పరిణామాల గురించి విరసం కార్యవర్గ సభ్యులు కా॥ చలసాని ప్రసాద్, విరసం సాంస్కృతిక కర్తవ్యాల గురించి విరసం కార్యదర్శి కా॥ వి. చెంచయ్య, దళిత ఉద్యమం పట్ల విరసం అవగాహన గురించి విరసం కార్యవర్గ సభ్యులు కా॥ సి. యస్. ఆర్. ప్రసాద్ ప్రసంగిస్తారు. కామ్రేడ్స్ నారాయణస్వామి, సౌదాల నిర్వహణలో 11వ తేదీ సాయంత్రం 'కవిసభ' జరుగుతుంది. ఈ మూడు రోజులూ విరసం, జననాట్యమండలి, అరుణోదయ సంస్థల సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి. కా॥ జి. కళ్యాణరావు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు.

ప్రస్తుతం దేశంలో యుద్ధ వాతావరణం ఉంది. దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు చెలరేగుతున్నాయి. ప్రజలు తమ సమస్యల పరిష్కారంలో చైతన్యంతో ముందుకు వస్తున్నారు. ఆదేసమయంలో ప్రజా ఉద్యమాలపైన పాలకవర్గ నిర్బంధం తీవ్రమవుతోంది. భూమికోసం పోరాడుతున్న తెలంగాణా ప్రజలు సరిహద్దు భద్రతా దళాలు ఎక్కుపెట్టిన తుపాకుల కింద తమ మనుగడ సాగిస్తున్నారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపలేని ప్రభుత్వం తుపాకీతో రాజ్యపాలన చేస్తోంది. నక్సలైట్ల ఏరివేత పేరుతో దొరికినవాళ్ళను పట్టుకొని పోయి కాల్చి చంపుతున్నారు. పౌరహక్కుల సంఘనాయకుడు, న్యాయవాది అయిన నర్రా ప్రభాకరరెడ్డి హత్యగాని, జర్నలిస్టుగా నిర్భయంగా ప్రజల సమస్యలను వెలికి తెచ్చిన గులాం రసూల్ హత్యగానీ పోలీసుల పాశవిక చర్యలకు పరాకాష్ఠ. ఈ నిర్బంధ నేపథ్యంలో రచయితల పాత్ర ఎంతో బాధ్యతాయుతమైంది. రచయితలు ప్రజల సమస్యలను పట్టించుకోవాలి. ప్రజల బాధల్ని, గాథల్ని తమ కలాల్లో, గళాల్లో పలికించాలి. నిర్బంధం విరుచుకు పడ్డ కీలక సమయాల్లో కూడా రచయితలు నిర్భయంగా ప్రజల పక్షం నిలవాలి. ఈ నేపథ్యంలో జరుగుతున్న విరసం మహాసభల్ని జయప్రదం చెయ్యాల్సిందిగా ప్రజలను, రచయితలను, కళాకారులను విరసం కోరుతోంది.

వి. చెంచయ్య, రాష్ట్ర కార్యదర్శి, విరసం.

SRJANA Telugu Monthly January 1992
Regd. No. with the Registrar of Newspapers for India 10953/67

పాఠకులకు, రచయితలకు, పోషకులకు

నూతన సంవత్సర

అభినందనలు

చిరునామా మార్పు గమనించగలరు

సృజన
ఫ్లాట్ 3, ఫ్లోర్ 2
లక్ష్మి అపార్ట్‌మెంట్స్
నలగొండ చౌరస్తా
మలక్‌పేట్
హైదరాబాద్ - 500 036

SRJANA
Flat 3, Floor 2
Laxmi Apartments
Nalgonda Chourastha
Malakpet
HYDERABAD-500 036